ఈనాడు

విజయవాడ 12-2-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 183

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



మస్త్ ఫోన్లు జబర్దస్త్ ఆఫర్లు

FLAT 50% OFF on iPhones

మీ VALENTINEకు VALENTINE'S గిఫ్ట్

iPhone X ₹47,990*
iPhone SE ₹9,990*
iPhone 6 ₹14,990*
iPhone 8 ₹33,990*

*Conditions apply

SAMSUNG

Cashbacks you'll love at first sight
Rush to your nearest Sangeetha store now

Galaxy S7 edge ₹5000.00 Cashback
Galaxy C7 Pro ₹2500.00 Cashback
Galaxy S8 | S8+ ₹10000.00 Cashback
Galaxy Note8 ₹8000.00 Cashback
Galaxy J7 Max ₹1400.00 Cashback
Galaxy J7 Pro ₹2000.00 Cashback

Paytm mall

*Terms & Conditions apply

OWN NOW. PAY LATER.

vivo Smart Phone
VIVO V7 ₹1,432 pm
VIVO V55S ₹933 pm

oppo
Oppo A71 ₹1,699 pm
Oppo F5 ₹1,683 pm

నిరీక్షణ ఇక లేదు

NOW READILY AVAILABLE AT SANGEETHA

mi
Mi A1
Mi 5A

Lenovo
Lenovo K8 Note

Moto C Plus
Moto GS Plus
Moto X4

Lucky winners get to celebrate with their valentine in the sky!

Finance options from
BAJAJ FINSERV
HDB FINANCIAL SERVICES
CAPITAL FIRST
HDFC BANK

5% ADDITIONAL CASH BACK ON HDFC CARDS

*Conditions apply.

You can also shop at www.sangeethamobiles.com

Sangeetha® PIONEER THEN, LEADER NOW.

సంగీత

43 YEARS | 9 STATES | 450 STORES | 20 MILLION HAPPY CUSTOMERS

For feedback/suggestions, write to us at support@sangeethamobiles.com or call us at 080 4939 7000 | Connect with us SangeethaMobilesIndia | For terms and conditions, visit www.sangeethamobiles.com

*Effective prices after exchange and when bought on EMI

ఇప్పుడు హిందూపురంలో అనంతపురం, ధర్మవరం, గుంతకల్, కదిరి, కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, కర్నూలు, ఆదోని, నంద్యాల, మదనపల్లి, తిరుపతి, నెల్లూరు, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, తడ, వెంకటగిరి, శ్రీ కాళహస్తి, ఒంగోలు, చిలకలూరిపేట, గుంటూరు, మచిలీపట్టణం, నూజివీడు, తెనాలి, విజయవాడ, గన్నవరం, అమలాపురం, భీమవరం, కాకినాడ, మండపేట, పాలకొల్లు, పలమనేరు, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, తణుకు, అనకాపల్లి, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం

తెలంగాణ లో 75 స్టోర్లు
ఆంధ్రప్రదేశ్ లో 55 స్టోర్లు

SAMSUNG LG G NOKIA Panasonic Lenovo mi oppo vivo GIONEE honor LAVA micromax INTEX

గృహ, వాహన అమ్మకం లేదా కొనుగోలు కోసం
THE EENADU WAY CLASSIFIEDS
www.eenaduclassifieds.com
ప్రకటన ఉచితం... సేవలు తక్షణం

ఈనాడు



ప్రియ పచ్చళ్ళు అసలైన సంప్రదాయ రుచులు
priya PICKLES
32 రకాలలో లభ్యం
www.priyafoods.com
"Download Eenadu Mobile App and click to view range and products"

విజయవాడ 12-2-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 183
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



మాస్కో సమీపంలో కూలిపోయిన విమాన శకలం

కుప్పకూలిన రష్యా విమానం

71 మంది దుర్మరణం

మాస్కో: రష్యాకు చెందిన ప్రయాణికుల విమానం ఒకటి ఆదివారం మాస్కో వెలుపల కూలిపోయింది. అందులోని 65 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది దుర్మరణం పాలయ్యారు. ఆంటనోవ్ ఏఎన్-148 శ్రేణికి చెందిన ఈ విమానాన్ని శారాతోవ్ ఎయిర్‌లైన్స్ సంస్థ నిర్వహిస్తోంది. ఇది.. మాస్కోలోని దోమోడెడోవో విమానాశ్రయం నుంచి బయలుదేరింది. ఉరల్స్ ప్రాంతంలోని ఒర్స్క్ నగరానికి చేరుకోవాల్సి ఉంది. అయితే టేకాఫ్ అయిన రెండు నిమిషాలకే రాడార్ తెరపై ఇది గల్లంతైంది. మాస్కో శివార్లలోని రామెన్‌స్కీ జిల్లాలో కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. అగ్నికీలల్లో చిక్కుకున్న విమానం ఆకాశం నుంచి కిందపడిపోవడాన్ని అర్గునోవో గ్రామంలోని ప్రజలు చూశారు. మారుమూలన హిమమయంగా ఉన్న ఈ ప్రాంతంలోకి చేరుకోవడానికి సహాయ సిబ్బంది చాలా కష్టపడ్డారు. రోడ్డు మార్గంలో చేరుకునే అవకాశం లేకపోవడంతో కాలినడకనే అక్కడికి వెళ్లారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. బాధితుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. విమానం కూలిపోవడానికి కారణాలను పరిశీలిస్తున్నట్లు రష్యా రవాణా మంత్రిత్వశాఖ పేర్కొంది. వాతావరణ పరిస్థితుల వల్ల ఇలా జరిగిందా లేక మానవ తప్పిదం కారణమైందా అన్నది శోధిస్తున్నట్లు వివరించింది. రష్యాలో తయారైన ఈ విమానం ఏడేళ్ల నాటిది. ఇటీవల దేశంలో హిమపాతం రికార్డు స్థాయికి చేరింది. ఇలాంటి వాతావరణ పరిస్థితులకు తోడు కాలంచెల్లిన విమానాలను ఉపయోగిస్తుండటంవల్ల రష్యాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శారాతోవ్ ఎయిర్‌లైన్స్ సంస్థ 1930లలో ఏర్పాటైంది. దేశంలోని 35 నగరాలకు విమానాలను నడుపుతోంది.

ముంబయి గగనతలంలో తప్పిన ముప్పు

చేరువగా వచ్చిన రెండు విమానాలు 2లో

బిచ్చమెత్తుకోవాలా!

- చట్టబద్ధ వాటా కోసం కేంద్రం చుట్టూ తిరగాలా?
- రాష్ట్రానికి జరిగిన అన్యాయం చూశాక భాజపాపై మిత్రపక్షాల్లోనూ అపనమ్మకం!
- ఐదు ముఖ్యాంశాలు వదిలేసి మిగతావి మాట్లాడుతున్నారు
- రామాయపట్నాన్ని ప్రత్యామ్నాయంగా చూపారు
- రైల్వే మంత్రి మాటలనుబట్టి జోన్ రాదనే అనిపిస్తోంది
- వైకాపాకు నిలకడ లేదు • పోరాటంలో వెనుదిరిగే ప్రసక్తే లేదు
- ఎంపీలు జయదేవ్, రామ్మోహన్‌నాయుడు, మంత్రి కళావెంకట్రావు, కుటుంబరావుల స్పష్టీకరణ



ఆదివారం ఉండవల్లిలోని సీఎం నివాస ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గల్లా జయదేవ్. చిత్రంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళావెంకట్రావు

ఈనాడు - అమరావతి

కేంద్ర బడ్జెట్‌పై తెదేపా నేతలు మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. మూడున్నరేళ్లలో రాష్ట్రానికి మేం చేసినవి ఇవీ అంటూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు విడుదల చేసిన 27 పేజీల నోట్‌పై ప్రతిస్పందించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో కొందరు పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కిమిడి కళావెంకట్రావు, ఎంపీలు జయదేవ్, రామ్మోహన్‌నాయుడు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. తెదేపా పోరాటం చేస్తున్న అంశాలపై నిర్దుష్టమైన హామీగానీ, స్పష్టత గానీ ఇవ్వకుండా రాజ్యాంగపరంగా, చట్ట ప్రకారం కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులు, పన్నుల్లో రాష్ట్రానికి సహజంగా రావలసిన వాటినీ చేర్చి నివేదికలా మార్చి రాష్ట్రానికి తామేదో గొప్ప మేలు చేశామన్నట్టు భాజపా చెబుతోందని సమావేశంలో భావించారు. భాజపా వాదనలోని డొల్లతనాన్ని నేరుగా ప్రజలకే అర్థమయ్యేలా వివరించాలని నిర్ణయించారు. అనంతరం కళావెంకట్రావు, జయదేవ్ (మిగతా 2లో)

‘మేము మీకు భిక్షమెత్తుకునేవాళ్లలా కనిపిస్తున్నామా? కేంద్ర పథకాలు, పన్నుల్లో మాకు చట్టబద్ధంగా రావలసిన వాటా కోసం కూడా భిక్షాపాత్ర పట్టుకుని కేంద్రం చుట్టూ తిరగాలా? అదే మీ ఉద్దేశమా? మీరేమైనా మాకు దయాదాక్షిణ్యాలతో (చారిటీ) ఇస్తున్నారా? మేం అంత పనికిమాలినవాళ్లలా కనిపిస్తున్నామా? అసలేమనుకుంటున్నారు మీరు? అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినవే ఇచ్చి మాకేదో గొప్ప మేలు చేసినట్టు ఎందుకు మాట్లాడుతున్నారు?

- విలేకరుల సమావేశంలో ఎంపీ గల్లా జయదేవ్

విభజన చట్టంలో పేర్కొన్న హామీల గురించి అడుగుతుంటే పాస్‌పోర్టు ఆఫీసు ఇచ్చాం, దూరదర్శన్ కేంద్రం ఇచ్చామంటూ కథలు చెబుతారా? అంటే కొత్త రాష్ట్రానికి చట్టబద్ధంగా ఇవ్వాల్సినవీ ఇవ్వరా? ఏదో పక్క దేశంలో ఉన్న రాష్ట్రానికి మేలు చేసినట్టు దానికి ప్రత్యేకంగా నోట్ కూడా విడుదల చేస్తారా? ప్రధానమంత్రి ఆవాస్‌యోజన ఏదో మా రాష్ట్రానికే ప్రత్యేకం అన్నట్టు ఎలా మాట్లాడతారు? అది ప్రధానమంత్రి ఆవాస్‌యోజనే కానీ.. ఆంధ్రప్రదేశ్ ఆవాస్‌యోజన కాదు’

- ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు

చేసింది గోరంత..చెబుతున్నది కొండంత!

విభజన హామీలపై భాజపా వాదనను తిప్పికొట్టిన తెదేపా 12లో

వృద్ధులకు వేలి కష్టాలు

- తిప్పలు పెడుతున్న ‘బయోమెట్రిక్’ విధానం
- పంపిణీపై నగదు కొరత ప్రభావం
- ఇప్పటికీ పూర్తిగా అందని జనవరి పింఛన్లు

ఈనాడు - అమరావతి

ప్రతి నెలా పేదలకు పింఛన్ల పంపిణీ పలు కారణాలతో అస్తవ్యస్తంగా మారుతోంది. వేలిముద్రలు (బయోమెట్రిక్) సరిగా పడక కొన్నిచోట్ల, నగదు కొరతతో మరికొన్నిచోట్ల వృద్ధులకు సకాలంలో పింఛను అందకుండా పోతోంది. సమస్య పరిష్కారానికి కొన్ని జిల్లాల్లో యంత్రాంగం చొరవ తీసుకుంటే, ఇంకొన్ని జిల్లాల్లో వృద్ధులు ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మొత్తంమీద జనవరి నెలకు సంబంధించి 90 శాతం లోపే పింఛన్లు పంపిణీ అయ్యాయి. వివిధ కేటగిరిల్లో 40.84 లక్షల (మిగతా 2లో)



వేలిముద్ర సరిగాపడక పింఛన్ అందలేదంటూ గుంటూరు జిల్లా మంగళగిరి పురపాలక కార్యాలయానికి వచ్చిన వృద్ధులు

- బ్యాంకుల్లో నగదు కొరత శ్రీకాకుళం జిల్లాలో పింఛన్ల పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నగదు కొరతతో జనవరి నెలకు సంబంధించి పింఛన్లు 53 శాతానికే పరిమితమయ్యాయి.
- వృద్ధాప్యం, సాంకేతిక కారణాలతో వేలిముద్రలు సరిగా పడని కారణంగా కర్నూలు జిల్లాలో 23,160 మంది పరిస్థితి గందరగోళంగా మారడంతో సిబ్బంది ధ్రువీకరణతో వృద్ధులకు తాత్కాలికంగా పింఛన్లు పంపిణీ చేశారు.

విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలన్నా నీట్ తప్పనిసరి!

దిల్లీ: విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకుంటున్నవారు సయితం ‘జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష’ (నీట్)లో ఉత్తీర్ణత సాధించడం ఇకపై తప్పనిసరి కానుంది. ప్రతిభావంతులైన విద్యార్థులే విదేశాలకు వెళ్లొచ్చేలా చూడడానికి ఇది అవసరమని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం దేశంలోని ఏ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వైద్యవిద్య అభ్యసించాలన్నా నీట్ ఉత్తీర్ణత తప్పనిసరి. విదేశాలకు వెళ్లేవారికీ దీనిని విస్తరించే యోచన దాదాపు కొలిక్కి వచ్చిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి తెలిపారు. “విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించాక తిరిగి భారత్‌కు వచ్చే వారిలో సగటున 12-15% మంది ‘భారత వైద్య మండలి-ఎంసీఐ’ నిర్వహించే ‘విదేశీ వైద్య పట్టభద్రుల పరీక్ష’ (ఎఫ్‌ఎంజీఈ)లో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. గత అయిదేళ్లలో ఎప్పుడూ 26.9% మించి ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కాలేకపోయారు. ప్రశ్నపత్రం కఠినంగా ఉండడం దీనికి కారణమేమీ కాదని ఒక కమిటీ తేల్చిచెప్పింది. ఈ ఉత్తీర్ణత సాధించకపోతే భారత్‌లో వైద్యవృత్తిని చేపట్టడానికి వారి పేర్లు నమోదు చేసుకునే వీలుండదు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కాని వారు అక్రమ పద్ధతుల్లో వైద్యం చేస్తుంటారు.అది ప్రమాదకరం. అందువల్ల కేవలం సమర్థులైన విద్యార్థులే విదేశీ (మిగతా 2లో)

నిధుల లెక్కలిస్తే.. నిజం తేలుస్తాం



- ఏపీ అభివృద్ధికి ఏం చేశారో చెప్పండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పవన్ కల్యాణ్ డిమాండ్
- హోదాపై నాలుగేళ్లు జాప్యం చేశారేం?
- తెదేపాను ప్రశ్నించిన జనసేన అధినేత • మాజీ ఎంపీ ఉండవల్లితో భేటీ

10లో

నేటి నుంచి జల సంరక్షణ

- అమరావతిలో ప్రారంభం.. సమాంతరంగా అన్ని జిల్లాల్లోనూ
- ఈ నెల మూడో వారంలో ముఖ్యమంత్రి భాగస్వామ్యం

2లో

న్యాయవాదులు సామాజిక ఇంజినీర్లు

- సమసమాజ స్థాపనలో వారి పాత్ర కీలకం
- జస్టిస్ రంజన్‌గొగోయ్ వ్యాఖ్య
- న్యాయపాలన మాతృభాషలో జరగాలి
- జస్టిస్ ఎన్వీ రమణ ఆకాంక్ష

10లో



తెలుగు పత్రికా రంగ ఎవరెస్ట్ శిఖరం
‘స్వాతి’ బలరామ్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు




నీతి నిజాయితీలనే అన్నపానీయాలుగా ప్రేమాభిమానాలనే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా పట్టుదల, కార్యదక్షతలే తన గుండె చప్పుళ్ళుగా ‘స్వాతి’ తల్లి సాహిత్యసేవనే జీవితాశయంగా భావించే శ్రీ వేమూరి బలరామ్ గారు సాహితీలోకానికి వెలుగునిచ్చే చల్లని సూర్యుడు. అభిమానించేవారికి ప్రేమను కురిపించే వెచ్చని చంద్రుడు. లక్షలాది పాఠక హృదయాల్ని ఉర్రూతలూగిస్తోన్న సంపాదక శ్రేష్ఠుడు, పత్రికా రంగంలో ‘స్వాతి’తో జేగంటలు మ్రోగిస్తోన్న ఘనుడు.

ఆయనలా ఆత్మీయతను అంటుగట్టినట్లు మాట్లాడడం, ఆత్మను ఆవిష్కరిస్తున్నట్లు చూడడం, మనుషులమీద గొప్ప ప్రేమున్న ఏ కొద్దిమందికో సాధ్యపడుతుందేమోగానీ, శ్రీ బలరామ్‌గారిలా మనసంతా కనపడేటట్లు నవ్వడం మాత్రం అసాధ్యం.

సృష్టికర్త ఆ బ్రహ్మదేవుడు ‘స్వాతి’ బలరామ్ గారి నుదుట రాసిన మొదటి వాక్యం మాత్రమే ఇప్పటివరకూ జరిగింది. మరెన్నో అద్భుత విజయాలను మిగిలిన వందలాది వాక్యాలలో రాశాడు ఆ బ్రహ్మ. ఆ అద్భుతాలన్నీ ముందు ముందు జరుగుతాయి.

- నాని

ఇదీ సంగతి!



మధ్యప్రాచ్యంలో మొదటి హిందూ ఆలయం

- అబుదాబిలో మోదీ శంకుస్థాపన
- 55 వేల చ.మీ. స్థలంలో సువిశాల మందిరం

దుబాయ్: అబుదాబి-దుబాయ్ జాతీయ రహదారికి చేరువలో నిర్మితం కానున్న మొట్టమొదటి హిందూ ఆలయం... భారత్ ఏకత్వానికి ప్రతీకగా నిలవనుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మానవాళికి, సామరస్యతకు ఉత్ప్రేరకంగా; భారత్ గుర్తింపునకు ఒక మాధ్యమంగా ఈ పవిత్ర స్థలం నిలుస్తుందని చెప్పారు. అబుదాబిలో నిర్మించనున్న స్వామి నారాయణ్ ఆలయానికి ఆదివారం ఆయన దుబాయ్ ఒపేరా హౌస్ నుంచి ప్రత్యక్ష ప్రసార సదస్సు ద్వారా శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. ‘...ఇక్కడి పాలకులు భారతదేశం పట్ల ఎంతో గౌరవాన్ని కనపరిచి ఆలయానికి స్థలాన్ని ఉదారంగా కేటాయించారు. ఎలాంటి తప్పు జరగకుండా చూడడం మనందరి బాధ్యత. ఆలయ నిర్మాణంతో సంబంధం ఉన్నవారంతా దీనిని దృష్టిలో పెట్టుకోవాలి. వీరు గానీ, ఇక్కడ పూజల కోసం వచ్చేవారు గానీ ఎవరికీ ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాలి. మీ అందరి నుంచి నేను (మిగతా 2లో)



అబుదాబిలో నిర్మించనున్న ఆలయ నమూనా

వినాశనానికి కాదు.. వికాసానికే అభివృద్ధి

- భారత్ వృద్ధి ప్రస్థానంలో టెక్నాలజీకి పెద్దపీట
- దుబాయ్ సదస్సులో మోదీ

12లో

■ 'ప్రజలను తప్పుదారి పట్టించి నెపాన్ని మాపై నెట్టేయాలనుకుంటున్నారా? ఇదేం పద్ధతి? మా ప్రజలు తెలివితక్కువవాళ్లు (ఫూల్స్) కాదని పార్లమెంటులోనే చెప్పా. అదే విషయాన్ని మరోసారి ఈ రాష్ట్రంలోను, కేంద్రంలోనూ ఉన్న భాజపా నాయకులకు గుర్తు చేస్తున్నా'

- ఎంపీ గల్లా జయదేవ్

■ 'రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది' **- మంత్రి కళావెంకట్రావు**

■ 'హరిబాబు విడుదల చేసిన 27 పేజీల దస్త్రంలో 14వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు రాష్ట్రానికి రెవెన్యూ లోటు భర్తీకి రూ. 22 వేల కోట్లు ఇస్తున్నట్లు చెబుతున్నారు. మిగతా రాష్ట్రాలకూ ఇచ్చినట్టే ఆంధ్రప్రదేశ్‌కూ ఇస్తున్నారు తప్ప దానిలో ప్రత్యేకత ఏముంది?

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు

బిచ్చమెత్తుకోవాలా!

(మొదటి పేజీ తరువాయి)

రామ్మోహన్‌నాయుడు, కుటుంబరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. భాజపా నోట్ తప్పులతడకని, ప్రజల్ని ఉద్దేశపూర్వకంగానే తప్పుదారి పట్టించేందుకు రూపొందించిన పత్రమని దుయ్యబట్టారు. అదేదో సినిమా స్క్రిప్టులానో, కాల్పనిక పత్రంలానో ఉందని కుటుంబరావు ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ఏమీ చేయకుండానే అన్నీ చేశామన్నట్టు ప్రగల్భాలు పలకొద్దని భాజపాకు ఆయన సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ లేదని, హామీలన్నీ సాధించేంతవరకు తమ పోరాటం ఆగదని కళావెంకట్రావు స్పష్టం చేశారు. విపక్ష వైకాపా వైఖరిపైనా వారు మండిపడ్డారు.

ఇలా అయితే భాజపాను ఎవరూ నమ్మరు..!: కేంద్రంలోని భాజపా నాయకులు రాష్ట్రానికి ఇవ్వాల్సినవి ఇవ్వకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తుంటే.. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు అసత్యాలు, అర్ధసత్యాలతో ప్రచారం చేస్తున్నారని జయదేవ్ మండిపడ్డారు. హరిబాబు విడుదల చేసిన నివేదిక దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తమ పోరాటం ఇప్పుడు కేవలం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించింది మాత్రమే కాదని, జాతీయ అంశంగా మారిందని పేర్కొన్నారు.

విలేకరులతో జయదేవ్ పేర్కొన్న ముఖ్యాంశాలు

- మాకు మద్దతుగా వివిధ పార్టీలు గళం కలుపుతున్నాయి. రాష్ట్రానికి జరిగిన అన్యాయం చూశాక భాజపాను నమ్మొచ్చా? ఆ పార్టీతో మైత్రి మంచిదేనా? మనల్నీ మోసం చేస్తారా? అన్న అనుమానం మిగిలినవారిలోనూ ఉంది. రాష్ట్రానికి ఇచ్చిన హామీల్ని కేంద్రం ఎలా అమలుచేస్తుందా? అని దేశం మొత్తం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది. న్యాయం మన పక్షాన ఉంది.
- పార్లమెంటులోను, బయటా మేం చేసిన పోరాటానికి పార్టీలకు అతీతంగా ఎంపీలు మద్దతిచ్చారు. చివరకు భాజపా ఎంపీలూ మద్దతుగా మాట్లాడారు. ప్రధాని జోక్యం చేసుకుని అన్యాయాన్ని సరిదిద్దాలి.
- రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారు. ఖర్చు పెట్టింది రూ. 5,900 కోట్లే.
- కేంద్రానిదే బాధ్యత.. వాళ్లే జవాబుదారీ అని తెలిసినా కూడా అసత్యాలు ప్రచారం చేసి నెపాన్ని రాష్ట్రంపై నెట్టేయాలని ప్రయత్నిస్తున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌ను మిగతా దక్షిణాది రాష్ట్రాలతో పోల్చాలే తప్ప.. ఈశాన్య, పశ్చిమ ప్రాంతంలోని వెనుకబడిన రాష్ట్రాలతో పోల్చి మీ వృద్ధి బాగుందని చెప్పడం సరికాదు. దక్షిణాది రాష్ట్రాలన్నిటికంటే ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం చాలా తక్కువ. వాటితో సమానంగా అభివృద్ధి చెందేంతవరకు ఆంధ్రప్రదేశ్‌కు చేయూతనివ్వాల్సిందే.
- అప్పట్లో యూపీఏ ప్రవేశపెట్టిన రాష్ట్ర విభజన బిల్లుకు భాజపా సహకరించబట్టే ఆమోదం పొందింది. రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రత్యేక హామీలు ఇవ్వకపోతే బిల్లు ఆమోదం పొందేది కాదు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలకు ఎంత విలువ ఉందో, చట్టంలో లేకపోయినా ప్రధాని హామీలకూ అంతే ప్రాధాన్యం ఉంది.
- ఈఏపీ ప్రాజెక్టులు, రెవెన్యూలోటు వంటి అంశాలతో పాటు కచ్చితంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిందే.
- ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు వెనుకబడిన జిల్లాలకు కేబీకే, బుందేల్‌ఖండ్ తరహాలో సాయం చేస్తామన్నారు. ఒక్క బుందేల్‌ఖండ్‌కే రూ. ఆరువేల కోట్లు ఇచ్చారు. ఇక్కడ ఏడు జిల్లాలకు రూ. 1050 కోట్లు మాత్రమే ఇస్తున్నారు. తలసరి ఆదాయాన్ని బట్టి చూసినా వెనుకబడిన జిల్లాలకు ఎక్కువ మొత్తం రావలసి ఉంది.
- పోలవరం జాతీయ ప్రాజెక్టుగా చేపడతామని హామీనిచ్చారు. సహాయ పునరావాస పనులకు రూ. 33 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. దానిపై కేంద్రం స్పష్టతనివ్వలేదు. ఆ ప్రాజెక్టుపై ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టిన మొత్తానికి, కేంద్రం ఇచ్చిన మొత్తానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. దాన్ని భర్తీ చేయాలి.
- విభజన చట్టంలో 19 అంశాలున్నాయి. ప్రధాని ఆరు హామీలిచ్చారు. వాటిని పూర్తిగా పలుచన చేశారు. కొన్నింటికి నామమాత్రంగా నిధులిచ్చారు. ఇవన్నీ ఎప్పటికి పూర్తి చేస్తారన్న స్పష్టత కావాలి.
- పోలవరం, అమరావతి, రెవెన్యూ లోటు భర్తీ, ప్రత్యేక ప్యాకేజీ, రైల్వేజోన్... ఈ ఐదూ రాష్ట్రానికి సంబంధించిన ముఖ్యాంశాలు. వీటిని వదిలేసి మిగతావన్నీ మాట్లాడుతున్నారు.
- కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఐదే పెండింగ్‌లో ఉన్నాయని హరిబాబు చెప్పారు. మొదలైన వాటి పరిస్థితేంటి? వాటికి అరకొరగా కేటాయిస్తే ఎప్పటికి పూర్తవుతాయి?
- కడప ఉక్కుపరిశ్రమ సాధ్యం కాదని నివేదిక వచ్చిందంటున్నారు? ఆ విషయం చెప్పకుండా ఇప్పటివరకు ఏం చేస్తున్నారు?
- దుగరాజపట్నం నౌకాశ్రయాన్ని రక్షణ శాఖ, ఇస్రో వ్యతిరేకించాయంటున్నారు. రామాయపట్నాన్ని ప్రత్యామ్నాయంగా చూపించాం.. ఆ ప్రస్తావనేదీ?
- కేంద్ర మంత్రి మాటలు చూస్తుంటే రైల్వేజోన్ రాదనే అనిపిస్తోంది.
- విభజన చట్టంలో హామీల అమలుకు పదేళ్ల గడువుందని హరిబాబు అంటున్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారిగా ఈ రాష్ట్ర ప్రజల గురించి ఆలోచిస్తే మంచిది. వాళ్ల నాయకుల ఉద్దేశాలకు అనుగుణంగా మాట్లాడకూడదు.
- రాజధానికి నిర్మాణానికి రూ. 2,500 కోట్లు ఇచ్చాం. ఇంకా రూ. వెయ్యి కోట్లే ఇస్తామంటున్నారు. గుంటూరులో భూగర్భ డ్రైనేజీకే రూ. వెయ్యి కోట్లవుతుంటే రాజధానికి రూ. 3500 కోట్లు ఏ మూలకు?

అదో చిన్న నవలలా ఉంది

రాష్ట్రానికి అన్నీ చేసేశామని కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చెప్పడంపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు మండిపడ్డారు. 'ఆర్థికాంశాలు దాస్తే దాగేవి కాదు. జాతీయ రహదారుల సంస్థ ప్రతి 48 గంటలకు ప్రాజెక్టుల పురోగతిని నవీకరిస్తుంది. 2014-15 నుంచి 2017-18 వరకు రాష్ట్రంలో ఎన్ని కిలోమీటర్లు వేశారు? రూ. 6 వేల కోట్లు కంటే ఖర్చు చేయలేదు. జాతీయ రహదారుల ప్రాజెక్టుల్లో చాలావరకు ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టేవి. కేంద్రం జేబులోంచి ఇవ్వాల్సిన పనిలేదు. అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేకు రూ. 20 వేల కోట్లు ఇస్తున్నామని చెబుతున్నారు. భూసేకరణకే రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 8,500 కోట్లు ఖర్చవుతుంది. ఇతర మౌలిక వసతులకు రూ. 8 వేల కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది' అని తెలిపారు. 'మొదటి సంవత్సరం రెవెన్యూ లోటు భర్తీపై రెండుసార్లు చర్చించాం. రూ. 4 వేల కోట్లే వస్తుందని చెబుతున్నారు. రుణమాఫీ, పింఛన్లు, పీఆర్సీ అమలుకు ఖర్చు చేసిన మొత్తాన్ని దానిలో కలపబోమని చెబుతున్నారు. అవన్నీ తీసేసినా రూ. 7500 కోట్లు వస్తుందని మొదట వాళ్లే చెప్పారు. రైతు రుణమాఫీ అమలుకు, ఆ ఏడాది మేం చెల్లించాల్సిన రూ. 8,500 కోట్ల బిల్లుల్ని వాయిదా వేసుకున్నారు. అది రెవెన్యూలోటు కాదా? అనుమానాలుంటే రూ. 7500 కోట్లు పోను మిగతా మొత్తాన్ని నిర్ణయించేందుకు కమిటీ వేయమని కోరుతున్నాం. 14వ ఆర్థిక సంఘం అధ్యక్షుడితోనే కమిటీ వేయమని కోరుతున్నాం. రెవెన్యూ లోటుపై మేం ఒక ఫార్ములాకు వస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి చెబుతున్నారు. అదేంటో ప్రజలకే చెప్పొచ్చు కదా?' అని పేర్కొన్నారు. హరిబాబు 5 పేజీల్లో చెప్పేదాన్ని అక్షరాల పరిమాణాన్ని పెంచి 27 పేజీల్లో పెట్టారని.. దాన్నో చిన్న నవలలా మార్చారని ఎద్దేవా చేశారు.

పీఎం ఆవాస్‌యోజన కింద రాష్ట్రానికి రూ. 7972 కోట్లు ఇచ్చామని చెప్పారని, ఇచ్చింది రూ. 1038 కోట్లు మాత్రమేనని తెలిపారు.

న్యాయం జరిగేంత వరకు పోరాటం

రాష్ట్రానికి న్యాయం జరిగేంత వరకు పోరాడతామని కళావెంకట్రావు స్పష్టం చేశారు. 'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావలసినవేమీ రాలేదని వైకాపా తన ప్రసారసాధనాల్లో ఎక్కడా చెప్పలేదు. అది స్వలాభం కోసం పెట్టుకున్న పార్టీనే తప్ప ప్రజాసేవ కోసం ఏర్పాటుచేసింది కాదు.. రాష్ట్రానికి అన్యాయం జరిగిన ఇలాంటి సందర్భంలోనూ ఆ పార్టీ రాజకీయం చేయడం దురదృష్టకరం. స్వప్రయోజనాల కోసం కేంద్రంతో ఎలా లాలూచీ పడాలన్నదే వాళ్ల ఆరాటం తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు' అని ధ్వజమెత్తారు.

మీరూ కనపడకుండా పోతారు

'రాష్ట్ర ప్రజల మనోభావాలను కేంద్రం ఇప్పటికైనా గుర్తించాలి. అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజించి తప్పు చేసి కనిపించకుండా పోయింది. అలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని కోరుకుంటున్నాం' అని ఎంపీ రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. భాజపా విడుదల చేసిన నివేదికలో విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపైగానీ, అప్పటి ప్రధాని హామీలపైగానీ స్పష్టతా ఇవ్వలేదన్నారు. కేవలం రాజకీయ నిర్ణయంతోనే రైల్వే జోన్ ప్రకటించవచ్చునని, కావాలనే జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన మాటల్లోని ముఖ్యాంశాలు..

- విభజన చట్టంలోని 19 అంశాలపై స్పష్టత లేదు. ముఖ్యమంత్రి ఎన్ని సార్లు దిల్లీ గడప తొక్కాలన్న ఉద్దేశంతోనే పోరాటం ప్రారంభించాం. ఈ పోరాటంలో వెనుదిరిగే పరిస్థితి లేదు. విభజన చట్టంలోని అంశాల్నిఎప్పటిలోగా నెరవేరుస్తారన్న స్పష్టత కావాలి.
- బెంగళూరు, ముంబయి సబర్బన్ రైలు ప్రాజెక్టులకు కోట్లకు కోట్లు ఇచ్చినప్పుడు విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్టులు గుర్తుకు రాలేదా? మంచి రాజధాని కట్టుకోవాలని మేం కలలు కనకూడదా? ఆంధ్రప్రదేశ్‌కు దిల్లీకి మించిన రాజధాని కడతామన్న హామీలన్నీ ఏమయ్యాయి?
- హామీల అమలుకు పదేళ్ల గడువుందని చెప్పడం ఏం న్యాయం? ఆకలేసినప్పుడు అన్నం పెట్టండి. ఆర్థికంగా సహకరించండి. ఆశలు అడియాసలు చేసినందునే ఈ పోరాటం.
- ఆ రోజు ప్రత్యేకహోదా కోసం పోరాడాం. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటే దానికీ ఒప్పుకున్నాం. ఇప్పుడు దానిలోనూ స్పష్టత లేదు.
- 'కేంద్రంపై ఐక్యంగా పోరాడుతుంటే.. తెదేపా కుట్ర చేస్తోందని వైకాపా అనడం దురదృష్టకరం. పార్లమెంటులో ఐదు రోజుల పోరాటం కుట్రా? మా మంత్రులు మాట్లాడుతుంటే మీ సభ్యులు రూల్స్ చెప్పి ఎందుకు అడ్డుపడ్డారు? మీ ఎంపీలు దిల్లీలో బడ్జెట్ బాగుందని, ఇక్కడ మరోలా మాట్లాడుతున్నారు. కుట్రలు చేస్తోంది మీరే. అసలు మీకు నిలకడేది. ఒకసారి రాజీనామాలు చేస్తామంటారు? మీ ఎంపీలేమో ప్రధాని కార్యాలయం చుట్టూ తిరుగుతారు. ఎవర్ని ఫూల్స్ చేస్తారు?



మానవ శరీరమే ఓ ఛార్జర్

- లోహ ట్యాబ్‌ను రూపొందించిన అమెరికా శాస్త్రవేత్తలు

వాషింగ్టన్: యంత్రసాధనాలు(గ్యాడ్జెట్స్)ను ఛార్జింగ్ చేయడానికి ఇప్పటివరకు వాడుతున్న సంప్రదాయ ఛార్జర్లు ఇకపై గతం అయ్యే రోజు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది. మానవ శరీరం కదలికల ద్వారా పుట్టే విద్యుత్తుతో యంత్రసాధనాలను ఛార్జింగ్ చేసే 'లోహ ట్యాబ్'ను శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచారు. ఇందుకు ట్రైబోఎలక్ట్రిక్ ఛార్జింగ్ అనే పద్ధతిని ఉపయోగించారు. ఇందుకు తక్కువ వ్యయమయ్యే సూక్ష్మ జనరేటర్లను చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(కాస్) తయారుచేసింది. ట్రైబోఎలక్ట్రిక్ ఛార్జింగ్ కోసం బంగారంతో పాటు కళ్లద్దాల తయారీలో వాడే సిలికాన్ ఆధారిత పాలీ డై మిథైల్ సిలోక్సేన్ పొరలను ఉపయోగించారు. ఈరెండు పొరల మధ్య ఎంత ఎక్కువగా ఘర్షణ ఉంటే అంతగా విద్యుదుత్పత్తి జరుగుతుందని కాస్ ప్రొఫెసరు యున్ క్సు చెప్పారు. తాజాగా తయారుచేసిన 1.5 సెంమీ పొడవు, ఒక సెంమీ వెడల్పైన లోహ ట్యాబ్‌తో 124 వోల్టుల విద్యుత్తు జనించిందన్నారు. దీంతో ఒకేసారి 48 ఎర్ర ఎల్‌ఈడీ బల్బులను వెలిగించవచ్చని చెప్పారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్తు నిల్వకు బ్యాటరీని సైతం అభివృద్ధి చేస్తున్నామన్నారు.

మధ్యప్రాచ్యంలో మొదటి హిందూ ఆలయం

(మొదటి పేజీ తరువాయి)

ఆశిస్తున్నది ఇదే'నని హితవు పలికారు. ఆలయ నమూనాను ఆయన ఆవిష్కరిస్తూ అబుదాబి యువరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. 'ఆలయ నిర్మాణానికి అబుదాబి అంగీకరించిందని తెలియగానే ప్రజలంతా ఆశ్చర్యపోయారు. దానికి గానూ యావన్మంది భారతీయుల తరఫునా ధన్యవాదాలు. మానవత్వానికి మాధ్యమంగా ఆలయాలు నిలిచే సంస్కృతిలో మేమంతా పెరిగాం. అబుదాబిలో రాబోతున్న ఆలయం కేవలం నిర్మాణశైలి, ప్రాకారాలపరంగా విశిష్టంగా నిలవడమే కాకుండా వసుధైక కుటుంబ సందేశాన్ని ప్రపంచ మానవాళికి చేరవేయాలనేది నా ఆకాంక్ష' అని మోదీ చెప్పారు. 55 వేల చదరపు మీటర్ల స్థలంలో నిర్మితం కాబోతున్న ఆలయం 2020 నాటికి పూర్తవుతుంది. మొత్తం నిర్మాణాన్ని శిల్పులు విడివిడిగా చెక్కి, యూఏఈలో వాటిని అతికిస్తారు. అన్ని మతాలకు చెందినవారినీ ఆలయంలోకి అనుమతిస్తారు. మధ్యప్రాచ్యంలో ప్రప్రథమ హిందూ సంప్రదాయ రాతికట్టడంగా ఇది నిలిచిపోతుందని ఆలయ వర్గాలు తెలిపాయి. దిల్లీలోని స్వామి నారాయణ్ ఆలయాన్ని, న్యూజెర్సీలో నిర్మాణంలో ఉన్న మరో ఆలయాన్ని అబుదాబి ఆలయం సరిపోలి ఉంటుంది.

ఆర్థిక సంబంధాలు బలోపేతం: భారత్-యూఏఈల మధ్యనున్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని రెండుదేశాలూ నిర్ణయించుకున్నాయి. ముఖ్యంగా విమానయానం, వాతావరణ మార్పులు, ఇంధన రంగాల్లోనే కాకుండా భారత్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పెట్టుబడులకు యూఏఈ ఆసక్తి చూపించడాన్ని మోదీ ఆహ్వానించారు. రెండు దేశాల స్టాక్ ఎక్స్ఛేంజిల మధ్య కుదిరిన ఒప్పందం కూడా బంధాలను బలోపేతం చేస్తుందని రెండు దేశాలూ పేర్కొన్నాయి. భారత ప్రధాని రెండ్రోజుల పర్యటన ముగింపు సందర్భంగా ఈ మేరకు ఉమ్మడి ప్రకటన విడుదలయింది. భారత ఇంధన భద్రతకు విశ్వసనీయ భాగస్వామిగా యూఏఈ నిలుస్తున్నందుకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. అమ్మకందారుడు- కొనుగోలుదారుడు అనే సంబంధాన్ని మించి సంయుక్త భాగస్వామ్య రంగంలో అడుగు పెట్టాలని ఆకాంక్షించారు. చమురు రంగంలోనే కాకుండా కార్మికులకు సంబంధించిన అంశాలు, రైల్వేకు సాంకేతిక సహకారం వంటి ఇతర అంశాలపైనా ఒప్పందాలు కుదిరాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల తీరును భారత్, యూఏఈ ఖండించాయి.

ఒమన్‌కు చేరుకున్న మోదీ

మస్కట్: మూడు పశ్చిమాసియా దేశాల పర్యటనలో భాగంగా చివరి దేశమైన ఒమన్‌కు భారత ప్రధాని నరేంద్రమోదీ చేరుకున్నారు. ఆదివారం దుబాయ్ నుంచి ఆయన మస్కట్ వచ్చారు.

తమపై తామే జోకులు పేల్చేవారు ధన్యులు

లండన్: తమపై తామే జోకులు వేసుకుని, ఇతరుల మనసు గెలవాలనుకునేవారు మానసికంగా ఎంతో ఆరోగ్యంగా ఉంటారని తాజా అధ్యయనంలో తేలింది. సంతోషంగా, నలుగురితో బాగా కలిసిపోయే మనస్తత్వం కలిగి ఉంటారని స్పెయిన్‌లోని గ్రెనడా విశ్వవిద్యాలయానికి చెందిన జార్జ్ టోరస్ మారిన్ పేర్కొన్నారు. హాస్యం కారణంగా ఆ వ్యక్తులపై కొంత నమ్మకం, సాన్నిహిత్యం పెరుగుతాయని ఇదే విశ్వవిద్యాలయానికి చెందిన గ్రైన్స్ నవ్రో కర్రిల్లో అన్నారు. భవిష్యత్తులో ప్రయోజనాలు పొందడానికి, మభ్య పెట్టడానికి ముఖ్యమైన సమాచారాన్ని ఉపయోగించుకుంటారన్నారు. ప్రతికూల భావాలు, అభిప్రాయాలను దాచడానికీ కొన్నిరకాల హాస్యాలను పలికిస్తారని పరిశోధకులు చెబుతున్నారు. 'పర్సనాలిటీ అండ్ ఇండివిడ్యువల్ డిఫరెన్సెస్' అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం వివరాలు ఇప్పటివరకు ప్రచురితమైన పలు అధ్యయనాలకు వ్యతిరేకంగా ఉండటం గమనార్హం. తమను తాము తక్కువ చేసుకునేలా జోకులు వేసేవారు.. ప్రతికూల మానసిక ప్రభావాలు కలిగి ఉంటారని ఇప్పటివరకు అనేక అధ్యయనాలు వెల్లడించాయి.

వృద్ధులకు వేలి కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

మందికిపైగా పేదలకు ప్రతినెలా దాదాపు రూ. 500 కోట్లు పంపిణీ చేస్తున్నారు.

నగదు కొరతతో.. జనవరి పింఛన్ల పంపిణీపై నగదు కొరత చాలా ప్రభావం చూపుతోంది. పార్లమెంట్‌లో ఫైనాన్షియల్ రిజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్‌ఆర్‌డీఈ) బిల్లు ప్రవేశ పెడుతున్నారన్న ప్రచారంతో మధ్యతరగతి కుటుంబాలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు వెనక్కి తీసుకోవడంతో బ్యాంకుల్లో నగదుకొరతకు దారితీసింది. శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. బ్యాంకులకు తగినంత నగదు సరఫరా చేసేలా తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆర్బీఐని కోరినా సమస్యకుసరైన పరిష్కారం లభించలేదు.

కొందరికి కాసులు కురిపిస్తున్న ధ్రువీకరణ విధానం.. లబ్ధిదారుల వేలి ముద్రల సేకరణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 వేలకుపైగా డివైజ్‌లు అందుబాటులో ఉన్నాయి. నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలతో ప్రతి నెలా 4 నుంచి 5 శాతం పింఛన్లు పంపిణీదారుల ధ్రువీకరణ(ఆథరైజేషన్)పై అందిస్తున్న పరిస్థితి. వృద్ధాప్యంతో చాలామంది వేలి ముద్రలు సరిగా పడకపోవడంతో పంపిణీలో జాప్యం జరుగుతోంది. ఆథరైజేషన్ విధానం సిబ్బందిలో కొందరికి కాసులు కురిపించడంతో ఇదే పద్ధతిని కర్నూలు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో ఎక్కువగా అమలు చేస్తున్నారు. ఈనెలలో ఇప్పటివరకు ఇదే విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 1,69,107 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి.

జనవరి నెలకు సంబంధించి జిల్లాల వారీ ఇప్పటివరకు పంపిణీ చేసిన పింఛన్లు

జిల్లా	పింఛన్లు	పంపిణీ చేసినవి	శాతం
శ్రీకాకుళం	2,84,846	1,53,305	53.82
విశాఖపట్నం	3,35,628	2,82,724	84.24
ప్రకాశం	3,09,919	2,69,687	87.02
విజయనగరం	2,61,585	2,29,019	87.55
అనంతపురం	4,04,692	3,58,744	88.65
కర్నూలు	3,26,417	2,90,990	89.15
గుంటూరు	3,78,216	3,37,356	89.20
కడప	2,56,608	2,29,881	89.58
చిత్తూరు	4,01,314	3,61,738	90.14
తూర్పు గోదావరి	4,90,683	4,44,012	90.49
పశ్చిమ గోదావరి	3,66,544	3,33,791	91.06
నెల్లూరు	2,51,870	2,30,999	91.71
కృష్ణా	3,52,468	3,31,510	94.05

ఎన్టీఆర్ భరోసా కింద ప్రతి నెలా పింఛన్లు తీసుకుంటున్న వివిధ కేటగిరిల ప్రజలు

వృద్ధాప్య:	20,54,252
వితంతు:	16,95,065
దివ్యాంగులు:	5,67,355
చేనేత కార్మికులు:	87,660
గీత కార్మికులు:	16,458
హెచ్ఐవీ బాధితులు:	34,346
డయాలసిస్ పేషెంట్లు:	2,553

ముంబయి గగనతలంలో తప్పిన ముప్పు

- చేరువగా వచ్చిన రెండు విమానాలు

దిల్లీ: ముంబయి గగనతలంలో పెనుప్రమాదం తప్పింది. ఎయిర్ ఇండియా, విస్తారా విమానాలు ఢీకొట్టుకోబోయాయి. రెండు విమానాలూ ఒకదానికొకటి 100 అడుగులు చేరువగా రాగా.. ఎయిర్‌ఇండియా పైలెట్ అప్రమత్తమై సురక్షిత దూరానికి విమానాన్ని మళ్లించారు. బుధవారం జరిగిన ఈ ఘటనపై విమాన ప్రమాద విచారణ సంస్థ (ఏఏఐబీ) దర్యాప్తు చేపట్టింది. ఎయిర్‌ఇండియా విమాన పైలెట్లు గగనతల రద్దీ నియంత్రణ విభాగం (ఏటీసీ) సూచనలను పాటిస్తూనే ఉన్నారని ఎయిర్‌ఇండియా అధికారులు తెలిపారు. ఏటీసీ సూచనలకు భిన్నంగా విస్తారా పైలెట్లు మాత్రం విమానాన్ని కిందికి దించుతూ వచ్చారని పేర్కొన్నారు. హెచ్చరిక వ్యవస్థ సందేశంతో అప్రమత్తమైన ఎయిర్‌ఇండియా పైలెట్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించారని వెల్లడించారు. తమ పైలెట్ తిరిగి విధుల్లో పాల్గొనేందుకు ఏఏఐబీ అనుమతి కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఇటు విచారణ నేపథ్యంలో తమ పైలెట్లు ఇద్దరిని తాత్కాలికంగా విమానం నడుపకుండా విస్తారా సంస్థ ఆదేశాలిచ్చింది. ఇటు ఘటన జరిగిన సమయంలో రెండు విమానాల్లో కలిపి 261 మంది ప్రయాణికులున్నారు.

విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలన్నా నీట్ తప్పనిసరి!

(మొదటి పేజీ తరువాయి)

విశ్వవిద్యాలయాలకు వెళ్లేలా చూడాలన్నది ప్రభుత్వ ఉద్దేశం" అని వివరించారు.

ఏటా 7000 మంది: విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకునేవారు ఎంసీఐ నుంచి 'ఆవశ్యకత పత్రం' పొందాలనేది ప్రస్తుత నిబంధన. ఏటా సుమారు 7000 మంది విద్యార్థులు విదేశాల్లో ఎంబీబీఎస్ చదవడానికి వెళ్తున్నారు. వీరిలో ఎక్కువ మంది చైనా, రష్యాలను ఎంచుకుంటున్నారు. విదేశాల్లో చదువుకు పెద్దఎత్తున డబ్బు ఖర్చు చేస్తున్నవారు తిరిగి మాతృదేశానికి వచ్చిన తర్వాత ఆరోగ్య పరిరక్షణ రంగానికి తమ వంతు తోడ్పాటును అందించలేకపోవడం ప్రభుత్వాన్ని కలవరపెడుతోంది. ఇకపై విదేశాల్లో చదవాలనుకునేవారు నీట్‌లో ఉత్తీర్ణులైతేనే ప్రభుత్వం నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) ఇస్తుంది.

నేటి నుంచి జల సంరక్షణ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జల సంరక్షణ ఉద్యమానికి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 116 రోజులపాటు జల సంరక్షణ పనులు భారీ స్థాయిలో చేపట్టనున్నారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు మండలం వెంకటాయపాలెంలో సోమవారం అధికారికంగా పనులు ప్రారంభించనున్నారు. పాలెవాగులో కలిసే డ్రైనేజీ పూడికతీత పనిని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమ ప్రారంభించనున్నారు. అన్ని జిల్లాల్లోనూ సమాంతరంగా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. నీరు- చెట్టు ఎగ్జిబిషన్ వంటివి ఏర్పాటుచేస్తారు. ఇందుకోసం రాష్ట్ర జలవనరుల శాఖ ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. గతంలో ఏప్రిల్‌లో విడుదలయ్యే మార్గదర్శకాలను ఈసారి ఫిబ్రవరిలోనే ఇచ్చేశారు. గతేడాది ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొన్ని నిబంధనలను మార్చారు. చెరువుల్లో పూడికతీతతో పాటు గొలుసుకట్టు చెరువుల అభివృద్ధి పనులు చేపడతారు. పెద్ద సంఖ్యలో చెక్‌డ్యాంలను నిర్మించనున్నారు.

భూగర్భజలాల పరిస్థితిపై విశ్లేషించి అవసరమైన చోట విస్తృతంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సైతం ఈనెల మూడో వారం నుంచి జలసంరక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

గ్రహం అనుగ్రహం

12-2-2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
ద్వాదశి: రా. 8-27 తదుపరి త్రయోదశి
పూర్వాషాఢ నక్షత్రం: రా. 2-34 తదుపరి ఉత్తరాషాఢ
అమృత ఘడియలు: రా. 9-14 నుంచి 11-01 వరకు
వర్జ్యం: ఉ. 10-07 నుంచి 12-22 వరకు
దుర్ముహూర్తం: మ. 12-36 నుంచి 1-21 వరకు
తిరిగి మ. 2-53 నుంచి 3-38 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-33; సూర్యాస్తమయం: సా.5-56

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
శ్రీకాకుళం	16.5	33.0
తాడేపల్లిగూడెం	19.5	30.5
తిరుపతి	20.4	34.0
విశాఖపట్నం	20.8	29.6
గుంటూరు	21.0	33.5
విజయవాడ	21.4	30.2
రాజమహేంద్రవరం	22.0	31.5
నెల్లూరు	22.0	32.0
కడప	22.0	34.0
ఒంగోలు	22.1	30.1

తడబడే బ్యాట్స్‌మెన్ మోదీ

- కీపర్ వైపు చూస్తూ బ్యాటింగ్ చేస్తున్నారు
- అవినీతిలో భాజపాది ప్రపంచ రికార్డు
- సిద్ధరామయ్య ప్రభుత్వంలో ఒక్క కుంభకోణంలేదు
- 10 మంది పారిశ్రామికవేత్తలకు ప్రధాని రూ.1.25 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారు
- రూ.15 లక్షలు ఎవరి ఖాతాలకు చేరాయి?
- ఉత్తర కర్ణాటక పర్యటనలో రాహుల్

సింధనూరు, గంగావతి (కర్ణాటక), న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తడబడే క్రికెట్ బ్యాట్స్‌మెన్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అభివర్ణించారు. బంతి ఎటువైపు నుంచి వస్తుందో తెలియని మోదీ వికెట్ కీపర్ వైపు చూస్తూ బ్యాటింగ్ చేస్తున్నారని చెణుకులు విసిరారు. "వికెట్ కీపర్ వైపే చూస్తూ బ్యాటింగ్ చేసుంటే సచిన్ తెందుల్కర్ ఒక్క పరుగైనా చేసుండేవాడా? మన ప్రధానమంత్రి మాత్రం బంతి ఎక్కడ నుంచి వస్తుందో తెలియకుండా కీపర్‌ను చూస్తు బ్యాటింగ్ చేసే క్రికెటర్. మోదీ తన వికెట్ కాపాడుకునే క్రమంలో ప్రజలను వదిలేస్తున్నారు. రాష్ట్రంలో మా ప్రభుత్వం అలా కాదు అన్ని దిక్కులూ చూస్తూ అందరి క్షేమం కోసం పాటుపడుతోంది"అని ఆదివారం రాత్రి ఉత్తర కర్ణాటకలోని రాయచూరు జిల్లా సింధనూరులో నిర్వహించిన రోడ్ షోలో రాహుల్ పేర్కొన్నారు. మోదీ, భాజపాలపై తన విమర్శలను తీవ్రతరం చేశారు. అవినీతిలో కర్ణాటక భాజపా ప్రపంచ రికార్డులు సృష్టించిందని ఆక్షేపించారు. సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కుంభకోణాలు లేని సర్కార్‌గా నిలిచిందని పేర్కొన్నారు. కర్ణాటకలో భాజపా అధికారంలో ఉన్న కాలంలో ఒకదాని వెంట మరొకటి కుంభకోణాలు బయటకొచ్చాయన్నారు. గడచిన ఐదేళ్ల(కాంగ్రెస్ పాలనలో)లో ఒక్క కుంభకోణం కూడా చోటుచేసుకోలేదని గుర్తు చేశారు.

రైతు రుణమాఫీపై మోదీ నోరు మెదపడంలేదు: "మోదీ ప్రధాని అయ్యాక రైతులకు కష్టాలు ఆరంభమయ్యాయి. నోట్ల రద్దుతో ఓ రకంగా, వ్యవసాయంలో రాయితీలు తొలగించి ఇంకోరకంగా రైతులను ఇబ్బంది పెడుతున్నారని రాహుల్ విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా ఈ కష్టాలన్నీ తొలగుతాయని చెప్పారు. జనఆశీర్వాద యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం సింధనూరు వచ్చిన ఆయన 800 మంది రైతులు పాల్గొన్న ఆడిటోరియంలో గంటపాటు వారితో మాటామంతి నిర్వహించారు. అంతకంటే ముందు గాంధీ కూడలిలో ఆయన రోడ్ షో జరిపి రహదారిపైనే ఏర్పాటు చేసిన వేదికపై అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. మాటామంతిలో రైతులు ప్రధానంగా రుణ మాఫీ, తుంగభద్రా జలాశయం పూడిక సమస్య, ప్రకృతి వైఫల్యాలతో రైతుల నష్టాలు, ఆంధ్రా, తెలంగాణలో మాదిరి వ్యవసాయ విద్యుత్తు సదుపాయాన్ని కర్ణాటకలోనూ అమలు చేయాలని రాహుల్‌ను కోరారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీపై మోదీ నోరు మెదపడం లేదని రాహుల్ విమర్శించారు. మోదీతో లాభంలేదని "మీ రాష్ట్రంలో రైతుల రుణ మాఫీకి అవకాశం ఉందా? అని సిద్దరామయ్యను అడిగా.... అంతే వెంటనే ఆయన సహకార రుణాలు రద్దు చేశారు" అని రాహుల్ చెప్పారు.



కర్ణాటకలోని సింధనూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో రాహుల్ గుసగుసలు

పారిశ్రామికవేత్తల రుణాల మాఫీ అంటే ఇష్టం: రైతులకన్నా పారిశ్రామికవేత్తల రుణమాఫీ ప్రధాని నరేంద్ర మోదీకి ఆనందం కలిగిస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. "రైతుల రుణాల మాఫీ కుదరదంటారు. కానీ దేశంలోని 10 మంది పారిశ్రామికవేత్తలకు చెందిన రూ. 1.25 లక్షల కోట్ల రుణ బకాయిలు మాఫీ చేస్తారు. మోదీది పేదల ప్రభుత్వం కాదనేందుకు ఇది మచ్చుతునక" అన్నారు. ఆదివారం ఉదయం కొప్పళ జిల్లా గంగావతి గాంధీ కూడలిలో మాట్లాడుతూ అందరి బ్యాంకు ఖాతాల్లో వేస్తానన్న రూ. 15 లక్షలు ఎవరి ఖాతాలకు చేరాయో తెలియడం లేదని వ్యంగ్యంగా అన్నారు.

RRB Best Coaching
ALP, Technician, Group - D
బ్యాచ్ ప్రారంభం: 12-02-2018
8977525552, 9985525552
వివి అకాడమి Eluru Road, Vijayawada.

NAGARJUNA IAS ACADEMY
Commencing the best coaching for
IAS'18 Long Term Prelims cum Mains
6-29-18, 2nd Floor, back side of Kalamandir, Opp Brahmamgarimatam, Naidupet, Guntur. ✆ 0863-2338463, 94402 62907
www.nagarjunaiasacademy.com

SI & కానిస్టేబుల్స్ త్వరలో నోటిఫికేషన్స్ విడుదల
Group-D 65 వేల పోస్టులు నోటిఫికేషన్ విడుదల
భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్
చైతన్యపురి, హైదరాబాద్ 040-66338639, 24064477
కాకినాడ - 9652578639 0884-2378639

10th CLASS / ITI / INTER / DIPLOMA / B.Tech అర్హతతో
RRB ALP/Tech-26502 GROUP-D-62907
SIs & కానిస్టేబుల్స్
◆ Online Exams ◆ హాస్టల్ వసతి కలదు
కాపు విద్యార్థులకు ఉచిత శిక్షణ మరియు స్టైఫండ్
ఆదిత్య కాంపిటేషన్స్
New Batches: 12th & 19th Feb'18
91105 88864
98490 03166
◆ గుంటూరు ◆ విజయవాడ ◆ భీమవరం



ఎన్నికైన పౌరహక్కుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ నాయకులు

ముగిసిన పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు

నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు, న్యూస్‌టుడే: నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న పౌరహక్కుల సంఘం 18వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. రెండురోజుల పాటు జరిగిన మహాసభల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనుమడు ఆనంద్ తేల్‌తుంబ్డె, ఆచార్యులు హరగోపాల్, శేషయ్య, లక్ష్మణ్ పాల్గొని ప్రసంగించారు. చివరి రోజు రాష్ట్ర మహాసభలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి. చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా క్రాంతిచైతన్య, రాజారావు, సంయుక్త కార్యదర్శులుగా శ్రీమన్నారాయణ, ఎల్లంకి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఈశ్వర్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ బ్రహ్మయ్య, క్రాంతికుమార్, డాక్టర్ రాజారావులను ఎన్నుకున్నారు. అనంతరం మోదీ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలని, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామికవాదులను కూడగట్టాలని తీర్మానించారు. కార్పొరేట్ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అమరావతి నిర్మాణంలో భూములను కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం వర్తింపజేయాలని, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలని తదితర 15 అంశాలపై కూడా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ నుంచి పౌరహక్కుల సంఘం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలు మారితే పదవులు త్యజించాలి

- **ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హితవు**
- **రోశయ్యకు జీవన సాఫల్య పురస్కారం**

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రజా ప్రతినిధులు పార్టీలు మారడం మంచి విధానం కాదని, ఒకవేళ పార్టీ మారితే పదవినీ త్యజించాలనేది తన నిశ్చితాభిప్రాయమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పష్టంచేశారు. చట్టసభలు కొనసాగుతున్న తీరు బాధాకరమన్నారు. సభలో అర్థవంతమైన చర్చలతో ప్రభుత్వాన్ని నిలదీయాలి తప్ప..సభను స్తంభింపచేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలు మాట్లాడేందుకే ప్రజాప్రతినిధులను చట్టసభలకు పంపారని, అందుకు భిన్నంగా సభ బయట నిరసనలు తెలిపితే ఎలాగని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ పార్క్‌హయత్‌లో రాగసప్తస్వరం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో టి. సుబ్బిరామిరెడ్డి లలిత కళాపరిషత్ సహకారంతో 'సహస్ర చంద్ర దర్శనం' పేరిట జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్యకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. ఉపరాష్ట్రపతి.. రోశయ్యకు స్వర్ణ కంకణం తొడిగారు. ఆయనకు 'అపర చాణక్యుడు' అనే బిరుదును ప్రదానం చేశారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, అజాత శత్రువుగా, పరిణితి చెందిన నేతగా ఆయన్ని అభివర్ణించారు. ఈ సందర్భంగా ఎంపీ సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ..రోశయ్య, ఎం. వెంకయ్యనాయుడు వజ్రాల్లాంటి నేతలని ప్రశంసించారు. పురస్కార గ్రహీత రోశయ్య మాట్లాడుతూ..విద్యార్థి దశలో ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నానని, తన రాజకీయ ప్రస్థానానికి ప్రారంభం అదేనన్నారు. అనంతరం ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ..'స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చేదిశగా నేతలు ఆలోచలను సాగించాలి. ప్రస్తుతం అవిద్య, అరాచకాలు, అవినీతి, ఉగ్రవాదం, అత్యాచారాలు, ఆర్థిక అసమానత తదితర సవాళ్లను ఎదుర్కొంటున్నాం. వాటిని అరికట్టే దిశగా అన్ని వర్గాలు, రంగాలు కలిసికట్టుగా కృషిచేయాలి. అప్పట్లో తాము కూడా సభల్లో విమర్శలు గుప్పించేవాళ్లం. అదే తరహా విమర్శలు చేసే వాతావరణం ఇప్పుడు లేదు. ఇటీవల ఐదురోజులు జీరో అవర్ జరగలేదు. స్వాతంత్ర్యం వచ్చి ఇంతకాలమైనా మనం సభలను సరిగ్గా నిర్వహించుకోలేకపోతున్నామా? అన్న అనుమానం కలుగుతోంది. సభలో పోరాటం చేస్తున్నారా? ప్రచారం కోసం ఆరాటపడుతున్నారా? అన్నది సభ్యులు ఆత్మపరిశీలన చేసుకోవాలి.' అన్నారు. భారతదేశం ప్రపంచానికి ఆధ్యాత్మిక విశ్వగురువు అని తెలిపారు. చివరిగా 'తెలుగువాడిగా గర్వించు..తెలుగులో మాట్లాడు' అంటూ నినదించారు. కార్యక్రమంలో రాగసప్తస్వరం వ్యవస్థాపకురాలు రాజ్యలక్ష్మి, అధికార, రాజకీయ, సాహితీ, కళలు, వివిధ రంగాలకు చెందిన వి. హనుమంతరావు, మర్రి శశిధర్‌రెడ్డి, రమణాచారి, నన్నపనేని రాజకుమారి, బుర్రా వెంకటేశం, విజయ్‌బాబు, నంగునూరి చంద్రశేఖర్, బండారు సుబ్బారావు, మానేపల్లి రామారావు, యద్దనపూడి సులోచనారాణి, జమున, గీతాంజలి, రుద్రరాజు పద్మరాజు, వింజమూరి సుజాత తదితరులు పాల్గొన్నారు.



రోశయ్యకు జీవనసాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న వెంకయ్యనాయుడు, సుబ్బరామిరెడ్డి, మహమూద్‌అలీ, నన్నపనేని రాజకుమారి తదితరులు

2.25 లక్షల రుద్రాక్షలతో శివలింగం

మహాశివరాత్రిని పురస్కరించుకొని చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం మల్లప్పకొండపై 2.25 లక్షల రుద్రాక్షలతో 14 అడుగుల శివలింగం రూపొందిస్తున్నారు. ఇక్కడ నిర్వహించే రుద్రాభిషేకంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల భక్తులతో పాటు స్థానికులు 40 వేల మంది వరకు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

– న్యూస్‌టుడే, గుడుపల్లె







వాహనంతో ఢీకొట్టి.. ఆపై ఆసుపత్రి వద్ద పడేసి..

- **వాహనచోదకుడి దుర్మార్గం**
- **తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు**


తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు

గుడివాడ, న్యూస్‌టుడే: రహదారి వెంబడి నడిచివెళ్తున్న ఓ వృద్ధుడిని తన వాహనంతో ఢీకొట్టిన ఓ చోదకుడు..అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాధితుడిని ఆసుపత్రి ఎదుట పడేసి వెళ్లిపోయాడు. కృష్ణా జిల్లా గుడివాడలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన వృద్ధుడి కుడి కాలి వేళ్లు నుజ్జునుజ్జయ్యి, కాలిపై చర్మం లేచిపోయింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 9 గంటలకు.. గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న ఓ వృద్ధుడిని గుర్తుతెలియని వాహనంలో తీసుకొచ్చి కొందరు గుడివాడ అన్నే నరసింహారావు, పుష్పలీలావతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదుట పడేసి వెళ్లిపోయారు. వైద్యశాలలో రక్తపరీక్ష కేంద్రంలో పనిచేస్తున్న ఎన్జీవోస్ సంఘ అధ్యక్షుడు షేక్ ఫరీద్‌బాషా, ఆరోగ్య కేంద్రం నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల లారెన్స్, నర్సింగ్ హెడ్ ప్రసన్నలు క్షతగాత్రుడికి గాయాలను శుభ్రంచేసి చికిత్స చేశారు. బాధితునికి సాయంత్రానికి స్పృహ వచ్చింది. అయితే తనది విజయవాడ అని మాత్రం చెబుతున్నారు. పేరు, చిరునామా చెప్పలేకపోతున్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిసినవారు వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని ఫరీద్‌బాషా కోరారు. గుర్తుతెలియని వాహనదారుడు ప్రమాదవశాత్తూ వృద్ధుడిని ఢీకొట్టి ఆసుపత్రి ముందు పడేసినట్లు భావిస్తున్నారు. వైద్యశాలలో చేరిస్తే తన వివరాలు బయటపడతాయనే భయంతో ఈ విధంగా చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు మోదీ నివాళులు

దిల్లీ: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ట్విటర్‌లో నివాళులర్పించారు. అణగారినవర్గాలు, గ్రామాల కోసం దీన్‌దయాళ్ చేసిన సేవ ప్రజలకు నిరంతరం ప్రేరణనిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. భారతీయ జన సంఘ్ అగ్రనేతల్లో ఒకరైన దీన్‌దయాళ్ 1968 ఫిబ్రవరి 11న కన్నుమూశారు.





ఈనాడు

ఎన్నికల సంఘాన్నీ సంస్కరించాలి

నేరగ్రస్త రాజకీయానికి సరిపోలిక ధృతరాష్ట్ర కౌగిలి. దానిలో చిక్కి దశాబ్దాలుగా భారతావని ప్రజాస్వామ్యం నుగ్గునూచ అవుతోంది. ఇండియాలో ఎన్నికల వ్యవస్థను పట్టిపీడిస్తున్న దశమహా పాతకాలకు అదే తల్లివేరు అని గుర్తించాలి. దాన్ని ఖండించే విస్పష్ట కార్యాచరణకు ఏళ్లూపూళ్లుగా పార్టీలు కూడిరాని నేపథ్యంలో- ఢిల్లీకి చెందిన భాజపా నేత అశ్వినీ ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం నేర రాజకీయాల డొంకల్ని ఒకటొకటిగా కుళ్లగిస్తోంది. తీవ్ర నేరాలకు పాల్పడ్డ, శిక్ష పడిన ప్రజాప్రతినిధులు జీవితాంతం ఎన్నికల్లో పోటీ చెయ్యకుండా నిషేధం విధించాలన్న అర్జీదారుడి విజ్ఞాపన- మార్చి ఒకటి నుంచి పని మొదలుపెట్టి ఏడాది వ్యవధిలోగా మొత్తం కేసుల్ని ఫైసలా చేసేలా ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు పూర్వరంగం సిద్ధం చేసింది. దోషిత్వం రుజువైనవారు రాజకీయ పార్టీలను ఏర్పాటు చెయ్యకుండా, వాటిలో ఉన్నతాసనాలు అధిష్ఠించకుండా నిషేధించాలంటున్న అశ్వినీ ఉపాధ్యాయ అర్జీ- పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం నెలకొనేలా, రాజకీయాల్ని నేరరహితంగా ప్రక్షాళించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టును అర్థిస్తోంది. ఈ అంశాల్ని తీవ్రంగా పరిగణించాలంటూ జనవరి తొలివారంలో 'సుప్రీం' ఇచ్చిన ఉత్తర్వుల మేరకు నిర్వాచన్ సదన్ తాజాగా దాఖలు చేసిన ప్రమాణపత్రం- స్వీయ పరిమితుల్నే ఏకరువు పెట్టింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 29 (ఎ) అనుసారం పార్టీలను నమోదు చేసుకొనే అధికారం మాత్రమే తనకు దఖలుపడిందిగాని వాటిని రద్దుచేసే అవకాశం లేదని ఎలెక్షన్ కమిషన్ వివరించింది. కేవలం మూడు సందర్భాల్లో తప్ప పార్టీలను నిషేధించే అధికారం ఈసీకి లేదంటూ 2002లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించిన నిర్వాచన్ సదన్- చట్ట సవరణలు చేసి సమధిక అధికారాలు సమకూరిస్తేనే నేరగ్రస్త రాజకీయాల ప్రక్షాళనకు తాను సమకట్టగలనని స్పష్టీకరించింది. అధికారంతోపాటు జవాబుదారీతనమూ పాదుకొనేలా ఎన్నికల సంఘంలోనూ వ్యవస్థాగత సంస్కరణలపై దృష్టి సారించాల్సిన సమయమిది!

ఎనభై కోట్ల పైచిలుకు ఓటర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం మనదే. నిర్దిష్ట కాలావధుల్లో ఎన్నికలు జరగడమే గీటురాయి అయితే, ఈ ప్రజాతంత్ర కుంభమేళా అచ్చెరువు గొలిపేదే! పదహారు సార్వత్రిక ఎన్నికల గుణదోషాల్ని నిక్కచ్చిగా మదింపు వేస్తే మాత్రం- పార్టీల ఏర్పాటు నుంచి ఎన్నికల్లో పోటీ క్రమం దాకా ప్రజాతంత్ర స్ఫూర్తి కరి మింగిన వెలగ పండునే స్ఫురింపజేస్తుంది. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగబద్ధంగా సంపూర్ణాధికారం దఖలుపడిన ఎన్నికల సంఘాన్ని మూగపావులా మార్చేసి, దుర్రాజకీయాలు ఎలా గజ్జెకట్టిందీ నడుస్తున్న చరిత్ర చాటిచెబుతోంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణదోషాలు, ఆస్తి అప్పులు ఓటర్లకు తెలిసి తీరాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం రూపేణా సుప్రీంకోర్టు స్థాయి దాకా పోరాటం చేస్తేనేగాని- ఎన్నికల వేళ అభ్యర్థుల అఫిడవిట్ల సమర్పణ ఘట్టానికి అంకురారోపణ జరగలేదు. దాన్నీ కడకంటా వ్యతిరేకించిన పార్టీలు, 'సుప్రీం' గట్టిగా మొట్టాకే రాజీబాట పట్టాయి. పార్టీల్ని రద్దుచేసే అధికారం కోసం రెండు దశాబ్దాల క్రితమే 'దరఖాస్తు' చేసుకొన్నా ప్రయోజనం లేకపోయిందని ఈసీ తాజా ప్రమాణ పత్రంలో వాపోయింది. నేరగాళ్లనే గెలుపు గుర్రాలుగా మచ్చిక చేసుకొంటున్న పార్టీలు తమ ఇష్టారాజ్యానికి భంగకరమయ్యే ఏ ప్రతిపాదనల్నీ ఆమోదించబోవని ఇప్పటికే పలు సందర్భాల్లో రుజువైంది. అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నేతిబీరలో నెయ్యి చందం చెయ్యడం మొదలు- నేరగాళ్లకు అంబారీలు కట్టడం, అక్రమ నిధుల ప్రవాహాలకు లాకులెత్తడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం వంటి సమస్త దుస్తంత్రాలకూ విరుగుడుగా 22 సంస్కరణల అజెండాను 2004లోనే ఈసీ ప్రతిపాదించింది. వాటికి మరో పాతిక జత కలిపి 2016 డిసెంబరులో మళ్ళీ సమర్పించినా, పార్టీ మదగజాల్ని సరైన పంథాలో నడిపించే అంకుశం లాంటి రద్దు అధికారం కోసం గట్టిగా కోరినా- జరిగిందీ, ఒరిగిందీ ఏమీ లేదన్న నిస్పృహ ఈసీ ప్రమాణ పత్రంలో ప్రతిఫలించింది. ఎన్నికల సంస్కరణల్లో అంతర్భాగంగా ఈసీ పాత్రనూ సర్వసమగ్రంగా పునర్ నిర్వచించాల్సిన అవసరం ఉంది!

అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, అంతర్గత అప్రజాస్వామ్యం, నేరగాళ్ల లాలన, నల్లధనం పాలన... ఇలా చెప్పుకొంటూ పోతే, ఎంచబోతే మంచమంతా కంతలే అన్నట్లున్న పార్టీల అవ్యవస్థ ముంజేతి కంకణం. వాటిని ప్రజాస్వామ్యీకరించాలన్న దాంట్లో మరోమాట లేకపోయినా, నిష్ఠగా ఆ పని చక్కబెట్టగల నైతిక స్థాయీ ప్రమాణాలు ప్రస్తుతం ఎన్నికల సంఘానికి ఉన్నాయా అన్నది మౌలిక ప్రశ్న. అస్మదీయుడిగా పేరెన్నికగన్న నవీన్ చావ్లాను ఎన్నికల సంఘంలో యూపీఏ పెద్దలు నియమించినప్పుడు పెను రాద్ధాంతమే జరిగింది. పైయెత్తున తమవాడుండాలన్న సంకుచిత రాజకీయ అజెండాలే ఎన్నికల సంఘంలో నియామకాల్ని అనుశాసిస్తున్న ప్రస్తుత తరుణంలో- పార్టీల రద్దు అధికారం దానికి కట్టబెట్టడం కచ్చితంగా ప్రజాస్వామ్య వ్యవస్థకు చెరుపు చేస్తుంది. సీఈసీ సహా ఎన్నికల కమిషనర్ల ఎంపిక కోసం ప్రధానమంత్రి, లోక్‌సభలో విపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తులతో కూడిన 'కొలీజియం' అవతరించాలని 2015లో న్యాయ సంఘం సూచించింది. ఆరేళ్ల క్రితం అడ్వాణీ కోరిందీ అదే! కెనడాలో హౌస్ ఆఫ్ కామన్స్ తీర్మానం ద్వారా నియమితులయ్యే ఎన్నికల ప్రధానాధికారి నేరుగా పార్లమెంటుకే జవాబుదారీ! ఎన్నికల సంఘం నియామకాల విషయంలో రాష్ట్రపతి విధిగా సంప్రతింపులు జరపాలని, అందుకు వీలుగా ఓ యంత్రాంగం ఏర్పాటుకు వీలుకల్పిస్తూ నిర్దేశక పత్రం రూపొందాలన్న అంబేడ్కర్ అభిమతానికి ఆనాడు మన్నన దక్కకపోబట్టే- నేరం రాజకీయం అద్వైతసిద్ధి పొందే దుస్థితి దాపురించింది. ఈ అవ్యవస్థను చెదరగొట్టే కార్యాచరణ సత్వరం పట్టాలకెక్కేలా 'సుప్రీం' మార్గదర్శకత్వం వన్నెలీనాలి!

పింఛన్లు అరకొర... సంక్షోభం కొరకొర


డాక్టర్ ఎస్.అనంత్

జీవన సంధ్యా సమయంలో అవసరానికి మేమున్నామంటూ ఎవరైనా చేయి అందిస్తే వృద్ధతరానికి అదే కొండంత ఊరట! చేవగలిగినన్నాళ్లూ ఒళ్లు హూనమయ్యేలా పనిచేసి జాతి పురోభివృద్ధికి తమవంతు తోడ్పాటును అందించి పదవీ విరమణ చేసినవారికి సామాజిక రక్షణ కల్పించడంలో మన వ్యవస్థలు దారుణంగా విఫలమవుతున్నాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుల్లో వేతనజీవులనుంచి సగటున రూ.76వేలకుపైగా వసూలవుతోందని, వ్యాపార వర్గాలనుంచి దఖలుపడుతోంది రూ.25వేలు మాత్రమేనని ఇటీవలి బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. 2016-17 ఆర్థిక సంవత్సరానికిగాను లెక్కలు వినిపించిన జైట్లీ వేతన జీవులనుంచి వ్యక్తిగత ఆదాయ పన్ను రూపంలో మొత్తంగా రూ.1.44లక్షల కోట్లు వసూలు కాగా, వ్యాపార వర్గాలనుంచి పన్నుల రాబడి రూ.48వేల కోట్లు మాత్రమేనని తేల్చారు. ప్రభుత్వానికి వసూలు అవుతున్న ఆదాయ పన్నులో మూడోవంతును జమచేస్తున్న వేతన జీవులకు, ముఖ్యంగా ప్రభుత్వేతర రంగాల్లో పనిచేసేవారికి పదవీ విరమణ తరవాత బొటాబొటి పింఛను కూడా అందుబాటులో లేని దురవస్థ గుండెలు మెలిపెడుతోంది. ఉద్యోగవర్గాలనుంచి ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వానికి- జీవన సంధ్యలో వారికి రక్షణ ఛత్రం కల్పించే విషయంలో చిత్తశుద్ధి కొరవడటమే ఆందోళన కలిగిస్తోంది.

నానాటికి తీవ్ర రూపం

పింఛను వ్యవస్థ ఏనాటికైనా పేలిపోయే ప్రమాదం ఉన్న 'టైమ్ బాంబు'లా తయారైంది. భారత జనాభాలో అత్యధికులకు ఎటువంటి పింఛన్లు అందకపోవడం నాణేనికి ఒక పార్శ్వమైతే- వాటిని అందుకొంటున్న కొద్దిమంది భవిష్యత్తు కూడా అనిశ్చితంగా తయారైంది. మరి రెండు దశాబ్దాల్లో వృద్ధుల సంఖ్య పెరగనున్న దృష్ట్యా జీవన మలిసంధ్యలో వారికి ఆసరా ఏమిటనే ప్రశ్న ఇప్పుడు కలవరపెడుతోంది. చిరకాలంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పాత పింఛను విధానాన్ని నిలిపేసి, 'కాంట్రిబ్యూటరీ పింఛన్' పద్ధతికి మారడంపై కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం ముంచుకొస్తున్న పింఛను సంక్షోభానికి సంకేతం! నేడు భారతీయ సమాజంలో సమూల మార్పులు వస్తున్నాయి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఏక కుటుంబాలు ఎక్కువవుతున్నాయి. ప్రస్తుతం దేశ జనాభాలో యువతీయువకుల శాతం చాలా ఎక్కువగా ఉన్నా ముందు ముందు ఇదే పరిస్థితి ఉండదు. నేడు భారతీయుల సగటు వయసు 27.9 ఏళ్లు, 2017లో దేశ జనాభాలో 65 ఏళ్లు పైబడినవారు 6.24 శాతం. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం 60 ఏళ్లు పైబడినవారి సంఖ్య నేడు 17 కోట్లు. 2040నాటికి వారి సంఖ్య 28 కోట్లకు పెరగనుంది. పనిచేసే జనాభాలో కేవలం 7.4 శాతానికే ఏదో ఒక పెన్షన్ పథకం వర్తిస్తోంది. పరిస్థితి ఇంత అధ్వానం కాబట్టే 50 దేశాల 'మెర్సర్ పెన్షన్ సూచీ'లో భారత్ 48వ స్థానంలో సరిపుచ్చుకొంటోంది. అదే జర్మనీలో పనిచేసే జనాభాలో 65 శాతానికి, బ్రెజిల్‌లో 30 శాతానికి పింఛను వస్తోంది. మెర్సర్ సూచీలో భారత్‌కన్నా అధమంగా ఉన్న దేశాలు మెక్సికో, అర్జెంటీనాలు మాత్రమే. పింఛనుపరమైన అసమానతలను త్వరగా నివారించకపోతే, సమస్య ముందు ముందు పెరిగి పెద్దదవుతుంది. పింఛను పథకాన్ని విస్తరించకపోతే 2030నాటికి వృద్ధుల బాగోగులను చూడటానికి ప్రభుత్వం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఏకంగా 4.1 శాతం వెచ్చించాల్సి వస్తుందని 'క్రిసిల్' హెచ్చరించింది.

భారత్‌లో పింఛను సమస్యకు రెండు కోణాలు ఉన్నాయి. ఒకటి- అనేకమంది భారతీయులు వృద్ధాప్యంలో ఆసరాకు ఎటువంటి ఏర్పాట్లు చేసుకోకపోవడం, చేసుకోలేకపోవడం. నాణేనికి రెండోవైపు చూస్తే- ప్రభుత్వం నుంచి పింఛను పొందే అవకాశమున్నవారికి కూడా దానితో జీవనం గడపగలమనే ధీమా లేకుండా పోతోంది. పెరుగుతున్న జీవన వ్యయం, వైద్యఖర్చులు ఈ దుస్థితికి కారణం. ప్రభుత్వంలోనూ వీరిపట్ల శ్రద్ధ లోపిస్తోంది. పరిశ్రమలకు చౌకరేట్లకు రుణాలు అందించాలనే ఉద్దేశంతో తరచూ వడ్డీరేట్లు తగ్గిస్తున్నందువల్ల వృద్ధులకు తమ పెట్టుబడులపై రాబడి తగ్గిపోతోంది. ఒకవైపు ఆరోగ్య ఖర్చులు పెరుగుతుంటే మరోవైపు పింఛను, వడ్డీ ఆదాయం పడిపోవడం నిజంగా దారుణం. 2004లో గ్రామీణ భారతంలో తలసరి ఆస్పత్రి ఖర్చులు రూ.5,695. 2014లో ఆ మొత్తం రూ.14,935కి చేరింది. ఇదే కాలంలో పట్టణ భారత ఆస్పత్రి ఖర్చులు రూ.8,851 నుంచి రూ.24,436కి పెరిగాయి.

భారత్‌లో పరిమిత సామాజిక భద్రత కల్పించే అటల్ పెన్షన్ యోజన మొదలుకొని అనేక రకాల పింఛన్ పథకాలున్నాయి. అటల్ యోజన పథకం కింద కొన్నేళ్లపాటు నిర్దిష్ట మొత్తాలను కడుతూ ఉంటే 60 ఏళ్లు దాటిన తరవాత కొంత పింఛను వస్తూ ఉంటుంది. దేశంలో అత్యధిక పింఛను ఖాతాలను నిర్వహించేది- ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) మాత్రమే. 2004 జనవరి ఒకటినాటికి ముందు ప్రభుత్వోద్యోగులకు ఈ సంస్థ పాత పింఛను విధానాన్ని వర్తింపజేస్తోంది. 2004 తరవాత సర్వీసులో చేరినవారికి 'కాంట్రిబ్యూటరీ పింఛను' విధానం వర్తిస్తుంది. దీనికింద ఉద్యోగులు, యజమానుల వాటాలను



వృద్ధాప్యంలో దక్కని సాంత్వన

ఒక నిధిలో జమచేస్తారు. దాన్ని ఈపీఎఫ్ఓ అనుమతించిన 'ఎసెట్ మేనేజర్లు' నిర్వహిస్తారు. 20 మందికన్నా ఎక్కువ ఉద్యోగులున్న ప్రతి సంస్థ (కొన్ని మినహాయింపులకు లోబడి) భవిష్యనిధికి నిర్ణీత మొత్తాలను జమచేయాలని చట్టం చెబుతోంది. ఉద్యోగుల జీతంలో నిర్దిష్ట మొత్తాన్ని భవిష్యనిధికి జమచేసి, యజమానుల వాటా కింద మరికొంత మొత్తాన్ని కట్టాలి. కొన్ని సంస్థలు ఈపీఎఫ్ఓ అనుమతితో సొంతగా భవిష్యనిధి ట్రస్టులు ఏర్పాటు చేసుకొన్నాయి. వీటిని మినహాయింపు పొందిన ట్రస్టులంటారు. ఉద్యోగుల భవిష్యనిధి, ఉద్యోగుల పింఛను పథకం, ఉద్యోగుల డిపాజిట్ అనుసంధాన బీమా పథకాలను ఈపీఎఫ్ఓ నిర్వహిస్తోంది. 1952లో నెలసరి వేతనం రూ.300, ఆపైన ఉండి, కనీసం ఏడాదిపాటు సర్వీసులో ఉన్న ఉద్యోగుల నుంచి భవిష్యనిధి (పీఎఫ్) మొత్తాలను ఈపీఎఫ్ఓ స్వీకరించసాగింది. 2014 సెప్టెంబరు నుంచి కనీస వేతనాన్ని రూ.15,000కు పెంచారు. డిపాజిట్ అనుసంధాన బీమా పథకం కింద ఉద్యోగుల వాటా ఏమీ తీసుకోకుండానే ఆరు లక్షల రూపాయల వరకు లబ్ధి చేకూరుతుంది. 2016 మార్చి 31 ఈపీఎఫ్ఓ సభ్యుల సంఖ్య 17.14 కోట్లకు చేరింది.

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థకు జమ అయిన నిధులు... పెట్టిన పెట్టుబడులు (రూ.కోట్లలో...)

సంవత్సరం	వసూళ్లు	చెల్లింపులు	పెట్టుబడులు	వృద్ధి శాతం	పెట్టుబడి నిధి	వృద్ధి శాతం
2013–14	94,762.09	43,519.88	1,06,921.66	24.22	7,39,081.25	16.91
2014–15	1,13,910.89	48,015.32	1,35,930.10	27.13	8,75,148.34	18.41
2015–16	1,23,034.90	49,656.62	1,68,433.09	23.91	10,43,581.67	19.25

ఆధారం: ఈపీఎఫ్ఓ వార్షిక నివేదిక 2015–16

మొత్తం 9.26 లక్షల సంస్థలు ఈపీఎఫ్ఓలో నమోదైనా, 2016లో పీఎఫ్ చందాలు కట్టిన 4.36 లక్షల సంస్థల నుంచి 3.76 కోట్లమంది మాత్రమే ఈపీఎఫ్ఓ సభ్యులుగా ఉన్నారు. ఇంకా స్వతంత్ర పెన్షన్ ఫండ్ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) నియంత్రించే 'సూపర్ యాన్యుయేషన్' నిధులూ కొన్ని పింఛన్ పథకాలను నిర్వహిస్తున్నాయి. 2004 తరవాత ఈపీఎఫ్‌తోపాటు అన్ని పింఛన్ పథకాలు కొత్త పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్)కింద 'కాంట్రిబ్యూటరీ పింఛన్' విధానాలుగా మారాయి. ఈపీఎఫ్ఓ కేంద్ర కార్మిక- ఉపాధి శాఖ అజమాయిషీలో ఉంటే పీఎఫ్ఆర్‌డీఏ 2003లో అమలులోకి వచ్చిన ఒక చట్టం కింద స్వతంత్రంగా పనిచేస్తోంది.

భావి సవాళ్లు

ఈపీఎఫ్ఓ తన సభ్యులకు భవిష్యత్తులోనూ సముచిత పింఛన్ మొత్తాలను చెల్లించగలిగితేనే వారు ప్రశాంతంగా పదవీ విరమణానంతర జీవితం గడపగలుగుతారు. కాబట్టి ఈపీఎఫ్ఓ ఆర్థిక పటిష్ఠతకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఆందోళనకర విషయమేమంటే ఈపీఎఫ్ఓ పెట్టుబడులపై రాబడి తగ్గిపోవడం. ఈపీఎఫ్ఓ మొత్తం పెట్టుబడులు రూ.4.43 లక్షల కోట్లలో రూ.1.83 లక్షల కోట్లపై కేవలం ఎనిమిది నుంచి 8.5 శాతం రాబడి మాత్రమే వస్తోంది. మరో రూ.1.51 లక్షల కోట్లపై 8.5 నుంచి తొమ్మిది శాతం రాబడి వస్తోంది. మిగిలిన లక్ష కోట్ల రూపాయల పైచిలుకు పెట్టుబడులు 8.8 శాతం రాబడినిస్తున్నాయి. ఈపీఎఫ్ఓ నష్టభయం లేని పెట్టుబడులే పెడుతుంది. దాని మొత్తం పెట్టుబడులు రూ.4.43 లక్షల కోట్లలో రూ.2.22 లక్షల కోట్లను 8 శాతం నుంచి 9 శాతం రాబడినిచ్చే కార్పొరేట్ రుణ పత్రాలు, బాండ్లలో, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన రుణాల్లో పెట్టుబడి పెట్టింది. 2012లో మొత్తం పెట్టుబడులు రూ.2.37 లక్షల కోట్లలో రూ.52,268 కోట్లను ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ బాండ్లలో మదుపు చేసింది. ఇవి కార్పొరేట్ బాండ్లకన్నా భద్రమైనవి. అయినా కూడా ఈపీఎఫ్ఓ ఖర్చులు పోనూ మిగిలే ఆదాయం రాబోయే 30 ఏళ్లలో పింఛను చెల్లింపులకు చాలకపోవచ్చు. అదేజరిగితే వృద్ధాప్యంలో ఆహారం, ఆరోగ్యం, నివాసాలపై ఖర్చులకు సరిపడా పెన్షన్ లభించక పింఛనుదారులు ఇబ్బందిపడతారు. నానాటికి పెరుగుతున్న ధరలే దీనికి కారణం. ఈ అవాంతరాన్ని ఎదుర్కోవాలంటే ఈపీఎఫ్ఓ తన పెట్టుబడులపై మరింత ఆదాయం ఆర్జించాలి. 1990లలో యూటీఐ సంక్షోభంలో పడినప్పుడు ప్రభుత్వం పెద్దయెత్తున చేయూత ఇవ్వాల్సి వచ్చింది. ఈపీఎఫ్ఓ వంటి సంస్థలు సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగని అధిక రాబడులకోసం ఈపీఎఫ్ఓను ఈక్విటీ షేర్లలో పెట్టుబడి పెట్టాలని ఒత్తిడిచేయడం మంచిదికాదు.


ఈపీఎఫ్ఓ సరైన మొత్తాల్లో పెన్షన్ చెల్లించడమనేది రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక ఆరోగ్యం మీద ఆధారపడి ఉంది. ఈపీఎఫ్ఓతోపాటు జీవిత బీమా సంస్థ సైతం రాష్ట్రాలకు భారీగా అప్పులిచ్చింది. అందువల్ల రాష్ట్రాల ఆర్థిక రథాన్ని కేంద్రం సరైనగాడిలో పెట్టాలి. ఈపీఎఫ్ఓ కూడా తన పెట్టుబడుల నిర్వహణను సమర్థులకు అప్పగించాలి. సక్రమంగా పీఎఫ్ మొత్తాలు చెల్లించని సంస్థలనుంచి ఈపీఎఫ్ఓ వసూలు చేస్తున్న బకాయిలు ఈ మధ్య బాగా పెరుగుతున్నా, బకాయిలు పెడుతున్న సంస్థల్లో రాష్ట్రప్రభుత్వ విభాగాలు, సంస్థలు ఉండటం విచారకరం. అసలు ఏ సంస్థ అయినా మొదట పీఎఫ్ బకాయిల వంటివి ముందుగా చెల్లించాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసి ఉంది. కాబట్టి కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లో పీఎఫ్ బకాయిలను మినహాయించి ఈపీఎఫ్ఓకు బదిలీ చేయడం ఉత్తమం. కేంద్ర ప్రభుత్వం రోడ్లు, విద్యుత్ ప్లాంట్లు, రేవుల వంటి మౌలిక వసతుల కల్పనకు 20-30 ఏళ్ల బాండ్లను విడుదల చేసి వాటిలో ఈపీఎఫ్ఓ, ఎల్ఐసీ, బ్యాంకులు పెట్టుబడి పెట్టేలా నిబంధనలు రూపొందించాలి. సాధారణ ప్రభుత్వ బాండ్లకు చెల్లిస్తున్న వడ్డీకన్నా 1-1.5 శాతం ఎక్కువ వడ్డీని మౌలిక బాండ్లకు చెల్లించాలి. వీటిలో పెట్టుబడులు సురక్షితమైనవి. పౌరులకు సామాజిక భద్రత కల్పించడానికి ఆవశ్యకమైనవి. ఈ బాండ్లపై అధికవడ్డీ చెల్లించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. జీవితాంతం సమాజానికి తమవంతు సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బాగోగులను చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత!

మాల్దీవుల పీటముడి

భూతాపం వల్ల సముద్ర మట్టం పెరిగితే ముందుగా నీట మునిగేది మాల్దీవులేనని వాతావరణ శాస్త్రజ్ఞులు ఎన్నడో హెచ్చరించారు. అంతకన్నాముందే ఆ దేశానికి రాజకీయపరమైన ఉపద్రవం ముంచుకొచ్చింది. హిందు మహాసముద్రంలో 1,192 ద్వీపాల సముదాయమైన మాల్దీవుల్లో ప్రజాస్వామ్యం, న్యాయపాలన మంటగలిసిపోవడంపై అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ముఖ్యంగా ఈ ద్వీపరాజ్యంలో చైనా ప్రభావం, ఇస్లామిక్ ఉగ్రవాదుల కార్యకలాపాలు పెరగడం భారత్‌తోపాటు అమెరికానూ కలవరపెడుతోంది. అందుకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాల్దీవుల సంక్షోభం గురించి చర్చించారు. ఆసియా-పసిఫిక్ బదులు ఇండో-పసిఫిక్ అనే పదబంధాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన ట్రంప్, హిందూ మహాసముద్రం నుంచి దక్షిణ చైనా సముద్రం వరకు విస్తరిస్తున్న చైనా ప్రాబల్యంపై సహజంగానే అప్రమత్తమయ్యారు. ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత, సౌభాగ్యాల కోసం కలిసికట్టుగా కృషి చేస్తామని ట్రంప్, మోదీలు ఉద్ఘాటించారు. మాల్దీవుల్లో ప్రజాస్వామ్య రక్షణకు ఒకవేళ జోక్యం చేసుకోవలసి వస్తే ప్రత్యేక సైనిక దళాలను పంపడానికి మోదీ సర్కారు సిద్ధంగా ఉందని వార్తలు వచ్చాయి కూడా. కానీ, అంతలోనే చైనా రంగంలోకి దిగి మాల్దీవుల విషయంలో తొందరపడి మరొక సంఘర్షణ స్థితిని సృష్టించవద్దని మోదీ సర్కారును కోరడం విశేష పరిణామం. ఇటీవల డోక్లామ్‌లో భారత్-చైనాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని చైనా ఈ సలహా ఇచ్చినట్లుంది. పాకిస్థాన్ నుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్న మసూద్ అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటింపజేయడానికి మోదీ సర్కారు ఐక్యరాజ్య సమితిని ఒప్పించినా చైనా దానికి మోకాలడ్డిన సంగతి తెలిసిందే. మాల్దీవులు కొంతకాలం నుంచి క్రమక్రమంగా చైనా ప్రాబల్యం కిందకు వెళ్లిపోతున్నాయి. తమ దేశంలో ఏర్పడిన కల్లోలస్థితి గురించి వివరించడానికి మూడు మిత్రదేశాలకు దూతలను పంపుతున్నట్లు మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ప్రకటించడం ఇక్కడ గమనార్హం. యమీన్ ఇచ్చిన మిత్రదేశాల జాబితాలో చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియాలు మాత్రమే ఉన్నాయి. మాల్దీవులకు మొదటి నుంచీ అండగా ఉన్న భారత్‌ను యమీన్ మిత్రదేశంగా పరిగణించడం లేదు.

పూర్వాపరాలు

ముప్పై సంవత్సరాల క్రితం (1988లో) భారత్ సైనిక చర్యతో మాల్దీవుల్లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిన సంగతిని యమీన్ విస్మరించినా ప్రతిపక్షం మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండీపీ) మరచిపోలేదు. అప్పట్లో శ్రీలంక తమిళ కిరాయి సైనికుల సాయంతో అబ్దుల్లా లతుఫీ అనే వ్యాపారవేత్త మాల్దీవుల ప్రభుత్వాన్ని కూలదోయడానికి తిరుగుబాటు లేవదీశాడు. దీంతో అప్పటి అధ్యక్షుడు అబ్దుల్ గయూం వినతిపై భారత్ సేనలను పంపి తిరుగుబాటును అణచివేసింది. తాజా సంక్షోభ పరిష్కారానికి మళ్ళీ సేనలను పంపాలని ప్రతిపక్షం ఎండీపీ కోరగా ప్రస్తుత అధ్యక్షుడు యమీన్ ఆ ఊసే ఎత్తలేదు. ఇప్పుడు యమీన్ ప్రభుత్వ సమ్మతి లేకుండా భారత్ సేనలను పంపితే మాల్దీవులు చైనా, పాకిస్థాన్‌ల ఒడిలోకి చేరిపోవచ్చు. నిజానికి 2012 నుంచే భారత్, మాల్దీవుల సంబంధాలు సజావుగా లేవు. అప్పట్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడు నషీద్‌ను యమీన్ బలప్రయోగంతో కూలదోసి అధికారం చేపట్టారు. తరవాత 2013నాటి వివాదగ్రస్త ఎన్నికల్లో గెలిచి అధ్యక్షుడయ్యారు. అప్పటినుంచి సొంత పార్టీలోని అసమ్మతీయులతోపాటు ప్రతిపక్షాలనూ అణచివేసి భారత్‌కు దూరం జరగసాగారు. రాజధాని మాలెలో విమానాశ్రయ నిర్మాణ కాంట్రాక్టును భారత్‌కు చెందిన జీఎంఆర్ సంస్థ చేతుల్లో నుంచి లాగేసి చైనాకు అప్పగించారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2015లో మాల్దీవుల పర్యటనకు వచ్చినప్పుడు జరిగిన నిర్వాకమిది. 2013లో చైనా చేపట్టిన సముద్ర సిల్క్ రోడ్ ప్రాజెక్టులో యమీన్ ఎంతో ఉబలాటంగా చేరి, మాల్దీవుల్లో కొన్నింటిని స్థావరాల నిర్మాణార్థం చైనాకు లీజుకిచ్చారు.


అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్

చైనా ప్రచ్ఛన్న రాజకీయ ఫలితం

భారత్‌ను చక్రబంధంలో ఇరికించే చైనా ముత్యాల సరం వ్యూహానికి యమీన్ ఈ విధంగా ఊతమివ్వడమే కాదు, చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి పార్లమెంటుతో హడావుడిగా ఆమోదముద్ర వేయించారు. ఈ ఏడాది జనవరిలో తమ విదేశాంగ మంత్రిని దిల్లీకి పంపి భారత్‌ను అనునయించే ప్రయత్నం చేశారు. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది!

ఫిబ్రవరి ఒకటిన మాల్దీవుల సుప్రీంకోర్టు ఇచ్చిన ఓ తీర్పు ప్రస్తుత సంక్షోభానికి దారితీసింది. మాజీ దేశాధ్యక్షుడు నషీద్‌తో సహా మొత్తం తొమ్మిది మంది రాజకీయ ఖైదీలపై ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో కేసులు బనాయించిందని, వారందరినీ తక్షణం విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది, అంతేకాదు, ప్రస్తుత అధ్యక్షుడు యమీన్ పార్లమెంటు నుంచి వెళ్లగొట్టిన 12మంది సభ్యత్వాలను పునరుద్ధరించాలనీ ఉద్ఘాటించింది. యమీన్ నాయకత్వంలోని ప్రోగ్రెసివ్ పీపుల్స్ పార్టీ ఆఫ్ మాల్దీవ్స్ (పీపీఎం) నుంచి ప్రతిపక్షంలోకి ఫిరాయించడమే ఆ 12మందీ చేసిన నేరం. వీరిని కలుపుకొని ఫిబ్రవరి అయిదున పార్లమెంటును మళ్ళీ సమావేశపరచాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో యమీన్ గొంతులో పచ్చివెలక్కాయ పడింది. బహిష్కృత ఎంపీలు మళ్ళీ రంగప్రవేశం చేస్తే యమీన్ సర్కారు మైనారిటీలో పడిపోతుంది. కోర్టు తీర్పును శ్రీలంకలో ప్రవాసం ఉంటున్న మాజీ అధ్యక్షుడు నషీద్‌తోపాటు ఆయన పార్టీ ఎండీపీ, ఇతర ప్రతిపక్షాలు స్వాగతించాయి. యమీన్ మాత్రం కోర్టు తీర్పును తన ప్రభుత్వంపై తిరుగుబాటుగా పరిగణించి, దేశంలో 15 రోజులపాటు ఆత్యయిక స్థితి ప్రకటించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు మరో సీనియర్ న్యాయమూర్తినీ అరెస్టు చేయించారు. తన మారుటి సోదరుడు, పూర్వ అధ్యక్షుడు గయూమ్‌నూ కటకటాల వెనక్కునెట్టారు. 1978-2008 మధ్యకాలంలో మాల్దీవులను పాలించిన గయూం ప్రస్తుతం ప్రతిపక్షాలతో చేతులు కలిపారు.

ఆచితూచి నిర్ణయం

1988లో భారత్ సైనిక జోక్యాన్ని ఆహ్వానించినది గయూమే. సుప్రీంకోర్టు తీర్పును ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శితోపాటు భారత్, అమెరికా, బ్రిటన్, ఐరోపా సమాఖ్య, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలు హర్షించినా యమీన్ చైనా అండతో ఎవరినీ ఖాతరు చేయడం లేదు. ఆయన ఒత్తిడికి జడిసి ఫిబ్రవరి ఆరున మిగతా ముగ్గురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాజకీయ ఖైదీల విడుదల ఉత్తర్వును వెనక్కుతీసుకున్నారు. దీన్ని అనేక దేశాలు ఖండించాయి. మాల్దీవుల పరిణామాలను 'ప్రపంచం గమనిస్తోంది' అని అమెరికా ప్రకటించింది.

యమీన్ మాత్రం చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ల అండ చూసుకుని తన పంతమే తనదిగా నడచుకొంటున్నారు. చైనా, సౌదీ, యూఏఈలు మాల్దీవుల్లో భారీయెత్తున పెట్టుబడులు పెట్టగా, ఇస్లామిక్ స్టేట్(ఐసిస్), లష్కరే తొయిబాలు అక్కడ స్థావరాలు నెలకొల్పాయి. ఇటువంటి ఉగ్రవాద మూకలు తన పొరుగున తిష్ఠ వేయడం భారత్‌కు కలవరం కలిగిస్తోంది. అదీకాకుండా మాల్దీవుల్లో వృత్తివ్యాపారాలు నిర్వహిస్తున్న 25 వేలమంది భారతీయుల యోగక్షేమాలను చూసుకోవలసిన బాధ్యత మన సర్కారుపై ఉంది. వీరికి ఏమైనా హాని జరిగితే భారత సేనలు రంగంలోకి దిగుతాయి. ప్రస్తుతానికి అలాంటి అవసరం కనిపించడం లేదు. అంతమాత్రాన భారత్ చేతులు ముడుచుకుని కూర్చోవడం లేదు. మాల్దీవులకు ఐక్యరాజ్య సమితి నిజనిర్ధారణ సంఘాన్ని పంపాలని, అన్ని ప్రజాస్వామ్య దేశాల న్యాయవ్యవస్థలు ప్రస్తుతం జైలులో ఉన్న మాల్దీవుల ప్రధాన న్యాయమూర్తికి సంఘీభావం ప్రకటించి ఆయన విడుదలకు కృషి చేయాలని భారత్ విజ్ఞప్తి చేసింది. మాల్దీవుల్లో ఆత్యయిక స్థితిని ఎత్తివేసి, ఫిబ్రవరి ఒకటి నాటి సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి మాజీ అధ్యక్షుడు నషీద్‌ను జైలు నుంచి విడుదల చేసేలా యమీన్‌పై ఒత్తిడి తీసుకురావాలి. అదే జరిగితే ఈ ఏడాది చివర్లో మాల్దీవుల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఇందుకు భారత్ అంతర్జాతీయ సమాజాన్ని కలుపుకొనిపోవాలి.

– ప్రసాద్

దయానంద సరస్వతి

సామాన్యులు తాము సృష్టించుకొన్న ఆనందాన్ని తామే అనుభవిస్తుంటారు. ఇది లోక సహజం. అసామాన్యులు తాము అన్వేషించి పొందిన సంతోషాన్ని లోకం అంతటికీ పంచాలనుకుంటారు. వారు మహాత్ములు. లోకులు పొందే ఆనందాన్ని తమదిగా భావిస్తుంటారు. వారిలో అగ్రగణ్యులు దయానంద సరస్వతి. విశ్వాన్ని ఆర్య (పూజ్య)మయం చేయాలనే దృఢ సంకల్పంతో ఆర్యసమాజాన్ని స్థాపించిన ఆయన, ధర్మ ప్రచారానికి ఎనలేని కృషి సాగించి చరిత్రలో శాశ్వతంగా నిలిచారు. జగత్తుకు వేదాల గొప్పతనాన్ని, యజ్ఞ వైభవాన్ని తనదైన రీతిలో పంచిపెట్టారు. ఆచరణ యోగ్య ధర్మాల గురించి కూలంకషంగా వివరించారు. మూఢవిశ్వాసాలతో మగ్గిపోతున్న వారి కళ్లు తెరిపించి యథార్థ జ్ఞానాన్ని అందించారు. ఆర్ష వాఙ్మయం ఎంతటి మహిమ గలదో గ్రంథాల ద్వారా లోకానికి చాటిచెప్పారాయన.

దయానంద సరస్వతి 1824 ఫిబ్రవరి 12న గుజరాత్ రాష్ట్రంలోని 'టంకార' గ్రామంలో జన్మించారు. భగవంతుడి సత్యరూపాన్ని తెలుసుకొనేందుకు ఉద్యమించి, 1846లో ఇల్లు వీడి వెళ్లారు. దేశమంతటా తిరుగుతూ, ఎందరో మునులతో చర్చలు జరిపారు. అనేక సందేహాలు అడిగి సమాధానాలు రాబట్టారు. చిన్ననాటి పేరును త్యజించి 'దయానంద' అనే తాత్విక నామం ధరించారు. మదురలో స్వామి విరజానంద సరస్వతిని దర్శించారు. వేదాల్ని, ఉపనిషత్తుల్ని సమగ్రంగా అధ్యయనం చేశారు. దీనజనుల జీవితాల్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకొన్నారు. కుల, మత, వర్గాల పేరుతో వైదిక సంస్కృతికి సమాజం దూరమవుతుండటం చూసి ఆయన ఎంతో చలించిపోయారు. సదాచారాల్ని, జ్ఞానరాశిని అందరి దరికీ చేర్చాలని



దృఢంగా సంకల్పించారు. అంటరానితనం, సతీ సహగమనం, బాల్యవివాహాల వంటి దురాచారాలు సంఘాన్ని నిర్వీర్యం చేయడాన్ని గ్రహించారు. ధర్మంలోని మానవీయ దృక్పథాల్ని సమాజానికి విశదీకరించారు. దురాచారాల దుమ్ము దులిపేలా ఓ విశిష్ట పతాకాన్ని ఆవిష్కరించి, 'ఆర్య సమాజ లక్ష్యం సర్వసమానత్వ సముద్ధరణ' అని దయానంద నిరూపించారు. స్త్రీ విద్యను ఆయన అడుగడుగునా ప్రోత్సహించారు. వేదకాలంలో బ్రహ్మవాదినులైన గార్గి, మైత్రేయి వంటివారు సంపాదించిన తిరుగులేని బ్రహ్మజ్ఞానాన్ని సర్వజన విదితం చేశారు. ధర్మాచరణలో స్త్రీలకు గల విశిష్టతను అందరికీ తెలియజేశారు. ఆర్య సంస్కృతిలోని అమృత తత్వాన్ని ప్రపంచానికి చాటారు.

అంతర్యామి

అగ్నిని ఉపాసించే యజ్ఞాల వల్ల మనిషికి తేజస్సు, ఓజస్సు కలుగుతాయన్నారు. యాగాల కారణంగా వాతావరణ కాలుష్యం తొలగిపోతుంది. ప్రకృతి నిర్మలంగా మారుతుంది. 'యజ్ఞం మానవ జీవనానికి ప్రతీక' అని వర్ణించి నిరూపణ చేసిన మహానుభావుడు దయానంద.

ఆయన రచించిన లోకోత్తర గ్రంథం 'సత్యార్థ ప్రకాశం'. అది సర్వత్రా సత్యమయమైన జ్ఞానాన్ని పంచింది. వివిధ మంత్రాల అసలైన అర్థాల్ని విపులీకరించింది. సత్యాన్ని ప్రకాశింపజేయాలన్నదే ఆ రచనలోని అసలు సంకల్పం. వేదాల జ్ఞానరాశి ఎవరికీ అందేది కాదన్న అపోహను దయానంద సరస్వతి తొలగించారు. వేదహృదయాన్ని జనసామాన్యానికి అందజేసిన ఉన్నత వ్యక్తిత్వం ఆయనది.

ఓ ధార్మిక రత్నంగా ఆ మహనీయుడు ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటారు!

– డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

మా చిరునామా: వారెవ్వా! ఈనాడు
ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

varevva@eenadu.in

ఆమే ఒక పట్టణం



ఊరంతా ఒకరే

ఒక మనిషి ఎన్ని ఉద్యోగాలు చేయొచ్చు? ఒకటి.. రెండు.. మహా అయితే మూడు. కానీ ఎల్సీ ఐలర్ అనే ఆవిడ ఏకంగా పదివరకు కొలువులు చేస్తోంది. మేయర్, క్లర్క్, లైబ్రేరియన్, కోశాధికారి, బార్‌టెండర్.. ఇలా అన్నీ ఆవిడే. అన్నింటికన్నా చిత్రం ఏంటంటే అమెరికా నెబ్రాస్కా రాష్ట్రంలోని మోనావి అనే పట్టణంలో ఉండే ఏకైక పౌరురాలు ఎల్సీనే. 2010 లెక్కల ప్రకారం అక్కడ ఆమె ఒక్కరే నివసిస్తున్నారు. తర్వాత కొత్తగా జనం పుట్టింది లేదు. ఎవరైనా వలస వచ్చిందీ లేదు. ప్రతి పర్యాయం ఎన్నికలు నిర్వహించడానికి కొందరు సిబ్బంది ఆ ఊరిలోకి వస్తారట. అప్పుడు లెస్లీ తనకు తానే ఓటు వేసుకొని మేయర్‌గా ఎంపికవుతుంది. మునిసిపల్, గ్రంథాలయం, రెవెన్యూ... ఇతర విధులు నిర్వర్తించడానికి ఎవరూ లేకపోవడంతో ఆ పనులన్నీ తనే చక్కబెడుతుంది.

అంతేకాకుండా తను ఓ బారుకి యజమాని కూడా. లైసెన్స్ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ఓ ఉద్యోగిని పంపుతుంది. ఆ ఉద్యోగి కూడా లెస్లీనే.

ఇంతటి ప్రత్యేకత ఎలా సాధ్యమైందంటే ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోవాల్సిందే. 1930ల్లో మోనావిలో దాదాపు నూటాయాభై మంది వరకు జనం ఉండేవారు. స్కూలు, కాలేజీ, దుకాణాలు, రెస్టరెంట్లు, జైలు ఇలా చాలానే ఉండేవి. అక్కడే పుట్టిపెరిగి, చదువుకున్న లెస్లీ.. రూడీ అనే అబ్బాయితో ప్రేమలో పడింది. పెళ్లి చేసుకుంది. రూడీ అమెరికన్ ఎయిర్‌లైన్స్‌లో పైలట్. ఎయిర్‌హోస్టెస్‌గా పని చేయాలనే ఆశతో భర్తతో కలిసి కన్సాస్ నగరం వెళ్లిపోయింది. చాన్నాళ్లు ప్రయత్నించినా ఆమె కోరిక తీరలేదు. ఈలోపు రూడీ ఉద్యోగ కాంట్రాక్టు ముగిసిపోవడంతో ఇద్దరూ మోనావి తిరిగొచ్చారు. కొన్నాళ్లకి వాళ్లకి పిల్లలూ పుట్టారు. తర్వాత రెండో ప్రపంచయుద్ధం రావడంతో జనం వలసలు మొదలయ్యాయి. చివరికి మొత్తం పట్టణం ఖాళీ అయ్యింది. కాలక్రమంలో ఎల్సీ భర్త కూడా చనిపోయాడు. తర్వాత ఆయన గుర్తుగా వాళ్లింట్లో ఉన్న ఐదువేలకుపైగా పుస్తకాలతో ఓ గ్రంథాలయం తెరిచింది ఎల్సీ. అందులోకి స్థానిక జనం ఎవరూ రారు. అయినా తను బారు, లైబ్రరీని తెరవడం మాత్రం మరవదు. ఎందుకంటే ఒకే ఒక్కరు జనాభా ఉన్న ఈ ఊరిని చూడ్డానికి ప్రపంచం నలుమూలల నుంచి సందర్శకులు వస్తూనే ఉన్నారు మరి. ఎల్సీకి పిల్లలు, వాళ్ల పిల్లలు మొత్తం 12మంది మోనావికి తొంభై మైళ్ల దూరంలో ఉన్న నెబ్రాస్కాలో స్థిరపడ్డారు. వాళ్లు అక్కడికి రమ్మని పోరుతున్నా తను వెళ్లదు. ఈ పట్టణాన్ని సందర్శించేవారికి తన అనుభవాలు, అనుభూతులు పంచడం ఎల్సీకిష్టం. చివరిరోజు వరకూ అలాగే గడుపుతానంటోంది.

చిలుకా క్షేమమే



చిలుక పచ్చ హృదయం

అది చెన్నైలోని పిక్రాఫ్ట్‌రోడ్..
హౌస్ నంబర్ 242, రెండో అంతస్తు..
ఉదయం ఆరుగంటలు!

ఠంచనుగా గంటకొట్టినట్లు రామచిలుకల సైన్యం కిలకిల రావాలతో వచ్చి వాలింది. పద్ధతిగా పంక్తి భోజనాలు చేసినట్లు చిలుకలన్నీ ఆహారాన్ని తింటాయి. ఇదంతా ఒక రోజు ముచ్చట కాదు. పుష్కరకాలం నుంచీ ఇదే పరిస్థితి. ఆ రామచిలుకలకు రామరాజ్యం సృష్టించింది జోసెఫ్ శేఖర్. అతన్ని ముద్దుగా 'బర్డ్‌మ్యాన్' అంటారు. చెన్నైలోని 'బర్డ్‌మ్యాన్' ఉండే వీధిలో వేకువజాము ఆ చిలకముక్కుల ఎర్రటిసూర్యుళ్ల నుంచే ప్రారంభమవుతుంది. శేఖర్ విషయానికొస్తే.. అతనో సాధారణ కెమెరా మెకానిక్. చిన్నప్పటినుంచీ అతనికి పక్షులంటే ప్రేమ. యవ్వనంలో ఉండగా ఇంటి దూలాలకు జొన్న కంకులను వేలాడ తీసేవాడు. చెన్నపట్నానికి వచ్చాకా ఆయనకు అలవాటు పోలేదు.

రెండు పూటలు

రోజూ ఉదయాన్నే నాలుగున్నరకు లేచి బియ్యాన్ని పదినిమిషాలు నానపెడతాడు. రెండు గోడలను కలిపేట్లు పద్నాలుగు చెక్కలను ఉంచుతాడు. వాటిపై పెళ్లి భోజనం వడ్డించినట్లు పిడికెడుతో బియ్యాన్ని పద్ధతిగా వడ్డిస్తాడు. ప్రతీరోజూ ఆరుగంటలకు పదిహేను నిమిషాల ముందే ఈ పని పూర్తి చేస్తాడు. కచ్చితంగా ఆరుగంటలకు చిలుకమ్మల గుంపు తరలివస్తుంది. సంతోషంగా కిలకిల శబ్దాలు చేస్తూ తింటాయి. శేఖర్ భుజాలపైన వాలి ఆడుకుంటాయి. ఏడులోపల అడవిలోకి తుర్రుమంటాయి. సాయంత్రం నాలుగున్నర గంటలకూ రెండో భోజనాన్ని ఏర్పాటు చేస్తాడు శేఖర్. అవి మళ్లీ వస్తాయి. తింటాయి.

అలా పలకరింపు..

రోజూలాగే ఉదయాన్నే పిట్టగోడపై గింజలు, నీళ్లు పెట్టి పనిలో నిమగ్నమయ్యాను. అనుకోకుండా ఓ రోజు రెండు రామచిలుకలు మా ఇంటికి వచ్చాయి. ఆ తర్వాతి రోజే పది చిలుకమ్మలు చేరుకున్నాయి. పదిరోజుల్లోపే వందల చిలుకలు వచ్చాయి. అలా వందల చిలుకలు వాటి పిల్లలతో వచ్చేవి. ఆ తర్వాత వేల చిలుకల గుంపు అయ్యింది. ప్రస్తుతం ఎనిమిది వేల దాకా మా ఇంటికి ప్రతిరోజు రెండుసార్లు అతిథులుగా వస్తాయి.

– జోసెఫ్ శేఖర్

సైన్స్ చదివినోళ్లు ఆర్థిక పాఠాలు అంతగా పట్టించుకోరు! కామర్స్ విద్యార్థులు సైన్స్ పరిశోధనల వైపు తొంగిచూడరు!!

ఈయన మాత్రం సైన్స్‌లో అచ్చులు దిద్దాడు. అర్థశాస్త్రంలో హల్లులు నేర్చాడు. అందుకే కాబోలు.. సైన్స్ పరిశోధనలతో.. రైతులకు లాభాలు అందిస్తున్నాడు. పనికిరాదనుకున్న తెల్లజుముకిని ఔషధంగా మార్చాడు.

పంటను పీల్చే నులిపురుగును నలిపేస్తున్నాడు. అన్నదాత అప్పులపాలు కాకుండా నిలబెడుతున్నాడు.

మిత్రబృందంతో కలసి పైరుకు ప్రాణం పోస్తున్నాడు.

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రశంసలు అందుకొని పరిశోధనలో పరిశ్రమిస్తున్నాడు... గల్లా చంద్రశేఖర్ నాయుడు. ఊరు చిత్తూరు జిల్లా తొట్టెంబేడు మండలంలోని కారాకొల్లు.



రైతుకు సేవ చేనుకు చేవ

కారాకొల్లు చిన్న పల్లె. పాతికేళ్ల కిందట మరీ కుగ్రామం. చెట్లు, చెదలు, పొలాలు, పొదలు.. ఎక్కువగా ఇవే ఉండేవి. అన్ని ఊళ్లల్లో ఉన్నట్టే.. ఇక్కడా కొందరు యువకులు ఉండేవాళ్లు. వారిలో గల్లా చంద్రశేఖర్ నాయుడు ఒకరు. ఇంటర్‌లో బైపీసీ చదివిన ఆయన.. డిగ్రీలో ఆర్ట్స్ తీసుకున్నారు. అయినా.. పరిశోధనలు అంటే ప్రాణం ఆయనకు. ప్రకృతిలోని ప్రతి వస్తువునూ పరిశోధనాత్మక కోణంలో చూసేవాడు. ఆయన స్నేహితులంతా రైతులే. ఓ రోజు రైతుమిత్రులతో కలిసి నడుస్తూ వెళ్తున్న ఆయన చూపు తెల్లజుమికి (ఫాసిఫ్లోరాయిడిటా) తీగపై పడింది. స్నేహితులు చిరంజీవులు నాయుడు, బత్తిని నాయుడు, భాస్కర్ నాయుడు, మురళి, వెంకటేశ్వర్లు, శివ, శ్రీధర్ ముందుకెళ్లిపోయినా... ఆయన మాత్రం అక్కడే ఆగిపోయాడు. ఆ తీగను ఆశ్చర్యంగా చూశాడు. కాసేపటికి ఆనందంగా ఆకు ఆకునూ, కాయ కాయనూ పట్టుకు మురిసిపోయాడు. ఇంకాసేపటికి ఆవేశంతో అరిచినంత పని చేశాడు. ఏదో సాధించిన వాడిలా పరుగుపరుగున స్నేహితులను సమీపించాడు. వారికేదో చెప్పాడు. అందరిలోనూ అదే ఆశ్చర్యం.



నులిపురుగులను నలిపి..

'తెల్లజుముకి తీగను పురుగుపుట్రా ఎందుకు ఏం చేయలేవో తెలుసా..? దాని కాయలకున్న జిగురు వల్లే...' అని స్నేహితులతో చెప్పాడు చంద్రశేఖర్. అక్కడి నుంచి ఆయన పరిశోధన మొదలైంది. స్నేహితులందరూ ఆయన వెంట నడిచారు. రాత్రి పూట గదిలో ఓ మూల తెల్లజుముకి జిగురు పదార్థాన్ని ఉంచారు. దోమల బెడద లేకుండా హాయిగా నిద్రించారు. తెల్లజుముకి ఆకురసాన్ని తీసి.. దోమలు గుడ్లు పెట్టే మురుగునీటిలో చల్లారు.. తెల్లారేటప్పటికి గుడ్లన్నీ మాయమయ్యాయి! ఇలా తెల్లజుముకి కీటకనాశిని అని ఒకటికి పదిసార్లు రుజువు చేశారు. ఈ విషయం అప్పట్లో పత్రికల్లోనూ ప్రచురితమైంది. అది చదివి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులు చంద్రశేఖర్ బృందాన్ని ప్రశంసించారు. పరిశోధనలు కొనసాగించాల్సిందిగా ప్రోత్సహించారు. ఇంకేముంది చరిత్ర చదివిన చంద్రశేఖర్, హలం పట్టి పొలం దున్నే ఆయన స్నేహితులు సైతం శాస్త్రవేత్తలుగా మారారు. అందరూ పొలం గట్ల వెంబడి తెల్లజుముకి తీగలను పెంచడం ప్రారంభించారు. ఆకులు, కాయలు కోసి వాటితో ప్రయోగాలు చేస్తూ శాస్త్రవేత్తలుగా మారారు.

ప్రపంచస్థాయి ప్రశంసలు..

తెల్లజుముకి ప్రయోజనాలను మరింత విస్తృతంగా వాడుకోవాలనే చంద్రశేఖర్ బృందం సరికొత్త ఆలోచన కొత్త ఆవిష్కరణకు దారితీసింది. పంటసారాన్ని పీల్చి.. రైతు వెన్ను విరిచే నులిపురుగుల (నెమటోడ్స్)పై తెల్లజుముకి ఆకు రసంతో అస్త్రాన్ని సంధించారు. ఎన్ని రసాయన మందులు వాడినా లొంగని నులిపురుగులను తెల్లజుముకి ఆకురసం నలిపేసింది. కలుపు మొక్కల్ని కట్టడి చేసింది. పైరు పచ్చగా పెరిగేలా దోహదం చేసింది. ఈ పరిశోధనలకు పెట్టుబడుల కోసం ఆస్తులు కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. 'మీకెందుకు ప్రయోగాలు' అంటూ నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడారు. అవేమీ పట్టించుకోకుండా ముందుకుసాగారు. ఏళ్ల తరబడి కొనసాగిన వీరి కష్టాన్ని 2013లో ఎన్ఐఎఫ్ (నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్) గుర్తించింది. ఆ సంస్థ ప్రతినిధి బృందం క్షేత్రస్థాయిలో వీరి పరిశోధనను పరిశీలించింది. అదే ఏడాది జాతీయ స్థాయిలో రాష్ట్రపతి అవార్డు దక్కింది. 2017లో విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ ఫెయిర్‌లో వీరి పరిశోధన ప్రముఖంగా నిలిచింది. ప్రపంచదేశాల ప్రతినిధుల ప్రశంసలూ అందుకుంది. ఇప్పుడు వీరు సృష్టించిన ఆకు రసం.. అందరికీ చేరువైంది. మార్కెటింగ్ వైపు అడుగులు వేస్తున్నారు చంద్రశేఖర్ అండ్ కో. ధన్వంతరి ఆయుర్వేదిక్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట ప్రకృతి సిద్ధమైన ఔషధాలు తయారు చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులకు నివారణకు శ్రీశైలం పేరిట రెండు ఔషధాలనూ అందుబాటులోకి తెచ్చారు. ఊరిలో ఊరికే పెరిగే మొక్కను.. అద్భుతమైన ఔషధంగా మార్చిన ఈ మిత్రబృందానికి కారాకొల్లు గ్రామస్థులతో పాటు అందరూ జేజేలు పలుకుతున్నారు.

బి.రాజేశ్‌కుమార్, న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



దిల్లీలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి పురస్కారం అందుకుంటున్న చంద్రశేఖర్‌నాయుడు

కంటికి కనిపించని శత్రువుతో..

నులిపురుగులు మొక్క వేరు భాగంలో ఉంటాయి. కంటికి కనిపించకుండా.. పంట సారాన్నంతా పీల్చేస్తాయి. వాటి వల్ల కలిగే నష్టాన్ని తొందరగా గుర్తించలేం. పంట ఎదుగుదల మందగిస్తుంది. పైరును కాపాడుకోవడానికి రైతులు రసాయన ఎరువుల వాడకం పెంచుతారు. ఫలితంగా భూమి సహజత్వాన్ని కోల్పోతుంది. పర్యావరణ పరిరక్షణ గాడి తప్పుతుంది. జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ఈ సమస్య మనొక్క దేశానిదే కాదు... ప్రపంచదేశాలన్నిటిదీ. నులిపురుగుల దాడి వరిపై తక్కువే అయినా వేరుసెనగ, జామ, టమోటా, దానిమ్మ, మిరప, చెరకు, సోయా, ఆకుకూరలు, కాయగూరలు... ఇలా అన్ని పంటలపై ఉంటుంది. తెల్లజుముకి ఆకురసాన్ని మట్టిలో కలిపి పొలంలో చల్లుతారు. తరువాత నీరు పెడతారు. నీటిలో కరిగిన ఔషధం వేరుభాగంలో ఉండే నులిపురుగులను నాశనం చేస్తుంది.

సైన్స్ ద్వారా సహకారం..

మాది రైతు కుటుంబం. ఎంతో కష్టపడి వ్యవసాయం చేసేవాళ్లం. ఎరువుల కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. రసాయన ఎరువుల వాడకానికి బదులుగా.. ఏదైనా ప్రత్యామ్నాయం ఉంటే బాగుండేదని ఎప్పుడూ ఆలోచించేవాడిని. తెల్లజుముకి ఆకురసంతో నులిపురుగులను నియంత్రించాం. మా పొలంలోనే కాకుండా.. ఇక్కడి రైతులందరూ తెల్లజుముకి మందును వాడుతున్నారు. నులిపురుగులే కాదు.. ఇతర తెగుళ్ల బెడద నుంచి విముక్తులు అవుతున్నారు. దిగుబడి పెరగడంతో లాభాలు పొందుతున్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా వచ్చి ఈ ఔషధాన్ని తీసుకెళ్తున్నారు. ప్రభుత్వ సహకారం లభిస్తే దీని ప్రయోజనాన్ని మరింత విస్తృతం చేయవచ్చు. సైన్స్ ద్వారా సమాజానికి మేలు చేయాలనేది మా నినాదం. సరికొత్త ప్రయోగాలు చేయడానికి మా మిత్రబృందం ఎప్పుడూ సిద్ధమే!

– గల్లా చంద్రశేఖర్ నాయుడు, గ్రామీణ శాస్త్రవేత్త, కారాకొల్లు

ప్రోత్సహిస్తే బాగు..

పంటల దిగుబడి పెంచే పర్యావరణహితమైన ఔషధి ఇది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే వీరి పరిశోధనను మా సంస్థ గుర్తించింది. ప్రామాణికాల పేరుతో ఈ ఔషధాన్ని వనమూలికల మిశ్రమంగా మాత్రమే చూడటం సరికాదు. ప్రభుత్వం చంద్రశేఖర్ మిత్రబృందం పరిశ్రమను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలు వెలుగు చూస్తాయి.

– బి.గణేశం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రతినిధి





'కుంచె' పట్టి నిలదీస్తారు

గోడ నెక్కి నినదిస్తారు.. కుంచె పట్టి నిలదీస్తారు.
వర్ణాలు రంగరించి ప్రశ్నిస్తారు.
చిత్రాలకు రంగులిచ్చి చైతన్యమిస్తారు.
కలలు కంటారు... కళను గీస్తారు.
పగలు ఇంద్రధనస్సులై మెరవడానికి...
రాత్రిళ్లు బొమ్మలై ఉదయిస్తారు.
ప్రేమికులే.. దంపతులై చిత్రకళను గెలిపిస్తారు వీరిద్దరూ..
కాదుకాదు ఒక్కరైన ఇద్దరు విజయ్, స్వాతి.

చిత్రలేఖనంలో బ్రష్, కాన్వాస్‌లను విడదీయలేనంత వర్ణ బంధం వీరిది. ఖమ్మం జిల్లాకు చెందిన స్వాతి, హైదరాబాద్ వాసి విజయ్‌ల చిత్రకళను చూస్తే.. రెండు కళ్లు చాలవు. ఒట్టి కనువిందేనా? కాదు! వాళ్ల బొమ్మలు హృదయాన్ని హత్తుకునేలోపు.. మెదడుకు పని పెడతాయి. ఆలోచనలు రేకెత్తిస్తాయి. మన తరపున ప్రశ్నల్ని సంధిస్తాయి. ఇంతకూ ఈ 'చిత్ర'మైన జంట ఎక్కడ ఒక్కటయ్యింది? చదువుకునే కళాశాలలో! అవును.. వీళ్లిద్దరు హైదరాబాద్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు. ఉమ్మడి లక్షణం.. చిత్రలేఖనం. అలాగని .. కాలక్షేపం కోసమో.. ఖరీదైన అమ్మకాల కోసమో బొమ్మలు గీసే రకం కాదు. ప్రశ్నలు సంధించేందుకు ఆయుధంగా వాడుకునే కళాకారులు వీళ్లు. ఇద్దరి ఆలోచనలే కాదు.. మనసులు కూడా కలిశాయి. ఈ జంట వేసిన చిత్రలేఖనానికి ఇతివృత్తం.. మనం నిత్యం చూస్తున్న సామాజిక విధ్వంసాలే! అది ఉగ్రవాదం కావొచ్చు. పాలకుల అవినీతి కావొచ్చు. ఉదాసీనత కావొచ్చు. వీటన్నిటికీ పెయింటింగ్స్‌తో రూపం ఇచ్చారు. ఆర్ట్‌గ్యాలరీల్లో ప్రదర్శనకు ప్రయత్నం చేశారు. వెళ్లిన చోటల్లా 'ఇంత సీరియస్ పెయింటింగ్స్ వద్దు' అన్నారు. ఏం చేయాలి? దిక్కుతోచలేదు. 'అప్పట్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఉద్యమాలు చేస్తున్న సమయం. మేమిద్దరం రంగు డబ్బాలు పట్టుకుని నేరుగా అక్కడికి వెళ్లాం. పోలీసులపై రాళ్లు కాదు.. పూలు విసరండనే బొమ్మను అక్కడి గోడపై వేశాం. దాని కింద 'వయలెన్స్ నీడ్ నాట్ టు బి వయలెన్స్' అనే శీర్షిక రాశాం. అదే మా తొలి స్ట్రీట్‌ఆర్ట్..' అని గుర్తు చేసుకున్నారు స్వాతి, విజయ్.

రాత్రిపూట గీస్తారు..

గోడు వెళ్లబోసుకునేందుకు గోడ ఒక్కటే ఆధారం అనుకుందీ జంట. తొలి బొమ్మ వేశాక ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. సులువుగా, వేగంగా ఎలా గీయాలో అర్థమైంది. ఎక్కడ ప్రయాణిస్తున్నా.. పెద్ద ఖాళీ గోడ కనిపిస్తే చాలు. వెంటనే ఫోటో తీసి, ఆ ప్రాంత వివరాల్ని రికార్డు చేసుకుంటారు. ఆ తరువాత తీరిక దొరికినప్పుడు బొమ్మలు వేస్తారు. 'ఎక్కడో అన్యాయం జరిగిందని తెలుసుకున్నప్పుడో.. ఒక ఆలోచన మెరుస్తుంది. చాలామంది అయితే ఇలాంటి ఆలోచనలు, ఆవేదనలు కలిగినప్పుడు వెంటనే ఫేస్‌బుక్ వాల్ మీద వ్యక్తపరుస్తారు. మేము వీధుల్లోని గోడల్ని ఎంచుకుంటున్నాం. అంతే తేడా!' అంటుంది స్వాతి. ఒక అంశానికి సంబంధించి ఇద్దరూ కలిసి కూర్చుని చర్చిస్తారు. వాదనలు ఉంటాయి. విభేదాలు తలెత్తుతాయి. ఒక ఆలోచన కార్యరూపం దాల్చడానికి నెలలు పట్టిన సందర్భాలు లేకపోలేదు. గోడకు తగిన ఆర్ట్‌ను ఎంచుకుంటారు. ఆ తరువాత అర్ధరాత్రి వెళ్లి.. చిత్రలేఖనాన్ని ప్రారంభిస్తారు. తెల్లవారుజాము వరకు అలా గీస్తూనే ఉంటుందీ జంట. ఒక్కోసారి నిచ్చెనలపై గంటల తరబడి నిల్చోవడం కష్టంగా అనిపిస్తుంది.

ఇటీవలే స్వాతి, విజయ్ ఓ ఆర్ట్‌వర్క్ చేశారు. సాధారణ రైతు జీవితం అగమ్యగోచరమైందని చెప్పటానికి ఇది చేశారు. ఐదెకరాల వరిపొలంలో పంటకు కోతకి ఒక రోజుముందు ఇంగ్లీషులో 'సేవ్' అనే అక్షరాలు కనిపించేట్లు మిషన్‌తో వరికోత కోయించారు. ఆ తర్వాత కోతను పూర్తి చేశాక రైతులు పొలాన్ని కాల్చారు. అది ఫార్మర్ అనే పదాలు కాలినట్లు కనిపిస్తుంది. రైతు జీవితాలను చిత్రికపట్టే..వినూత్న నిరసన ఇది.

ఫ్రాన్స్ ఆహ్వానించింది..

గోడలపై బొమ్మలు వేసి ఏం సాధిస్తారు? అన్నవాళ్లున్నారు. కాన్వాసు మీద గీసి.. ఏ ఆర్ట్ గ్యాలరీల్లోనో ప్రదర్శనకు పెడితే డబ్బులు వస్తాయన్నది ఇతరుల అభిప్రాయం. అదే మాటను విజయ్‌ను అడిగితే 'వీధుల్లోని గోడలపై బొమ్మలు వేస్తే.. సామాన్యుల నుంచి పాలకుల వరకు అందరూ చూస్తారు. మా ఆలోచనలను ప్రజల్లోకి సులువుగా తీసుకెళ్లవచ్చు' అన్నారు. ఇలా బొమ్మలు గీస్తూనే చిత్రకళలో మాస్టర్స్ చేశారీ కళాప్రియులు. స్ట్రీట్‌ఆర్ట్ వేడుకల్లో తరచూ పాల్గొంటుండటంతో విజయ్, స్వాతిల గురించి ప్రపంచానికి తెలిసింది. ఫ్రెంచ్ రాయబార కార్యాలయం నిర్వహించిన పోటీల్లో తొలి విజేతగా నిలిచిందీ జంట. దీంతో ఫ్రాన్స్ ప్రభుత్వం ఆహ్వానించింది. జపాన్‌కు కూడా వెళ్లొచ్చారు. అన్నిటికంటే మీకు సంతృప్తినిచ్చిన గోడ బొమ్మ ఏంటని అడిగితే 'స్వచ్ఛభారత్ సమయంలో 'ది రియల్ ప్లేస్ టు డు' క్యాప్షన్‌తో వేసిన బొమ్మ' అని చెబుతాడు విజయ్. అంటే దానర్థం.. చట్టసభలకు వెళుతున్న పాలకుల అవినీతిని ముందు శుభ్రపరచండని.

'వీధి' రాత మర్చాలనీ..



ఈనాడు సినిమా

సూర్య అనే నేను

ఏప్రిల్ 27న ముక్కోణపు పోటీ


మహేష్‌బాబు


అల్లు అర్జున్

ఏప్రిల్ 27... మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ రోజున తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయకుల చిత్రాలు రెండు ఒకేసారి రాబోతున్నాయి. మహేష్‌బాబు 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' విడుదలకానున్నాయి. మరోవైపు తమిళం నుంచి రజనీకాంత్ తన సినిమాని విడుదల చేయడానికి సిద్ధం అవుతున్నారు. రజనీకాంత్ 'కాలా'నీ అదే రోజు విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు తెలిపారు. అంటే ముగ్గురి చూపూ ఏప్రిల్ 27 పైనే ఉందన్న మాట. ఒకేసారి మూడు పెద్ద చిత్రాలు విడుదల కావడం బాక్సాఫీసు దగ్గర సందడి సృష్టించినా.. చిత్రసీమకు కాస్త ఇబ్బందే. థియేటర్లు కావల్సిన సంఖ్యలో దొరకవు. దాంతో పాటు వసూళ్లు పంచుకోవాల్సి ఉంటుంది. అయినా సరే... ఈ పోటీలో ఎవరూ తగ్గడం లేదు.

భరత్... స్పీడు పెంచాడు

మహేష్‌బాబు - కొరటాల శివ కలయికలో రూపొందుతున్న చిత్రం 'భరత్ అనే నేను'. డి.వి.వి. దానయ్య నిర్మాత. జనవరి 26న ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రబృందం ఇది వరకే ప్రకటించింది. అందు కోసం ఇప్పుడు చిత్రీకరణ వేగవంతం చేసింది. మార్చిలో షూటింగ్ మొత్తం పూర్తవుతుందని, ముందు అనుకున్నట్టే ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. 'శ్రీమంతుడు' తరవాత మహేష్ - కొరటాల కలయికలో వస్తున్న చిత్రమిది. కాబట్టి ఆ స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి. రాజకీయాల నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు మహేష్.

సూర్య ప్రతాపం

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నాపేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడు. లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మాత. ఇటీవలే టీజర్‌నీ, తొలి పాటనీ విడుదల చేశారు. ఫిబ్రవరి 14 ప్రేమికుల రోజున మరో గీతాన్ని వినిపిస్తారు. సోమవారం నుంచి హైదరాబాద్‌లో పతాక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. విశాల్ - శేఖర్ సంగీతం అందిస్తున్నారు. సూర్యగా బన్నీ లుక్, టీజర్.. అభిమానుల్ని ఆకట్టుకున్నాయి. చిత్రీకరణ కూడా పూర్తికావొచ్చింది. ఏప్రిల్ 27న మా చిత్రాన్ని విడుదల చేస్తున్నామంటూ చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. 'భరత్ అను నేను', 'నా పేరు సూర్య..' నిర్మాతలు ఇద్దరూ చర్చించుకుని, ఓ నిర్ణయానికి వచ్చారని, ఈ రెండు చిత్రాల్లో ఒకటి వెనక్కి వెళ్తుందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా ఇప్పుడు ఇద్దరు నిర్మాతలూ... ఏప్రిల్ 27నే టార్గెట్ ఫిక్స్ చేశారు. మరోవైపు 'కాలా' కూడా దూసుకొస్తున్నాడు. తమిళనాట రజనీ సినిమా వస్తోందంటే.. పోటీనే ఉండదు. అక్కడ వేరే సినిమా విడుదల చేసే ధైర్యం ఎవరూ చేయరు. కాబట్టి తమిళనాట 'కాలా' ఒక్కడే బరిలో దిగుతాడు. కానీ.. రజనీ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదలవుతుంటుంది. అంటే అదే రోజున తెలుగులోనూ 'కాలా' రావాల్సిందే. ఈ నేపథ్యంలో మూడు చిత్రాలూ ఒకేసారి వస్తాయా? వస్తే ఆ పరిస్థితి ఎలా ఉంటుంది? అనే విషయంలో ఆసక్తికరమైన చర్చ మొదలైంది.

దొరికిన సమయాన్ని ఆస్వాదిస్తున్నా!


శ్రుతి హాసన్

పెళ్లి చేసుకుంటుంది కాబట్టే కొత్త సినిమాలకి దూరంగా ఉంటోందంటూ సాగిన ప్రచారానికి స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టేసింది శ్రుతిహాసన్. "నేను చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయని, దయ చేసి నాకు ఇప్పుడే పెళ్లి చేసే పనులేవీ పెట్టుకోవద్దండి" అంటూ తన అంతరంగాన్ని ఇటీవలే బయట పెట్టింది శ్రుతి. దాంతో ఆమెని తెరపై చూడాలనుకొనే అభిమానులు కొత్తగా ఏ సినిమాలు ఎంపిక చేసుకొంటుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శ్రుతి మాత్రం నా జీవితం సినిమాతోనే కాదు, చాలా విషయాలతో ముడిపడిందని చెబుతోంది. "కొత్తగా సినిమాలు చేయడం లేదంటే.. పెళ్లికే సిద్ధమైనట్టు కాదు. సినిమా కాదంటే ఇంకేం చేయనని అర్థమా? సంగీతం, రచన... ఇలా చాలా విషయాల్లో నాకు ప్రవేశం ఉంది. అసలు నేను కథానాయికని అవుతాననే అనుకోలేదు. ఆ క్షణంలో ఆలోచన వచ్చింది, ఆ దిశగా అడుగులు వేశాను. కథానాయికగా నిలదొక్కుకొన్నాక కూడా నటిగా నాకు ఏ రకమైన సినిమాలతో సంతృప్తి లభిస్తుందో అవే చేశాను తప్ప, అదే పనిగా కెరీర్‌ని, లేదంటే ఇతరత్రా విషయాల్నో దృష్టిలో ఉంచుకొని సినిమాలు చేయలేదు. మనసు ఎప్పుడు ఏం చేయమంటే అదే చేయడం నాకు అలవాటు. కథానాయికగా నేను చేయాల్సిన ప్రయాణం ఇంకా చాలా ఉంది. ప్రస్తుతానికి దొరికిన సమయాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తున్నా" అని చెప్పింది శ్రుతి.

చల్ 'చల్ మోహన్ రంగ'


నితిన్

నితిన్ కథానాయకుడిగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటీవ్ వర్క్స్ సంయుక్తంగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. మేఘా ఆకాష్ కథానాయిక. ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథ అందించారు. కృష్ణ చైతన్య దర్శకుడు. ఎం.సుధాకర్‌రెడ్డి నిర్మాత. ఈ చిత్రానికి 'చల్ మోహన్ రంగ' అనే పేరు ఖరారు చేశారు. ఆదివారం ఉదయం పవన్ కల్యాణ్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ఈనెల 14న టీజర్‌ని, ఏప్రిల్ 5న చిత్రాన్ని విడుదల చేస్తారు. నిర్మాతలు మాట్లాడుతూ "నితిన్ నటించిన 25వ చిత్రమిది. మిగిలిన పాటని బుధవారం నుంచి హైదరాబాద్‌లో తెరకెక్కిస్తామ"న్నారు. "కుటుంబ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. సినిమా అంతా సరదాగా సాగుతుంద"న్నారు దర్శకుడు. సంగీతం: తమన్, సమర్పణ: నిఖితారెడ్డి

పంచ్ డైలాగ్

తాళి కట్టించుకున్నది కళ్లకు అద్దుకోడానికి కాదు. కలకాలం కాపురం చేయడానికి.

చిత్రం: జై సింహా

- పంపినవారు: కిళ్లంపల్లి లావణ్య, కరాస


దీపికా పదుకొణె

మాఫియా క్వీన్.. దీపిక

'పద్మావత్'లో రాణి పద్మావతిగా అలరించిన దీపిక త్వరలో మాఫియా క్వీన్‌గా కనిపించనుంది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ కొత్త చిత్రం తెరకెక్కనుంది. ఇందులో మాఫియా రాణి సప్నా దీదీగా నటించనుంది. "లేడీ మాఫియా డాన్‌గా నేను నటించబోతున్నాను అంటే నాకే నమ్మశక్యంగా లేదు. కానీ ఆమె కథే ఈ సినిమా ఒప్పుకోనేలా చేసింద"ని చెప్పింది దీపిక. "శక్తిమంతమైన మహిళల పాత్రలు నన్ను వెతుక్కొంటూ వస్తున్నాయి. 13 శతాబ్దం నాటి రాణి పద్మావతి కథను ఇప్పుడు చెప్పినా గొప్పగానే ఉంది. సప్నాదీదీ కథ కూడా నిజ జీవిత కథే. ఆమె ఎదిగిన క్రమం చాలా ఆశ్చర్యంగా ఉంటుంది"అంది దీపిక. ఎస్ హుస్సేన్ జైది పుస్తకం 'మాఫియా క్వీన్స్ ఆఫ్ ముంబయి' ఆధారంగా తెరకెక్కనుందీ చిత్రం. ఇందులో ఇర్ఫాన్‌ఖాన్ మరో కీలక పాత్రధారి. "ఇర్ఫాన్‌తో 'పీకు'లో నటించాను. ఇప్పుడు మళ్లీ ఈ చిత్రంలో కలిసి నటించడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలోని పాత్ర కోసం శారీరకంగానూ కష్టపడాలి. దానికి సంబంధించిన వర్క్‌షాప్స్ త్వరలోనే మొదలుకానున్నాయి"అంది దీపికా పదుకొణె. వచ్చే నెల్లో నేపాల్‌లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభంకానుంది.

రోజూ ప్రేమదే!

ప్రేమికుల రోజు ఎలా జరుపుకోనున్నారు..అంటే "ప్రేమికుల రోజుని ఎప్పటినుంచో జరుపుకుంటున్నాం. రోజూ ప్రేమ రోజుగానే జరుపుకోవాలనేది నా ఉద్దేశం. సినిమా అనేది గొప్ప మాధ్యమం. సినిమా కారణంగా ఎంతోమంది ప్రేమను పొందగలిగాను" అని చెప్పింది దీపికా పదుకొణె.

'తొలిప్రేమ'... నాకొక జ్ఞాపకం!



దర్శకుడిగా తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకొన్నారు వెంకీ అట్లూరి. 'స్నేహగీతం'తో నటుడిగా మెరిసిన ఆయన ఆ తర్వాత మెగాఫోన్‌పై ప్రేమ పెంచుకొన్నారు. 'ఇట్స్ మై లవ్‌స్టోరీ', 'కేరింత' చిత్రాలకి రచయితగా పనిచేసిన ఆయన, 'తొలిప్రేమ'తో దర్శకుడిగా పరిచయమయ్యారు. వరుణ్‌తేజ్, రాశీ ఖన్నా జంటగా నటించిన ఆ చిత్రం విడుదలైంది. తనలో మంచి దర్శకుడే కాకుండా, మంచి రచయిత కూడా ఉన్నాడని నిరూపించుకొన్నారు వెంకీ. ఆ చిత్ర విజయాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారాయన. ఆ విషయాలివీ...

"మా సినిమా విడుదలైన ప్రతి చోట నుంచి చాలా బాగుందనే టాక్ వచ్చింది. తెలుగు ప్రేక్షకులు సినిమాని బాగా ఆదరిస్తున్నారు. నేను ఊహించిన స్థాయిలో సినిమా విజయవంతం కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా వెనక నటీనటులు, తోటి సాంకేతిక నిపుణుల కృషి ఎంతో ఉంది. వరుణ్‌తేజ్ లేకపోతే నా ఈ కల ఇంత వరకు వచ్చేది కాదు. నావరకు 'తొలిప్రేమ' ఒక సినిమా కాదు, ఒక జ్ఞాపకం. చిత్ర పరిశ్రమకొచ్చి పన్నెండేళ్లవుతోంది. దర్శకత్వం చేయాలనే కల నెరవేర్చుకొనేందుకు చాలా కష్టాలు పడ్డాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అంతగా కష్టపడ్డాను కాబట్టే ఈ విజయం సాధ్యమైందనిపిస్తోంది. గుణ్ణం గంగరాజు, దిల్‌రాజు, వరుణ్‌తేజ్, బాపినీడు తదితరులు నా సినిమా ప్రయాణంలో ఎంతో సాయంగా నిలిచారు. సినిమా చూసిన వెంటనే కె.రాఘవేంద్రరావు, ఆర్.నారాయణమూర్తి, క్రిష్, నాగబాబు తదితరులు ఫోన్ చేసి అభినందించారు. మంత్రి కేటీఆర్ సినిమా చూసి అభినందిస్తూ ట్వీట్ చేయడం కూడా ఓ గొప్ప అనుభూతినిచ్చింది".

✦ "తొలిప్రేమ' వెనక నా స్వీయ అనుభవాలంటూ ఏమీ లేవు. ఇదొక కల్పిత కథే. నేనీ కథని తయారు చేసుకొన్నప్పుడు వరుణ్‌తేజ్ తొలి చిత్రం 'ముకుంద' టీజర్ విడుదలైంది. అది చూసి 'ఇలాంటి హీరో అయితే ఈ కథని ఇంకా బాగా చెప్పొచ్చు' అనుకొన్నా. అయితే మెగా కుటుంబం నుంచి వస్తున్న కథానాయకుడు కదా, ప్రేమకథలు చేస్తాడో లేదో అనిపించింది. 'కంచె' చూశాక 'ఇతను విభిన్నమైన సినిమాలు చేయడంపై మొగ్గు చూపుతున్నాడు' అనిపించింది. 'లోఫర్' సమయంలో వరుణ్‌ని కలిసి ఈ కథ చెప్పా. నిర్మాత దిల్‌రాజుకి కూడా ఈ కథ నచ్చింది. అయితే ఆయన చేతిలో ఎక్కువగా సినిమాలు ఉండటంతో నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ అబ్బాయి బాపినీడుని కలిసి ఈకథ చెప్పా. తనకి కూడా ఈ కథ నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది".

✦ "సినిమాతో పాటుగా, సంభాషణలకీ మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఆ విషయం మరింత సంతృప్తినిచ్చింది. సంభాషణల కోసమని ప్రత్యేకంగా తీసుకొన్న జాగ్రత్తలంటూ ఏమీ లేవు. చేస్తున్నది విభిన్నమైన సినిమా కాదని నాకు ముందే తెలుసు. జీవితంలోని మూడు పార్శ్వాల్ని స్పృశిస్తూ సాగే కథలు 80వ దశకంలోనే తెరపైకొచ్చాయి. మరి ఏం చేస్తే ఈ కథలో వైవిధ్యం కనిపిస్తుందని ఆలోచించినప్పుడు నాకు గుర్తుకొచ్చింది రచనే. సంభాషణల పరంగానే కొత్తదనం చూపించాలనుకొన్నా. మనం చూస్తున్న, మాట్లాడుకొనే విషయాల్లోంచే కొత్తగా మాటలు పుట్టించే ప్రయత్నం చేశాం. నేనే రాసుకొన్నాను, నేనే తీయాలనుకొన్నాను కాబట్టి నేను ప్రేమించినంతగా ఈ కథని ఎవ్వరూ ప్రేమించరనే ఓ స్వార్థం నాలో ఉండేది. కానీ నటీనటులు, సాంకేతిక నిపుణులంతా కూడా నేను నమ్మినంత స్థాయిలోనే ఈ కథని నమ్మారు. అందుకే ఇంతటి విజయం సాధ్యమైంది. రాశీ ఖన్నా ఈ సినిమా విషయంలో చాలా శ్రద్ధ తీసుకొన్నారు. బరువు పెరగాలంటే పెరిగి, తగ్గాలంటే తగ్గారు. వరుణ్ కూడా అంతే. తమన్ నేపథ్య సంగీతం నన్ను మరింతగా ఆశ్చర్యపరిచింది".

✦ "సినిమాకి 'తొలి ప్రేమ' అని పేరు నిర్ణయించినప్పుడు ఆ పేరెందుకు పెట్టారని ఎవ్వరూ అనలేదు. ఆ పేరు పెట్టారు కాబట్టి జాగ్రత్త పడమని చెప్పారంతే. దానికితోడు ఆ పేరు పెట్టుకొన్నాక గౌరవాన్ని కాపాడాలనే ఓ చిన్న భయం కూడా నాలో మొదట్నుంచీ ఉంది. కాపాడగలమనే నమ్మకం వచ్చాకే ఆ పేరు పెట్టాలని నిర్ణయించుకొన్నాం. వరుణ్‌తేజ్‌కి పవన్ కల్యాణ్ బాబాయ్ కాబట్టే 'తొలిప్రేమ' పేరు పెట్టలేదు మేం. కథ రీత్యా మాకు మరో పేరు కూడా మనసుకు తట్టలేదు".


✦ "నటుడిగా 'స్నేహగీతం' చేశా. అయితే అదే సమయంలో ఆ సినిమా కోసం సంభాషణలు కూడా రాశా. అలా రాయడంతోనేనేమో నాకు క్రమంగా నటనపై ఆసక్తి తగ్గిపోతూ వచ్చింది. దాంతో కొన్నాళ్లు రచనపైనే దృష్టిపెట్టా. 'కేరింత' సమయంలో సెట్స్‌లో ఏం జరుగుతోందో గమనించేవాణ్ని. రచయితగా ప్రేమ కథలతో పాటు, రాజకీయ నేపథ్యం, డ్రామాతో కూడిన సినిమాల్ని ఎక్కువగా ఇష్టపడతా. తదుపరి బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, దిల్ రాజు నిర్మాణంలోనే సినిమా చేయబోతున్నా".

ప్యాడ్‌మ్యాన్ త్వరలో మిల్క్‌మ్యాన్?


అక్షయ్‌కుమార్

'ప్యాడ్‌మ్యాన్'గా ప్రేక్షకుల ముందుకొచ్చిన అక్షయ్‌కుమార్ త్వరలో మిల్క్‌మ్యాన్‌గా కనిపించనున్నాడని సమాచారం. దేశంలో పాల దిగుబడి కోసం విశేష కృషి చేసిన వర్గీస్ కురియన్ జీవిత కథలో అక్షయ్‌కుమార్ నటించే అవకాశాలున్నాయి. 'ఐ టు హేడ్ ఎ డ్రీమ్' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించే ఆలోచనలో ఉన్నారట. 'టాయ్‌లెట్ ఏక్ ప్రేమ్ కథ', 'బట్టీ గుల్ మీటర్ ఛాలు' చిత్రాల దర్శకుడు శ్రీ నారాయణ్‌సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఏక్తా కపూర్ ఈ సినిమాని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు బాలీవుడ్ సమాచారం.

నీటిలో దూకి అభిమానులకు కృతజ్ఞతలు


షారుఖ్ ఖాన్

బాలీవుడ్ కథానాయకుడు షారుఖ్‌ఖాన్ ట్విట్టర్‌లో 33 మిలియన్ల ఫాలోవర్స్‌తో కొత్త మైలురాయిని చేరుకొన్నారు. ఈసందర్భంగా అభిమానుల కోసం ఓ వీడియోని పంచుకొన్నారు. స్విమ్మింగ్ పూల్‌లో దూకి అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు షారుఖ్. "ఇది నేను పనిగట్టుకొని చేయలేదు. సరదాగా ఆదివారం ఇలా చేశాను. నాకు సాధ్యమైనంతలో ప్రయత్నించాను. ఎలా ఉందో చెప్పొద్దు. ఆస్వాదించండి"అని ట్వీటాడు. స్విమ్మింగ్ పూల్‌లో మునిగి తన చిత్రాల్లో పాపులర్ అయిన డైలాగ్‌లను చెప్పాడు షారుఖ్. "నేను పలికిన ప్రతి మాట నా మనసు లోతుల్లోంచి వచ్చిందే"అంటూ వీడియోని ముగించాడు.



చట్టాలు తెలిశాకే... చుట్టాలవ్వాలి!

అల్లుడికి విదేశంలో ఉద్యోగం.. డాలర్లలో జీతం... గ్రీన్‌కార్డూ, ఇల్లూ, కారు... అదృష్టం అంతా మన అమ్మాయిదే... అని నిన్నటి వరకూ గొప్పగా చెప్పుకున్నారు ఆడపిల్లల తల్లిదండ్రులు. కానీ అదంతా ఎండమావేనని ఆడబిడ్డ కాళ్ల పారాణి ఆరకముందే తెలుసుకుంటున్నారు. కోటి ఆశలతో అత్తారింట్లో అడుగుపెట్టిన ఆమె కన్నీళ్లతో పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన దుస్థితిని చూసి తల్లడిల్లిపోతున్నారు... ఎందుకిలా? ఎవరిది తప్పు? చట్టంలోని లోపామా... మన ఆలోచనా విధానంలో వచ్చిన మార్పా? ఈ చిక్కుముడులను ఎలా విప్పాలి?

దీప్తికి ఓ ఎన్‌ఆర్‌ఐతో పెళ్లయ్యింది. పదిహేను రోజుల పాటు కాపురం చేసిన ఆమె భర్త... నెలరోజుల్లో ఆమెని తీసుకెళ్తానని చెప్పి లండన్ వెళ్లిపోయాడు. ఆమె అత్తింట్లోనే ఉండిపోయింది. ఏళ్లు గడుస్తున్నా అతని నుంచి పిలుపు రాలేదు. అదే విషయం పెద్ద మనుషులతో అడిగిస్తే... వయసు పెరిగిన తన తల్లిదండ్రుల బాగోగుల కోసమే ఆమెను చేసుకున్నా అన్నాడు. అంతేనా! అప్పటికే అక్కడి అమ్మాయితో సహజీవనం చేస్తున్న విషయమూ బయటపడింది.

ఆమె ఓ జాతీయ హాకీ క్రీడాకారిణి... గతేడాది ఘనంగా పెళ్లి చేసుకుంది. విదేశం వెళ్లిన వెంటనే వీసా పంపిస్తానని చెప్పిన ఆ భర్త జాడ మళ్లీ తెలియలేదు. అత్తింటివారిని అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. దాంతో ఆ ఇంటిముందే బైఠాయించింది. న్యాయం అడుగుతోంది. ఆటలో గెలిచిన ఆ ఆడపిల్ల జీవితంలో మాత్రం నెగ్గలేకపోయింది.

రమ్యది మధ్యతరగతి కుటుంబమే అయినా.. అబ్బాయి అమెరికాలో ఉద్యోగం అనగానే ఆన్‌లైన్‌లోనే పెళ్లి చూపులు...నిశ్చితార్థం లేకుండానే పది రోజుల్లో పెళ్లి ముహూర్తం పెట్టేశారు. మంచి సంబంధం అంటూ మధ్యవర్తి ఒత్తిడి చేయడంతో అప్పుచేసి మరీ తాహతుకి మించి పెళ్లి చేశారు. ఎన్నో ఆశలతో పరాయిదేశంలో అడుగుపెట్టిన వెంటనే ఆమె పాస్‌పోర్ట్ దాచేశాడు రమ్య భర్త. అప్పటి నుంచి శారీరకంగా, మానసికంగా వేధించడం మొదలుపెట్టాడు. అది తట్టుకోలేక నెలకే ఆత్మహత్యా ప్రయత్నం చేసింది.

చట్టం ఎలా సాయపడుతుంది...



◆ దేశాలను బట్టి చట్టాలు మారుతూ ఉంటాయి. విదేశీ వరుడికిచ్చి పెళ్లి చేయాలనుకున్నప్పుడు మొదట వాటిపై అవగాహన పెంచుకోవడం మంచిది.

◆ పెళ్లిళ్లు మనదేశంలో జరిగినప్పుడు విడాకుల చట్టాలు కూడా ఇక్కడే వర్తిస్తాయి. కొందరు గ్రీన్‌కార్డుదారులకి వారుంటున్న దేశంలో విడాకులు తీసుకునే హక్కు ఉంటుంది. కానీ అక్కడి కోర్టులు తీసుకునే నిర్ణయాలు భారతదేశంలో అమలు కావు. కానీ అక్కడ పుట్టిన పిల్లలకు మాత్రం వర్తిస్తాయి.

◆ ఎన్‌ఆర్‌ఐ భర్తపై మనదేశంలో సెక్షన్ 498ఎ, వరకట్నం, గృహహింస వంటి కేసులు పెట్టొచ్చు. భార్యని మన దేశంలోనే వదిలేసి వెళ్లిపోయినా, అత్తింటివాళ్లు హింసిస్తున్నా కూడా గృహహింస నిరోధక చట్టం కింద రెసిడెన్స్ ఆర్డర్ లేదా షేర్డ్ హౌస్‌హోల్డ్ ఆర్డరుని పొందవచ్చు.

◆ మనదేశానికి వెలుపల భర్తలు చేసే ఆరోపణల్ని సెక్షన్ 189 సీఆర్‌పీసీ ప్రకారం ఇండియాలో చేసినట్లుగానే పరిగణిస్తారు. సెక్షన్ 156 (1) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ)ప్రకారం క్రిమినల్ కంప్లయింట్ ఫైల్ చేయొచ్చు.

◆ మనదేశంలోని ఏదైనా కోర్టులో నేర నిరూపణ జరిగినప్పుడు అతడు ఏ దేశంలో ఉన్నా కూడా తీసుకొచ్చి అప్పగించాలని ఎక్స్‌ట్రడిషన్ యాక్ట్ 1962 లోని సెక్షన్ 3 సూచిస్తోంది.

◆ భారతదేశంలో భార్య వేసిన కేసులకి భర్త హాజరు కాకపోతే పాస్‌పోర్టు చట్టం 1967లోని సెక్షన్ 10 ప్రకారం అతని పాస్‌పోర్టుని రద్దు చేయమనవచ్చు. భర్తకి ఏదైనా క్రిమినల్ కేసులో శిక్షపడి ఉంటే అతని వీసాను కూడా రద్దు చేయమని ఆ దేశపు రాయబార కార్యాలయాన్ని కోరవచ్చు.

◆ మనదేశంలో నేరం రుజువైనప్పుడు అతడు విదేశంలో ఉన్నా కూడా వారెంట్ లేకుండా అరెస్ట్ చేయవచ్చు అని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 41(1)జి చెబుతోంది.

◆ విదేశంలో వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుని లేదా కలిసి జీవిస్తూ ..ఇక్కడ తల్లిదండ్రులు కోసం ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకునే వారి మీద చీటింగ్ కేసు నమోదు చేయొచ్చు. అలాంటప్పుడు వారికి సమన్లు జారీ చేసే బాధ్యత విదేశీవ్యవహారాల శాఖ తీసుకుంటుంది.

◆ సమన్లు తీసుకోకుండా అడ్రస్‌లు మారేస్తే వారి మీద వారెంట్ ఇష్యూ చేసే అధికారం కోర్టుకు ఉంటుంది. నిరంతరంగా నోటీస్ తీసుకోకపోయినా వారెంట్ ఎగ్జిక్యూట్ అవ్వకపోయినా సీఆర్‌పీసీలోని సెక్షన్ 82 ప్రకారం తప్పించుకుని తిరుగుతున్న నిందితుడి కింద అతడిని కోర్టు నిర్ణయిస్తుంది.

◆ భర్త విదేశంలో మరో అమ్మాయితో కలిసి ఉంటున్నాడని నిరూపించే ఫేస్‌బుక్ సందేశాలు, ఈ-మెయిళ్లను ఎలక్ట్రిక్ సాక్ష్యాలుగా చూపించొచ్చు.

◆ఎన్‌ఆర్‌ఐల పెళ్లిళ్ల విషయంలో మోసం జరిగినప్పుడు ఆ పెళ్లి మాట్రిమోనీ ద్వారా కుదిరితే ఆ నిర్వాహకులనూ బాధ్యులుగా చేయవచ్చు. భార్యకు తెలియకుండా భర్త విదేశాల్లో విడాకుల కోసం ఎక్స్‌పార్టీ డిక్రీ తీసుకుంటే ఇక్కడ చెల్లుబాటు కాదు. ఇండియాలో భార్య తీసుకున్న విడాకులు లేదా ఇతర కుటుంబ వివాదాలు విదేశంలో చెల్లుబాటు అవుతాయి.

◆ భర్త విదేశంలో ఉన్నప్పుడు అక్కడ పుట్టిన పిల్లల కస్టడీ గురించి అక్కడి కోర్టు నిర్ణయాన్ని వారి సంక్షేమం దృష్ట్యా సమీక్షించే అధికారం మనదేశంలోని కోర్టులకి ఉంది అని సుప్రీంకోర్టు 2011లో తీర్పునిచ్చింది.

◆ విదేశాల్లో భర్త భారతదేశంలో వదిలేసిన భార్యలకు కోర్టులకు వెళ్లే స్థోమత లేనప్పుడు కూడా మినిస్ట్రీ ఆఫ్ ఓవర్సీస్ వారు సాయం చేయడానికి వీలుగా 2011లో ఒక పథకాన్ని తెచ్చారు. దీని ప్రకారం మనదేశ పౌరసత్వం కలిగి ఉండి ఆమెను భర్త వదిలేసినప్పుడు, ఎక్స్‌పార్టీ డిక్రీతో విడాకులు తీసుకున్నప్పుడు మూడువేల డాలర్లు న్యాయ సహాయం అందిస్తారు. అయితే ఆమెపై ఎటువంటి క్రిమినల్ ఛార్జిషీటు దాఖలు అయి ఉండకూడదు.



జి. వరలక్ష్మి
న్యాయవాది

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. గత రెండేళ్లుగా ఈ పరిస్థితులు మరింతగా దిగజారిపోయాయి అంటోంది ఓ తాజా నివేదిక. స్త్రీ శిశు సంక్షేమ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా విడుదల చేసిన దాని ప్రకారం ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక మహిళ సాయం కోసం అర్థిస్తోందట. ఎన్‌ఆర్‌ఐ పెళ్లికొడుకులపై గత కొన్నేళ్లుగా కనీసం ముప్ఫైవేల కేసులకు పైగానే పెండింగులో ఉన్నాయని పోలీసు నివేదికలు కూడా చెబుతున్నాయి. ఇలాంటి కేసుల్లో పంజాబ్ మొదటిస్థానంలో ఉంటే రెండు తెలుగురాష్ట్రాలు ఐదో స్థానాలలోపు చోటు సంపాదించుకోవడం శోచనీయం.

కారణాలేంటి?

విదేశీ మోజుతో కొందరూ, పిల్ల సుఖపడుతుందనే ఆశతో మరికొందరు.. కారణాలు ఏమైనా విదేశాల్లో ఉన్న వరుడికిచ్చి పెళ్లి చేయాలనుకునే తల్లిదండ్రుల సంఖ్య గత దశాబ్దకాలంగా పెరిగింది. ఈ కోరికలే ఆ ఆడపిల్లల జీవితాల్లో కల్లోలం సృష్టిస్తున్నాయి. దాంతో పెళ్లయ్యాక విదేశాలకు తీసుకెళ్లక కొందరు, తీసుకెళ్లినా సరిగ్గా చూడక మరికొందరు, చిన్నపాటి గొడవలకే అక్కడి చట్టాలను ఉపయోగించుకుని ఇంకొందరు ఆడపిల్లలకు అన్యాయం చేస్తున్నారు. వరుడికి సంబంధించిన వివరాలు సరిగా తెలుసుకోకుండానే పెళ్లిళ్లు చేయడం, విదేశీ వివాహాలూ, చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం, సమస్యలు వస్తే ఎలా బయటపడాలో తెలియకపోవడం వంటివే ఇవే కాదు...ప్రాథమికంగా పెళ్లిని పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడం వంటివీ ఈ పరిస్థితికి కారణాలుగా చెబుతున్నారు న్యాయనిపుణులు.

సాధారణంగా వివాహాల నమోదు అధికారిగా సబ్ రిజిస్ట్రార్ వ్యవహరిస్తారు. స్థానిక సంస్థల వద్ద కూడా పెళ్లి నమోదు చేసుకునే అవకాశం ఉంది. అలానే ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం ఆయా మతాచారాలకు అనుగుణంగా కూడా వివాహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. అంతా బాగానే ఉంది కానీ...వరుడు ఎన్‌ఆర్‌ఐ అయితే ఇలా రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు పరిశీలించాల్సిన అంశాలు ఏంటి? వేటిని పరిగణనలోకి తీసుకోవాలనే విషయాలపై మాత్రం అధికార యంత్రాంగంలో స్పష్టత లేకపోవడం వల్ల హడావిడిగా నమోదు జరుగుతుందనేది ప్రధాన ఆరోపణ.

మరేం చేయాలి?

❍ ఎన్‌ఆర్‌ఐ పెళ్లికొడుకుతో వివాహాన్ని తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలి. ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్ ఉండదు దానికి బదులుగా సామాజికభద్రతా సంఖ్యను తీసుకోవాలి. పాస్‌పోర్టు, వీసా, గత మూడు సంవత్సరాలుగా పన్ను, రాబడి పత్రాలూ, బ్యాంకు లావాదేవీలు ఎన్నారై వరుడి ఆస్తి తాలూకు ఆధారాలు, విద్యార్హత, ఉద్యోగ నియామక పత్రాలు వంటివి సరిచూసుకోవడం తప్పనిసరి. ఇలా పరీక్షించేటప్పుడు ఎలక్ట్రానిక్ కాపీలూ, నకళ్లను కాకుండా ఒరిజినల్స్‌ని పరిశీలించడం తప్పనిసరి.

❍ హడావిడిగా పెళ్లిళ్లను కుదుర్చుకోకపోవడమే మంచిది. అలానే ఫోన్ లేదా- ఈమెయిళ్లలో వాటిని ఖారారు చేసుకోవడం కూడా తప్పే. మరీ ముఖ్యంగా ఏజెంట్‌లూ, బ్యూరోలూ, మధ్యవర్తుల ఒత్తిడికీ, ప్రలోభాలకూ గురికాకుండా నిర్ణయం తీసుకోండి.

❍ పెళ్లి ఏర్పాట్లు విదేశాల్లో చేస్తామంటే అస్సలు ఒప్పుకోకపోవడమే మంచిది. కొన్నిరోజుల్లో గ్రీన్‌కార్డు వస్తుంది. మరోదేశానికి బదిలీ అయ్యే అవకాశం ఉంది... వంటి మాటల్ని నమ్మకపోవడమే మంచిది.

❍ వధువును పంపే సమయంలో స్థానిక పోలీసులూ, ఇతర సహాయ ఏజెన్సీలు, భారత రాయబార కార్యాలయం, స్థానిక భారతీయ సంఘాలూ, నెట్‌వర్క్‌లకు సంబంధించిన నంబర్లు అమ్మాయి దగ్గర ఉండేలా చూసుకోవాలి. అత్తింటికెళ్లాక భర్తా, అత్తమామలు హింసిస్తే తక్షణ సహాయం కోసం అక్కడ భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించొచ్చు.

– స్వాతి కొరపాటి

జిమ్‌కు ఇవి తీసుకెళ్లండి...

ఆఫీసుకు వెళ్తున్నప్పుడు ఒక హ్యాండ్ బ్యాగ్ తప్పకుండా తీసుకెళ్తాం. దాంట్లో ఉండాల్సిన వస్తువుల గురించి పదే పదే చూసుకుంటాం. అలాగే జిమ్‌కు వెళ్లేటప్పుడు కూడా మీవెంట ఒక జిమ్ బ్యాగూ, అందులో కొన్ని వస్తువులు తప్పక ఉండాల్సిందే..



✪ జిమ్‌కి వెళ్లేటప్పుడు వెంట నీళ్లసీసా తీసుకెళ్లడం అస్సలు మర్చిపోకూడదు. ఎక్కువ వ్యాయామం చేయడం వల్ల డీహైడ్రేషన్ సమస్య ఎదురైనప్పుడు ఉపయోగపడుతుంది.

✪ వ్యాయామం చేసిన తర్వాత సులభంగా తినడానికి ఎనర్జీబార్లూ, పండ్లూ, ఎండుఫలాలు..ఇలా ఏదోకటి మీ బ్యాగ్‌లో ఉంచుకోండి.

✪ కాస్త పలుచగా ఉండే తువాలుని కూడా బ్యాగులో పెట్టుకోండి. చెమట తుడుచుకున్నా త్వరగా ఆరిపోతుంది. బరువుగానూ ఉండదు.

✪ వ్యాయామం చేసేటప్పుడు సౌకర్యంగా ఉండే షూల ఎంపిక తప్పనిసరి. ఆఫీసు నుంచి నేరుగా జిమ్‌కి వెళ్లేవారు తప్పనిసరిగా ఓ జతను బ్యాగ్‌లో పెట్టుకోండి.

✪ వ్యాయామం చేసేటప్పుడు శ్రద్ధపెట్టాల్సిన విషయాల్లో సరైన లోదుస్తుల ఎంపిక కూడా ఒకటి. ఈ విషయంలో అశ్రద్ధ చేయడం వల్ల ఆకృతి దెబ్బతినే అవకాశం ఉంది. అందుకే ప్రత్యేకించి జిమ్‌కోసం రూపొందించిన ఇన్నర్‌వేర్‌ని ఉపయోగించండి.

✪ జిమ్‌లో పాటలు పెట్టడం సాధారణం. కానీ అవి మీకు నచ్చకపోవచ్చు. అందుకే మీకు నచ్చిన పాటల్ని వినడానికి తగిన హెడ్‌ఫోన్లూ, పాటల్ని అందుబాటులో ఉంచుకోండి.

నజరానా

ఇంట్లో తయారు చేసిన బిస్కెట్లు డబ్బాలో వేసి ఉంచితే మెత్తగా అవుతున్నాయా? అయితే ఆ డబ్బాలో ఒక బ్రెడ్ ముక్క వేసి ఉంచండి. ఎక్కువ రోజులు కరకరలాడుతూ ఉంటాయి.

పరిమళాలు వాడుతున్నారా!

మీకు పరిమళద్రవ్యాలు వాడే అలవాటు ఉందా! అయితే ఇది చదవండి... ఇలానూ పరిమళాలను వాడొచ్చు.



* పరిమళద్రవ్యం ఎక్కువ సేపు ఉండాలంటే పైన దుస్తుల మీద చల్లుకోవాలి. అలానే దుస్తులు ధరించడానికి ముందు చర్మం మీదా కాస్త స్ప్రే చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల దుస్తుల మీద పరిమళం ఆవిరి అయిపోయినా ఇబ్బంది ఉండదు.

* ఘాటు వాసనలు కొందరికి పడవు. అలాంటి వారు స్ప్రేని తక్కువ తక్కువగా విరామం ఇస్తూ చల్లుకోవాలి. లేదంటే గాఢత తక్కువ ఉన్నవాటిని రెండు మూడు పొరలుగా దుస్తుల మీద రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఇబ్బంది ఉండదు.

* ఒకే రకం పరిమళం మీకు విసుగ్గా అనిపించిందా అయితే.. ఇలా చేయండి. ఒకే సంస్థకు చెందిన విభిన్న పరిమళ ద్రవ్యాలను ఎంపిక చేసుకోండి. అంటే పువ్వులు, పండ్లు, సిట్రస్ ఆధారితంగా చేసినవి ఎంచుకుని వాటిని కలగలిపి వాడుకుంటే వాసన సరికొత్తగా ఉంటుంది.

* ఎండలో వెళ్లే సమయంలో చెమటలు ఎక్కువ పడతాయి. ఆ సమయంలో సిల్కు దుస్తులు వేసుకుంటే చెమట వాసన వస్తుంది. అలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే... వాడే బాడీ లోషన్‌లో కాస్త పరిమళ ద్రవ్యం కలిపి రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఒళ్లంతా పరిమళభరితం అవుతుంది. అలా దీన్ని ఒంటికి రాసుకునే నూనెల్లోనూ కలుపుకోవచ్చు.

* దుస్తుల మీద చల్లుకున్నా.. ఒంటికి రాసుకున్నా.. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పరిమళం కొట్టుకోవాల్సిందే! అదెక్కడంటే.. మెడ, మోచేతులు, మణికట్టు, భుజాల వద్ద తప్పనిసరిగా కాస్తైనా రాసుకోవాలి.

* పరిమళం వాడే విషయంలో మాత్రం అలర్జీ ఉన్నవారు, చర్మసంబంధిత సమస్య ఉన్నవారు ప్రయోగాలు చేయకపోవడం మంచిది. వీటి వాడకం వల్ల ఏ మాత్రం ఇబ్బంది కలిగినా దూరం పెట్టాలి. చిన్నారుల్ని వీటి జోలికి వెళ్లనివ్వకూడదు.

వెతికి మరీ ఆకలి తీరుస్తా!

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలంటే మంచి మనసు ఉండాలి. అలాంటి పరిస్థితుల్లో లేవలేని స్థితిలో ఉన్నవారిని వెతుక్కుంటూ వెళ్లి వారి ఆకలి తీర్చడమంటే మాటలా! కానే కాదు... అయినా సరే ప్రతి రోజూ ఓ ఇరవై మందికి తమతోపాటు వంట చేసి.. అన్నార్థులను వెతుక్కుంటూ మురికివాడలవైపు అడుగులు వేస్తోంది మానస. ఆరు నెలల నుంచి అది ఆమె జీవితంలో ఓ భాగం అయ్యింది. ఇంతకీ ఈ మానస ఎవరు.. ఇదంతా ఎందుకు చేస్తోందో తెలుసుకోవాలంటే ఆమె గురించి చదవాల్సిందే!



హాయ్ అండీ!

నా గురించి ఎందుకు చెబుతున్నానంటే.. గొప్ప కోసం మాత్రం కాదు.. ఓ పదిమందైనా నా సేవ నుంచి స్ఫూర్తి పొందుతారనే ఆశతోనే మీతో పంచుకుంటున్నా. మాది చెన్నైలో స్థిరపడిన తెలుగు కుటుంబం. అమ్మానాన్నలు లేరు. మావయ్య దగ్గరే ఉండి చదువుకున్నా. నన్ను సేవవైపు తీసుకొచ్చిన ఓ సందర్భం చెబుతా. గతేడాది ఒకసారి హైదరాబాద్‌కి వచ్చాను. రైల్వేస్టేషన్ నుంచి బయటకి వస్తుంటే ఒకావిడ.. ఫుట్‌పాత్ మీద పడుకుని సైగ చేస్తోంది. బహుశా భిక్షాటన చేస్తోందేమోనని డబ్బులు ఇవ్వబోయాను. ఆమె మాత్రం తీసుకోలేదు. బాత్రూమ్‌కి వెళ్లడానికి సాయం పట్టమంది. కుప్పకూలినట్టు పడి ఉన్న ఆమె పదిరోజుల నుంచి అక్కడే ఉంది. లేవలేని స్థితిలో ఉన్న ఆమె మలమూత్ర విసర్జనలన్నీ అక్కడే అయ్యాయి. వాసన వస్తోంది. ప్లాట్‌ఫాంపై పని చేసేవాళ్లు.. ఆమెని చీదరించుకుంటున్నారు. నాకు ఆమెని చూస్తే ఏడుపొచ్చేసింది. అతి కష్టం మీద రైల్వే పోలీసుల అనుమతి తీసుకుని.. ఆమెని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించా. తరవాత ఓ స్వచ్ఛంద సంస్థలో చేర్పించా. కన్నకొడుకు వదిలించేసుకున్న ఆమెని ఓ పదిమంది మధ్యకు చేర్చానన్న సంతృప్తి దక్కింది. అది మాత్రం ఎప్పటికీ మర్చిపోలేను.

ఇంట్లోనే వంట: ఆ తరవాత కొన్నాళ్లకు తెలిసిన అన్నయ్య సూచనతో ఏడాదంతా సేవ చేయాలనే ఆలోచన వచ్చింది. దానిలో భాగంగానే ఇంట్లోనే వంట చేసి పేదవారి ఆకలి తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్నా. రోడ్డు మీదో, గుడి దగ్గరో భిక్షాటన చేసేవారు కనిపిస్తుంటారు. వారికి అందరూ దానం చేస్తారు. కానీ బయటకు రాలేక.. అచేతన స్థితిలో ఉన్నవారు మరెంతో మంది ఉండొచ్చు. అలాంటి వారి వద్దకు వెళ్లి ఆకలి తీరిస్తే బాగుంటుంది అనిపించింది. మొదట ఐదుగురికోసం మాతోపాటే వండి మురికివాడల్లోని వారికి అందించాను. కానీ అది సంతృప్తినివ్వలేదు. మరింత మందికి చేరువ కావాలనుకున్నా. దానికి ఆ అన్నయ్య ఆర్థిక భరోసా ఇవ్వడంతో ఉత్సాహంగా అడుగులు వేయడం మొదలుపెట్టా.

నెలకి 20 వేలు: నెమ్మదిగా ఆ సంఖ్య ఇరవైకి చేరుకుంది. గత ఆరు నెలల నుంచి ప్రతిరోజూ ఇరవై భోజనం ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నా. ఆహారంతో పాటు మంచినీళ్లు కూడా అందిస్తాను. ఇలా ప్యాక్ చేసిన ఆహారాన్ని ఆటోలో తీసుకెళ్లి పంచడం నా జీవనశైలిలో భాగం అయింది. రోజూ ఒకే చోటకు కాకుండా పలు మురికి వాడలకు వెళ్లి వెతుక్కుని మరీ ఇచ్చి వస్తున్నా. కొన్నిసార్లు ఎవరికి ఆహారం అవసరమో అని వెతికే క్రమంలో చాలా సమయం వృథా అవుతుంది. ఇలా ఇస్తున్నప్పుడు... వయసులో వండిపెట్టేవాళ్లు లేక, ఒకపూట తినడానికి లేక ఉన్నవారు దాన్ని అందుకుని తింటుంటే ఎంతో సంతోషంగా అనిపించేది. నేను ఇదంతా చేయడానికి నాకు నెలకు ఇరవై వేల రూపాయల వరకూ ఖర్చు అవుతుంది. గతంలో కొన్నాళ్లు ఉద్యోగం చేసి దాచిన డబ్బు కొంత, తెలిసిన వాళ్లు విరాళంగా ఇచ్చిన డబ్బు మరికొంతా ఉపయోగిస్తా. ఈ మధ్యే పెళ్లవడంతో బెంగళూరులో స్థిరపడ్డాను. అయినా నా సేవలు ఆగకూడదని.. మా మావయ్యకి ఆ బాధ్యత అప్పగించాను. తనే వంట చేయించి.. ఆటో అంకుల్ సాయంతో ఆహారం అందించి వస్తున్నారు. అలానే బెంగళూరు నాకు కొత్త. త్వరలోనే ఇక్కడ కూడా ఆహారం పొట్లాలు అందించడానికి ప్రణాళికలు వేసుకుంటున్నా. ఈ సేవలు ఒక్కరోజు కూడా ఆగకూడదు అనేది నా లక్ష్యం.

ఒత్తిడిని తగ్గించే రంగులు...



కంటికింపైన రంగులు మనసును హత్తుకుంటాయి. హాయినిస్తాయి. మరి అంత ప్రభావం ఉన్న రంగుల్ని పడక గదిలో ఉపయోగించేప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. వంటిల్లు, మధ్యగది, పడకగది.. అవసరాన్ని బట్టి ఒక్కో గదిలో ఒక్కో రంగుతో అలంకరించుకోవచ్చు అంటున్నారు మనస్తత్వ నిపుణులు.

* తెలుపు రంగు మనసుకు హాయినిస్తుంది. పసిపిల్లల గదిలో, పిల్లలు చదువుకునే గదిలో ఆ రంగును ఉపయోగిస్తే చాలా మంచిది. ఈ రంగు ప్రభావం మనసుకు ప్రశాంతతనిస్తుంది. అందుకే చిన్నారులకోసం ఉపయోగించే దుస్తుల దగ్గర్నుంచీ.. దుప్పట్లు, కర్టెన్లు.. గోడల రంగుల వంటివన్నీ.. ధవళవర్ణంలో ఉండేలా చూసుకుంటే మంచిదంటున్నారు నిపుణులు.

* మనసుకు ఆహ్లాదాన్నందించడంలో నీలం వర్ణానిది ప్రధాన పాత్ర ఇది మెదడుపై చూపించే ప్రభావంతో భావోద్వేగాలు నియంత్రణలోకి వస్తాయి. అందుకే ఈ రంగుని టీనేజీ పిల్లల గదిలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఒకవేళ గోడలకు అలాంటి రంగు లేకపోతే కనీసం ఆ వర్ణంలో ఉండే పోస్టర్లు.. కర్టెన్లు.. ఇతర అలంకరణ వస్తువులు ఉంచితే చక్కగా నప్పుతాయి.

* ప్రకృతిలో కాసేపు ఉంటే చాలు ఎంత ఒత్తిడైనా ఉఫ్‌మని దూరమవుతుంది. ఆందోళనల స్థాయిల్ని తగ్గించి పునరుత్తేజం కలిగించేందుకు తోడ్పడుతుంది. కళ్లను తొందరగా ఆకర్షించే రంగూ ఇదే. అందుకే విశ్రాంతి గదిలో, స్టడీరూమ్‌లో ఈ రంగుని వేసుకోవచ్చు.

* పసుపు వర్ణం శుభసూచకం. దీన్ని చూసినప్పుడు మెదడు చురుగ్గా పని చేస్తుంది. అందుకే .. మధ్య గదులు, భోజనాల బల్ల దగ్గర్లో లేత పసుపు వర్ణం అలంకరణ ఎంపిక చేసుకోవాలి. ఈ రంగు స్నేహ పూర్వక వాతావరణాన్ని పెంపొందిస్తుందని నిపుణుల సూచన.

* ఎరుపు ప్రమాదసంకేతం అని చాలామంది అనుకుంటారు. కానీ నిజానికి అది రొమాంటిక్ కలర్. కొత్తగా పెళ్లైన వారు తమ పడకగదిలో ఆహ్లాదంగా కనిపించే ఎరుపు రంగుని ఎంపిక చేసుకుంటే బాగుంటుంది. ఈ వర్ణం ప్రభావం భాగస్వామితో సాన్నిహిత్యాన్ని పెంచుతుంది.



చెవులకు చారెడేసి అందం!





చీరకట్టుకున్నా.. చుడీదార్ ధరించినా... క్రాప్ టాప్ వేసుకున్నా.. కుర్తీలు ఎంచుకున్నా.. ఇలా దుస్తులు ఏవైనా రాశీఖన్నా మాత్రం చెవులకు పెద్ద పెద్ద లోలాకులు ధరిస్తుంది. నప్పే దుస్తులకు అనుగుణంగా.. చాంద్‌బాలీలు, పెద్ద పెద్ద కమ్మలు, లోలాకులు.. ఇలా రకరకాలుగా రూపొందిన వాటిని ఎంపిక చేసుకుంటుంది. ఏ వేడుకలో చూసినా.. ఇతర ఆభరణాల సంగతి మాట పక్కనుంచితే... చెవులకు చారెడేసి కనిపించే టాప్‌లే కనిపిస్తాయి. ఎందుకంటే ఆమెకి రకరకాల ఇయర్ టాప్స్ అంటే ఆసక్తి. షాపింగ్‌కి వెళ్లిందంటే చాలు.. ఏం కొన్నా కొనకపోయినా ఇవి మాత్రం తీసుకుని తీరాల్సిందేనట. ఆమె వార్డ్‌రోబ్ తీస్తే ఎన్నో జతలు కనిపిస్తాయి.





వీపు మీద మొటిమలా?

కొంతమందికి వీపు మీద చిన్న చిన్న మొటిమలూ లేదంటే దద్దుర్ల లాంటివి వస్తూ ఉంటాయి. దానికి పరిష్కారంతో పాటూ కారణాలేంటో చూద్దాం..

❂ మనం సరైన ఆహారం తీసుకోకపోవడం కూడా దీనికి కారణం కావొచ్చు. శరీరంలో వచ్చే మార్పులను మన చర్మం తొందరగా స్పందిస్తుంది. అలాంటి మార్పు వస్తే వెంటనే గమనించాలి. చిరుతిళ్లు ఏమైనా ఎక్కువగా తింటున్నట్లయితే మానేసి తాజా కూరగాయలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకునే ప్రయత్నం చేయండి.

❂ కదలకుండా ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఒకే ప్రదేశంలో వీపు ఆనించి ఉంచుతాం. ఇది కూడా ఒక కారణం కావొచ్చు. అందుకే పని మధ్యలో అప్పుడప్పుడూ విరామం తప్పనిసరిగా ఉండేలా చూసుకోండి.

❂ వ్యాయామం చేశాక తప్పకుండా స్నానం చేయాలి. లేదంటే చెమట వల్ల కూడా ఈ సమస్య పెరిగే అవకాశం లేకపోలేదు. చర్మ రంధ్రాలు మూసుకుపోయి ఇంకా ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది.

❂ జుట్టు ఎక్కువగా వీపు మీద పడుతుంటే కూడా ఈ సమస్య ఎక్కువవుతుంది. పొడవు జుట్టు ఉన్నవాళ్లు.. జుట్టు ముందు వైపుకు వేసుకుంటే మంచిది. అలాగే వ్యాయామం చేస్తున్నప్పుడు జుట్టు పైకి ముడి వేసుకుంటే సరి.

❂ ఈ సమస్యకు కొన్ని చిట్కాలు పాటిస్తే తొందరగానే ఫలితం ఉంటుంది. ఐసు ముక్కను తీసుకుని సమస్య ఉన్న ప్రాంతంలో తరచూ రుద్దుతూ ఉంటే మార్పు కనిపిస్తుంది.



❂ కొబ్బరినూనెలో ఉండే యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు యాక్నెను తగ్గిస్తాయి. రాత్రి పడుకునే ముందు చిన్న దూది ఉండను కొబ్బరినూనెలో ముంచి రాసుకోండి. ఉదయాన్నే కడిగేస్తే చాలు. ఇలా తరచూ చేస్తే ఫలితం ఉండొచ్చు.



❂ తేనె కూడా దీనికి మంచి పరిష్కారం. దూదిఉండతో తేనెను రాసుకుని ఒక అరగంట తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోండి. దీనిలో ఉండే సహజగుణాలు సమస్య తగ్గుముఖం పట్టేలా చేస్తాయి.

రా రమ్మంటున్నాయ్... రైల్వే ఉద్యోగాలు!



దేశవ్యాప్తంగా 62,907 గ్రూప్-డి పోస్టుల్లో చేరే అద్భుత అవకాశాన్ని భారతీయ రైల్వేశాఖ కల్పిస్తోంది. 18 నుంచి 31 సంవత్సరాల మధ్య వయసుండి, పదోతరగతి/ ఐటీఐ/ నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ పొందినవారు ఈ ఉద్యోగాలకు పోటీపడవచ్చు. వీటిలో చేరితే రూ.18,000 నెల వేతనంతోపాటు ఎన్నో సౌకర్యాలు లభిస్తాయి. మొత్తం పోస్టుల్లో 6523 పోస్టులు కేవలం సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో భర్తీ చేయనున్నారు.

ఈ నియామక ప్రక్రియలో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష నిర్వహిస్తారు. అందులో అర్హత మార్కులు సాధించినవారికి శారీరక దార్ఢ్య పరీక్ష ఉంటుంది. రాతపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా పోస్టులు భర్తీ చేయనున్నారు. 12.03.2018 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేసుకోవాలి.



సుధీర్ చక్రవర్తి చాగంటి
Sreedhar's CCE

కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలో 100 ప్రశ్నలను పూర్తి చేయడానికి 90 నిమిషాల సమయాన్ని కేటాయించారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 40%, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ వారు 30% కనీస అర్హత మార్కులు పొందాలి.

అరిథ్‌మెటిక్, మేథమేటిక్స్, జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు రుణాత్మక మార్కులున్నాయి.

అరిథ్‌మెటిక్, మేథమేటిక్స్

వ్యాపార గణితంలోని ప్రశ్నలు రోజువారీ దినచర్యలో భాగంగా మనం చేసే పనికి వర్తించుకుంటూ ఆలోచిస్తే సమాధానాలు తక్కువ సమయంలో పూర్తి చేయవచ్చు. నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకుని, ఇంటీజర్లు, భిన్నాలు, డెసిమల్ నంబర్లకు బాడ్‌మాస్, పెడ్‌మాస్ సూత్రాలను అప్లై చేయడం నేర్చుకోవాలి. వర్గాలు, వర్గమూలాలు, ఘనాలు, ఘనమూలాలు చేయడం సాధన చేయాలి. కసాగు, గసాభా, నిష్పత్తి-అనుపాతం, శాతాలు, వ్యాపార భాగస్వామ్యం, లాభనష్టాలు, చక్రవడ్డీ, బారువడ్డీ, కాలం-పని, కాలం-దూరం, వైశాల్యాలు, ఘన పరిమాణాలకు సన్నద్ధమవ్వాలి. తక్కువ సమయంలో షార్ట్‌కట్ ఫార్ములాలను వాడుతూ సమాధానాలు గుర్తించడం సాధన చేయాలి.

క్యాలెండర్, గడియారాలకు సంబంధించిన ప్రశ్నలనూ సాధన చేయాలి. బీజీయ సమాసం, రేఖాగణితం, త్రికోణమితి, సాంఖ్యక శాస్త్రాలకు సంబంధించిన సమాధానాలను గుర్తించాలంటే ఫార్ములాలను ఉపయోగించడం తెలియాలి. వీటి ఫార్ములాలను ఒక పట్టిక రూపంలో తయారు చేసుకుని, ప్రతి రోజూ 10 నిమిషాలు వెచ్చించాలి. రోజూ ఇలా మననం చేసుకోవడం ద్వారా ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలను గుర్తించవచ్చు.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

రీజనింగ్‌లో లాజికల్ రీజనింగ్ నుంచి నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, ఆడ్‌మాన్ అవుట్, సింబల్స్, నొటేషన్స్, వెన్ చిత్రాలు, రక్తసంబంధాలు తదితర అంశాలపై ప్రశ్నలు వస్తాయి. సీటింగ్ అరేంజ్‌మెంట్ నుంచి గ్రూప్‌గా 2-3 ప్రశ్నలు వస్తాయి. డైరెక్షన్స్, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్, స్టేట్‌మెంట్-అసంప్షన్, డెసిషన్ మేకింగ్, సిలాజిజం నుంచీ ప్రశ్నలు వస్తాయి.



ప్రశ్నలో ఉన్న తర్కం (లాజిక్) ఆధారంగా నంబర్లు ఎలా మారుతున్నాయో గమనించి, సమాధానాన్ని గుర్తించాలి. గుర్తించేప్పుడు పూర్తి సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే సిలాజిజం, స్టేట్‌మెంట్-కన్‌క్లూజన్స్, స్టేట్‌మెంట్-అసంప్షన్స్ ప్రశ్నలకు సమాధానాలను కచ్చితంగా గుర్తించవచ్చు. ఎక్కువ ప్రశ్నలు సాధన చేసి ఎన్ని మోడల్స్ ఉన్నాయో వాటిని నోట్స్ రూపంలో రాసుకోవాలి. పరీక్షలోపు వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలు సాధన చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అంశాల్లో నంబర్ పజిల్స్, సిమిలారిటీ, డిఫరెన్సెస్, మిర్రర్ ఇమేజ్, వాటర్ ఇమేజ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అలాగే డేటా సఫిషియన్సీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచీ ప్రశ్నలుంటాయి. ఎంత ఎక్కువ సాధన చేస్తే అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు. సులభంగా మార్కులు తెచ్చుకుని స్కోర్ పెంచుకోవడానికి అవకాశం ఉన్న సెక్షన్ ఇది.

జనరల్ సైన్స్

పదోతరగతి స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆబ్జెక్టివ్ విధానంలో అడగడానికి అవకాశం ఉన్న ప్రశ్నలకు సంబంధించిన మెటీరియల్ సేకరించాలి. దానికి ఎక్కువ సమయం కేటాయించి సమాచారాన్ని గుర్తుంచుకునేలా చదవడం అలవాటు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పునశ్చరణ (రివిజన్) చేస్తే చదివిన సమాచారం ఎక్కువ రోజులు గుర్తుంచుకోవచ్చు.

జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్

పదోతరగతి స్థాయిలో ఉండే చరిత్ర, భౌగోళిక, ఆర్థిక, రాజనీతి శాస్త్రాలపై అవగాహన ఉండాలి. శాస్త్రీయ, సాంకేతిక అంశాలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు గమనించాలి. రోజువారీ దినపత్రికలు చదువుతూ వాటి సమాచారాన్ని సేకరించాలి. కేంద్రప్రభుత్వ పథకాలు, ఇతర దేశాలతో కుదుర్చుకున్న సంబంధాలు, దేశాధినేతలు, కరెన్సీ, రాజధానులు, వార్తల్లోని వ్యక్తులు, ప్రదేశాల ప్రాముఖ్యం, పుస్తకాలు-రచయితలు, అవార్డులు, ఆటలకు సంబంధించిన విషయాలు తదితర అంశాలపై సన్నద్ధమవ్వాలి.

ఇండియన్ కోస్ట్ గార్డు పదోతరగతి విద్యార్హతతో నావిక్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. ఎంపికైనవారిని డొమెస్టిక్ బ్రాంచ్ కుక్, స్టివార్డ్ హోదాల్లో తీసుకుంటారు. రాత, దేహదార్ఢ్య, వైద్య పరీక్షల ద్వారా నియామకాలు చేపడతారు. పదోతరగతి పూర్తిచేసుకున్న పురుష విద్యార్థులకు ఈ ఉద్యోగం మంచి అవకాశంగా చెప్పుకోవచ్చు.

పది పాసైతే.. కోస్ట్ గార్డ్‌లో నావిక్



నావిక్ ఉద్యోగంలో చేరినవారికి ప్రారంభంలో రూ.21700 మూలవేతనంగా చెల్లిస్తారు. అన్ని అలవెన్సులతో కలుపుకుని మొదటి నెల నుంచే రూ.35,000 వేతనం రూపంలో పొందవచ్చు.

అర్హత: పదోతరగతిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 45 శాతం)

వయసు: అక్టోబరు 1, 2018 నాటికి 18 - 22 ఏళ్లలోపు ఉండాలి. అంటే అక్టోబరు 1, 1996 - సెప్టెంబరు 30, 2000 మధ్య జన్మించినవాళ్లే అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయఃపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.

వేతనం: రూ. 21,700 మూలవేతనంగా చెల్లిస్తారు. డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు ఉంటాయి. వీటన్నింటితో నెలకు రూ. 35,000 వరకు వేతనం రూపంలో లభిస్తుంది. క్యాంటీన్, ఎల్‌టీసీ, వైద్య సేవలు..మొదలైన సౌకర్యాలు కల్పిస్తారు. భవిష్యత్తులో వీరు ప్రధాన అధికారి హోదా వరకు చేరుకోవచ్చు.

ఎంపిక విధానం: రాత పరీక్ష, దేహదార్ఢ్య పరీక్ష, వైద్య పరీక్షల ద్వారా

పరీక్ష ఇలా..

ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, మ్యాథ్స్, జనరల్ సైన్స్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ (కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్), రీజనింగ్ (వెర్బల్ అండ్ నాన్ వెర్బల్) అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

దేహదార్ఢ్య పరీక్షలు

రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహదార్ఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 1.6 కి.మీ. దూరాన్ని 7 నిమిషాల్లో పూర్తిచేయాలి. స్క్వాట్ అప్స్ - 20, పుష్‌అప్స్ -10 తీయగలగాలి.

అభ్యర్థులు కనీసం 157 సెం.మీ. ఎత్తు ఉండాలి. ఊపిరి పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఛాతి కొలతలో వ్యత్యాసం కనీసం 5 సెం.మీ. రావాలి.

దేహదార్ఢ్య పరీక్షలో అర్హత సాధించినవారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ఇందులోనూ విజయవంతమైతే రాత పరీక్షలో చూపిన ప్రతిభ ప్రాతిపదికన మెరిట్ ఆధారంగా తుది నియామకాలు చేపడతారు. ఆయా జోన్లవారీగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను సెప్టెంబరులో ఇండియన్ కోస్ట్ గార్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఫొటోను జతచేసిన మూడు అడ్మిట్ కార్డులు, పదోతరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, మార్కుల పత్రం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలైతే కుల ధృవీకరణ సర్టిఫికెట్; డొమిసైల్ సర్టిఫికెట్, ఏదో ఒక ఐడెంటిటీ ప్రూఫ్ (ఓటర్ ఐడీ లేదా పాన్‌కార్డు లేదా ఆధార్ కార్డు లేదా కాలేజీ ఐడీ) తీసుకెళ్లాలి. వీటన్నింటికీ 3 సెట్ల ఫొటోకాపీలు తీసుకెళ్లాలి.

ఎంపికైతే



అన్ని దశలూ విజయవంతంగా పూర్తిచేసుకుని ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు నుంచి ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ మొదలవుతుంది. శిక్షణ ప్రారంభానికి ముందే మరోసారి మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికి మాత్రమే శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం విధుల్లోకి తీసుకుంటారు. కుక్‌గా ఎంపికైనవారు కోస్ట్ గార్డు ఉద్యోగులకు మెనూ ప్రకారం శాకాహార, మాంసాహార వంటకాలు తయారుచేయాల్సి ఉంటుంది. స్టివార్డ్‌గా విధుల్లో చేరినవాళ్లు భోజన వడ్డన, హౌస్ కీపింగ్, స్టోర్స్ నిర్వహణ తదితర సహకార పనులు చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తులు: ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులు: ఫిబ్రవరి 10 నుంచి ప్రారంభమయ్యాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 16 సాయంత్రం 5 గంటలు.

పరీక్ష: ఏప్రిల్‌లో నిర్వహిస్తారు.

తెలుగు విద్యార్థులకు పరీక్ష కేంద్రం: చెన్నై

వెబ్‌సైట్: http://joinindiancoast-guard.gov.in

Q & A

బి.ఫార్మసీ పూర్తయ్యాక..?

››› బి.ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్నాను. ఫార్మాలో పీజీ చేసినా మంచి జీతంతో కూడిన ఉద్యోగాలు దొరకవని విన్నాను. నిజమేనా? బి.ఫార్మసీ తరువాత బ్యాంకు, ఇతర ఉద్యోగాల పోటీపరీక్షలు రాద్దామనుకుంటున్నా. నాకు అర్హత ఉంటుందా? లేదా బి.ఫార్మసీ పూర్తయ్యాక ఏ కోర్సులు ఎంచుకుంటే మేలో సూచించండి. **- ఎస్. రమేష్,** రేపల్లె, గుంటూరు



జ: ఫార్మా కళాశాలలు భారీగా పెరగడంతో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. దీనివల్ల బి.ఫార్మసీ పూర్తిచేసిన అభ్యర్థులకు అవకాశాలు తగ్గాయన్నమాట కొంతవరకూ వాస్తవమే. కానీ ఫార్మా రంగం అభివృద్ధి, బహుళజాతి సంస్థలు మనదేశానికి రావడం ఫార్మా విద్యార్థులకు శుభపరిణామం. వీటివల్ల రిసెర్చ్ ఓరియెంటెడ్ ఉద్యోగావకాశాలు మెండుగానే ఉన్నాయి. విద్యార్థి తన డిగ్రీ లేదా పీజీ కోర్సుల్లో పరిశోధనాత్మకంగా విద్యను అభ్యసిస్తే ఉద్యోగాలను మంచి జీతంతో అందిపుచ్చుకోవచ్చు. బి.ఫార్మసీ చదివినవారు కూడా డిగ్రీ అర్హతగా ఉన్న బ్యాంకు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫార్మకోవిజిలెన్స్, మెడికల్ కోడింగ్ వంటి అదనపు కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా మంచి ఉద్యోగావకాశాలను పొందవచ్చు. ఆసక్తి ఉన్నవారు మెడికల్ స్టోర్‌ను స్థాపించుకుని, వ్యాపార రంగంలోకి అడుగు పెట్టవచ్చు. కాబట్టి ఎక్కువగా మధనపడకుండా మీ కోర్సు వర్క్‌పై దృష్టిసారించండి.

ఫోరెన్సిక్‌కు అర్హత ఉందా?

››› బీఎస్సీ (ఎంపీసీ) పూర్తిచేశాను. ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ చేయాలనుంది. నేను అర్హుడినేనా? అందించే కళాశాలల వివరాలను తెలపండి. **- చందన్ రెడ్డి**



జ: నేర పరిశోధనలో విజ్ఞాన సూత్రాలను వర్తింపజేసి, సాధారణ దృష్టిని తప్పించుకునే ఆధారాలను కనుక్కొనే శాస్త్రమే ఫోరెన్సిక్ సైన్స్. మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, జంతుశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, అప్లయిడ్ సైన్స్ లేదా వృక్ష శాస్త్రంలో డిగ్రీ పూర్తిచేసినవారికి ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ చదివే అర్హత ఉంటుంది. కాబట్టి ఈ కోర్సు చేయడానికి మీరు అర్హులే. పీజీ స్థాయిలో ఈ కోర్సును అమిటి యూనివర్సిటీ, గల్గోతియా యూనివర్సిటీ, డాక్టర్ హరిసింగ్ గౌర్ యూనివర్సిటీ అందిస్తున్నాయి. పరిశీలన నైపుణ్యాలు, సహజంగా పరిశోధించే స్వభావం, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ వృత్తిలో రాణిస్తారు.

డేటాసైన్స్‌లో పరిశోధన

››› ఎంటెక్ (సీఎస్ఈ) పూర్తిచేశాను. డేటా సైన్స్ లేదా మెషిన్ లెర్నింగ్‌లో పీహెచ్‌డీ కోర్సు చేయాలనుంది. అందించే విశ్వవిద్యాలయాలేవి? విదేశాల్లో అందించే సంస్థలనూ తెలపండి.

- యాసాని చంద్రశేఖర్

జ: బిగ్ డేటా, సమాచార విప్లవంతో డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధన, ఉద్యోగావకాశాలకు గిరాకీ ఏర్పడింది. మనదేశంలో ప్రఖ్యాత ఐఐటీలు, ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐఎంలు ఈ విభాగంలో పరిశోధనకు ప్రవేశాలు కల్పిస్తున్నాయి. విదేశాల్లో ముఖ్యంగా యూఎస్ఏలోని ఎంఐటీ, స్టాన్‌ఫర్డ్, కార్నెగీ మెలన్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా వంటి ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు జీమ్యాట్, టోఫెల్, ఉద్యోగానుభవం ఆధారంగా చేసుకుని పీహెచ్‌డీ ప్రవేశాన్ని కల్పిస్తున్నాయి.

లైబ్రరీ


కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల మార్కెట్‌లోకి విడుదలైన పుస్తకాల వివరాలు.

నీట్-2018



నీట్ -వృక్షశాస్త్రం
పేజీలు: 688, ధర: రూ. 650
ప్రచురణ: డార్క్‌చెర్రీస్ పబ్లికేషన్

డీఎస్సీ మ్యాథ్స్



డీఎస్సీ -స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ కంటెంట్ పేజీలు: 544+496, వాల్యూమ్-1 ధర: రూ. 409, వాల్యూమ్-2 ధర: రూ. 379
ప్రచురణ: పీఆర్ పబ్లికేషన్స్

ఏపీ టెట్



1) ఏపీటెట్ పేపర్-2 సాంఘిక శాస్త్రం (కంటెంట్, పెడగోజీ)
పేజీలు: 800, ధర: రూ. 360
2) ఏపీటెట్ పేపర్-1 పరిసరాల విజ్ఞానం
పేజీలు: 610, ధర: రూ. 270
ప్రచురణ: వి.జి.యస్. కాంపిటీషన్స్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ, చెన్నై
పోస్టులు: ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్-02, జూనియర్ ఇంజినీర్-01.
అర్హత: ఏదైనా డిగ్రీ, మెకానికల్/ ఎలక్ట్రికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా.
వయసు: 28 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ.250 **చివరితేది:** 10.03.2018
వెబ్‌సైట్: http://niwe.res.in/

అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్
హైదరాబాద్ రామాంతపూర్‌లోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ (ఏటీఐఈపీఐ) కాంట్రాక్టు ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: కన్సల్టెంట్ **ఖాళీలు:** 07 **అర్హత:** బీఈ/ బీటెక్ ఉత్తీర్ణతతోపాటు అనుభవం. **వయసు:** 30 సంవత్సరాలకు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష, వైవా ద్వారా. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
చివరితేది: 26.02.2018 **వెబ్‌సైట్:** http://atiepihyderabad.gov.in/

కేంద్రీయ విద్యాలయం
కేంద్రీయ విద్యాలయ నెం.1, గోల్కొండ, హైదరాబాద్ కాంట్రాక్టు టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ, కోచ్
ఖాళీలు, అర్హత, వయసు, ఎంపిక: నిబంధనల ప్రకారం. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ **చివరితేది:** 17.02.2018
www.kv1golconda.edu.in/

ప్రవేశాలు

ఐఐఎం, రాంచీ
కోర్సు: పీజీ డిప్లొమా ఇన్ హెచ్ఆర్ఎం. **అర్హత:** ఏదైనా డిగ్రీ.
ఎంపిక విధానం: అకడమిక్ ప్రతిభ/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.1800.
చివరితేది: 07.03.2018 **వెబ్‌సైట్:** www.iimranchi.ac.in/

ఐఐఎం, రాయ్‌పూర్
కోర్సులు: 1) ఫుల్ టైమ్ డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ 2) ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ **అర్హత:** పీజీ లేదా సీఏ, ఐసీడబ్ల్యూఏ లాంటి ప్రొఫెషనల్ విద్యార్హతలు లేదా ఇంటిగ్రేటెడ్ పీజీ లేదా బీఈ/ బీటెక్.
వయఃపరిమితి: 50 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** క్యాట్, గేట్, జీఆర్ఈ, యూజీసీ/ సీఎస్ఐఆర్ - నెట్ స్కోరు/ ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీలు: 2018 ఏప్రిల్ 2, 3. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్.
చివరితేది: 28.02.2018 **వెబ్‌సైట్:** http://iimraipur.ac.in

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ
కోర్సులు: 1) పీహెచ్‌డీ 2) పీజీ 3) యూజీ 4) డిప్లొమా/ సర్టిఫికెట్.
ప్రాంగణాలు: హైదరాబాద్ ప్రధాన ప్రాంగణంతోపాటు ఇతర శాటిలైట్ ప్రాంగణాలు, టీచర్ ఎడ్యుకేషన్ కాలేజీలు, పాలిటెక్నిక్‌లు.
అర్హత, వయసు: ఆయా కోర్సులకు అనుగుణంగా ప్రకటనలో తెలిపిన విధంగా.
ఎంపిక: పీహెచ్‌డీ, ఎంటెక్, బీఈడీ, ఎంఈడీ లాంటి కోర్సులకు ప్రవేశ పరీక్ష ద్వారా, మిగిలినవాటికి అకడమిక్ ప్రతిభ ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్. **దరఖాస్తు ప్రారంభం:** 18.02.2018
చివరితేది: ప్రవేశ పరీక్ష ఉన్న కోర్సులకు 26.03.2018, మిగిలినవాటికి 09.07.2018
వెబ్‌సైట్: http://www.manuu.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ప్రైవేటు ఆసుపత్రుల కోసమే కొత్త బీమా

- రూ.లక్ష కోట్లకు రూ.2 వేల కోట్లు కేటాయింపా?
- యుద్ధ విమానాల కొనుగోళ్లలో గోప్యత ఎందుకు?
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కారాట్

ఈనాడు - ఏలూరు

కేంద్ర బడ్జెట్లో ప్రవేశపెట్టిన కుటుంబానికి రూ.5 లక్షల బీమా అనేది కేవలం బీమా కంపెనీలకు, ప్రైవేటు ఆసుపత్రులకు దోచిపెట్టేందుకేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కారాట్ విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలోని సింహాద్రి శివారెడ్డి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీపీఎం 25వ రాష్ట్ర మహాసభల్లో రెండో రోజు ఆదివారం ఆయన వివిధ జిల్లాల నాయకులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల వైద్య బీమాతో రాష్ట్ర ప్రభుత్వాలపై 40 శాతం భారం పడుతోందని, ఇది ఏమాత్రం ప్రయోజనకరం కాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం పక్కనబెట్టి ఇలా ప్రజల డబ్బును ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కారాట్

రైతులపై కేంద్రం సవతి ప్రేమ

రైతులపై కేంద్రం సవతి ప్రేమ చూపిస్తోందని ప్రకాష్ కారాట్ అన్నారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు ప్రతి పంటకు ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధరను చెల్లించాలని ప్రతిపాదించారని గుర్తుచేశారు. దీనికి రూ.లక్ష కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉండగా దీన్ని పక్కన పెట్టి రైతులకు ఏదో ప్రయోజనం కలిగిస్తున్నట్లుగా భ్రమింపచేసి.. కేవలం రూ.2 వేల కోట్లు కార్పస్ ఫండ్ రూపంలో కేటాయించడం రైతుల పట్ల కేంద్రానికి ఎంత ప్రేమ ఉందో తెలియజేస్తుందన్నారు. పాకిస్థాన్‌తో చర్చలు జరపడం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉండగా, దాన్ని పక్కన పెట్టి కాల్పుల విధానం వల్ల జమ్ము, కశ్మీర్ ప్రజలు భయంతో వణికిపోయి వేలాది మంది వేరే ప్రాంతాలకు తరలి వెళ్లిపోతున్నారని విమర్శించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోళ్ల విషయమై తాము వివరాలు అడుగుతున్నామని, అది భద్రతాపరమైన అంశంతో కూడుకున్న వ్యవహారం కాబట్టి తాము వెల్లడించలేమని కేంద్ర ప్రభుత్వం చెప్పడాన్ని తమ పార్టీ ఖండిస్తుందన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా మేం సిద్ధం

అఖిల భారత మహాసభలు ఏప్రిల్ 18 నుంచి నిర్వహిస్తామని, ఆ సభల్లో విధానపరమైన నిర్ణయాలు, రాజకీయ ఎత్తుగడలపై ఆలోచిస్తామని తెలిపారు. ఇప్పటికే త్రిపుర రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియలో తలమునకలై ఉన్నామన్నారు. ఇప్పటి వరకు మిగిలిన పార్టీలతో తలపడితే త్రిపురలో మాత్రం భాజపాతో పోటీ పడుతున్నామని, రాబోయే కొన్ని నెలల్లో వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని, దీనిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

ఇప్పుడే నిద్ర లేచారు

ఆంధ్రప్రదేశ్‌లోని పార్లమెంటు సభ్యులు, తెదేపా నాయకులు ఇప్పుడు నిద్రలేచారని ప్రకాష్ కారాట్ విమర్శించారు. ఇటీవల వామపక్షాలు చేసిన బంద్‌కు విశేష స్పందన కనిపించిందని, ప్రజల మనోభావాలు దీన్ని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, ఇంకా అనేక విషయాల్లో అదనపు నిధులు ఇవ్వాల్సి ఉండగా, దాన్ని పక్కన పెట్టి ఇప్పుడు కాకమ్మ కబుర్లు చెప్పడం సరైన విధానం కాదన్నారు. తెదేపా ప్రభుత్వం కూడా బాధ్యత వహించాల్సిందేనని, ఇప్పటివరకు మొద్దు నిద్రపోయి, ఇప్పుడు ఆదరాబాదరాగా ప్రకటనలు చేయడం చూస్తే ప్రజల్ని మభ్యపెడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. పార్టీ సమావేశాల్లో పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారగృహం నిర్వహిస్తూ దొరికిపోయిన తుమకూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

బెంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణయ్య వ్యభిచారగృహం నిర్వహిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. బెంగళూరులోని దొడ్డబిదకల్లు వేణుగోపాలనగరలో కొత్తగా నిర్మించిన ఇంట్లో పడుపు వృత్తి జరుగుతోందని వచ్చిన సమాచారంతో సీసీబీ పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడులు జరపడంతో ఈయన వ్యవహారం బయటపడింది.

GOVERNMENT OF ANDHRA PRADESH
A.P. REVENUE AND SURVEY ACADEMY, SAMALKOT
MESS TENDER NOTIFICATION
For Details: www.ccla.ap.gov.in/CCLA/recruitment.ccla
Last Date: 27-02-2018
Joint Director/ Vice Principal

Commissioner, Dhone Municipality, Dhone, Kurnool Dist. - 518222
Mobile: + 919949588370. E-mail: mc.dhone@cdma.gov.in
E-Tender: Residential Area Solid Waste Handling, Street Sweeping, Litter Collection, Drains Cleaning and Related Sanitation Activities for a Period of 3 Years on "Buy/Hire, Own & Operate" (Boo) Basis Municipal Solid Waste Management and Maintenance of Sanitation - Residential Cum Commercial Area Service Package Outsourcing - Package No.01.
Tender Notification No.03/2017-18/E1 Date: 12-02-2018
Value of Works: for package No. 1-Rs. 4,37,73,690/-
E-Tender Download Start Date and Time : 12-02-2018 & 11:00 AM
Bid Submission Closing Date and Time : 08-03-2018 & 05:00 PM
Pre-Bid meeting Date and Time : 26-02-2018 & 11:00 AM
Technical bid opening Date and Time : 08-03-2018 & 05:00 PM
E-Tender Website: https://tender.apeprocurement.gov.in
E-Mail ID for Clarifications/ Communication: mc.dhone@cdma.gov.in
Note: Any addendum / Corrigendum / bid clarifications / time extension shall be issued on the website only. No separate press notification shall be issued.
Sd/- Commissioner, Dhone Municipality

Sri Narasimha Eranna Swamy Devasthanam
Urukunda (V), Kowthalam(M), Kurnool District
ENDOWMENTS DEPARTMENT
e-procurement notice
Tender Notice No. 58/2017-18 dated 11.02.2018

S. No.	Name of the Work	EMD	ECV Amount
1	Construction of 2nd Prakaram Wall with stone around the temple at Sri Narasimha (Eranna) swamy Devasthanam, Urukunda (V) Kowthalam(M), Kurnool Dist.	4,15,039.00	4,15,03,935.00

Bid document will be available through online from 12.02.2018 at 10.00 AM to Bid Submission Closing Date & Time 27.02.2018 at 5.30 PM. The details of name of work, tender document Eligibility criteria, Bid Submission & Price bid Opening date and EMD details etc., may be seen on e-procurement market place available at website www.tender.apeprocurement.gov.in or contact at office during the working hours.
Sd/- Smt. B.Manorama, Chairman & Trust Board Members, Sri Narasimha Eranna Swamy Devasthanam, Urukunda.
Sd/- G.Mallikarjuna Prasad, Assistant Commissioner & Executive Officer, Cell: 94910 00738.



పౌర సమాచార కరదీపికలను ఆవిష్కరిస్తున్న మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ చక్రపాణి, సమాచార హక్కు ప్రచార వేదిక సభ్యులు తదితరులు

ప్రజలు చైతన్యవంతులైతేనే ప్రజాస్వామ్యం

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రజలు చైతన్యవంతులైనప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతంగా అమలు అయినట్లని సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి జగన్మోహనరావు అన్నారు. ఆదివారం అమరావతిలో సమాచార హక్కు ప్రచార వేదిక(ఆంధ్రప్రదేశ్) ప్లీనరీ జరిగింది. ఆయన పాల్గొని మాట్లాడుతూ..సమాచార కమిషనర్ల ఖాళీలను సత్వరం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ(బాపట్ల) డైరెక్టర్ జనరల్ దిట్టకవి చక్రపాణి మాట్లాడుతూ.. తమ సంస్థ ఏపీహెచ్‌ఆర్‌డీఐ(బాపట్ల) ఐక్యవేదికకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు.

పింఛను సొమ్ము రెట్టింపు చేస్తా

- ప్రజాసంకల్ప యాత్రలో జగన్

జలదంకి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వస్తే పింఛను సొమ్మును రెట్టింపు చేసి ప్రతి నెలా రూ.2 వేలు చొప్పున అందిస్తామని, 45 ఏళ్లనే అర్హతగా నిర్ణయిస్తామని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం కొత్తపాలెం గ్రామం నుంచి 84వ రోజు ప్రజాసంకల్ప యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులను బడికి పంపించే తల్లులకు అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేల నగదు అందిస్తామని చెప్పారు. దీని ద్వారా చిన్నారులు డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదుగుతారన్నారు. పొదుపు రుణాలు రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలను మోసం చేశారని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే మహిళా సంఘాలకు ఎంత అప్పు ఉందో అంత మొత్తాన్ని నాలుగు దఫాలుగా అందిస్తామని తెలిపారు. వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని చెప్పారు. జలదంకి మండలం తర్వాత కలిగిరి మండలం తూర్పు, పడమర గుడ్లదొన గ్రామాల మీదుగా జగన్ పాదయాత్ర అనంతపురం గ్రామానికి చేరుకుంది. రాత్రికి ఆ గ్రామంలోనే విపక్ష నేత బస చేశారు. నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గౌతమ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్.ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



పాదయాత్రలో మహిళలతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

గుంటూరులో మాదిరిగా నడిరోడ్డుపై రౌడీషీటర్ హత్య

నరసరావుపేట పట్టణం, న్యూస్‌టుడే: గుంటూరులో రెణ్నెల్ల క్రితం అందరూ చూస్తుండగా నడి రోడ్డుపై అంతా చూస్తూ ఉండగా పాత కక్షలతో ఓ రౌడీషీటర్‌ని హతమార్చగా ఆదివారం ఇదే తరహాలో నరసరావుపేటలో మరో హత్య జరిగింది. స్థానిక ఎస్ఆర్‌కేటీ కాలనీకి చెందిన రౌడీషీటర్ బొల్లు నాగరాజును గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడిచేసి హతమార్చారు. అనేక హత్య కేసుల్లో నిందితుడైన అతణ్ని కారులో వచ్చిన నలుగురు యువకులు కత్తులతో నరికి చంపి పరారయ్యారు. నరసరావుపేట పట్టణంలోని జనసంచారం ఉండే గోల్డెన్ రెస్టారెంట్ ఎదురుగా నడిచి వెళుతుండగా హతమార్చారు. అతడు గతంలో ఎస్ఆర్‌కేటీ కాలనీలో జరిగిన మాతంగి కన్నా హత్య కేసులో ప్రధాన నిందితుడు. గ్రామీణ పోలీసులు ఆ కేసులో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. కొద్ది రోజుల క్రితం జైలు నుంచి విడుదలయ్యాడు. డీఎస్పీ నాగేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హత్యకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.



నాగరాజు (పాతచిత్రం)

'రాజధాని భూములు మతసంస్థలకు కట్టబెట్టవద్దు'

గ్రామీణ మంగళగిరి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలోని భూములను ఆధ్యాత్మిక సంస్థలు, స్వామీజీలు, బాబాలకు కట్టబెట్టవద్దని నాస్తిక సమాజం తీర్మానించింది. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రులో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ నాస్తిక మేళా ఆదివారంతో ముగిసింది. పాలకులు, అధికారులే మత ప్రచారం చేయడం, దేవాలయాలను దర్శించుకోవడం లౌకిక వ్యవస్థను అవమానపర్చడమేనని నాస్తిక సమాజం పేర్కొంది. మూఢనమ్మకాల నిర్మూలనకు చట్టం చేసేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తేవాలని సమాజం రాష్ట్ర కమిటీ తీర్మానించింది. 'నేటి రాజ్యంలో మతోన్మాద ప్రచారం' అంశంపై హేతువాద సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి కత్తి పద్మారావు మాట్లాడారు. విశ్వవిద్యాలయాల్లో విడ్డూరంగా జ్యోతిషం, వాస్తు వంటివి పాఠ్యాంశాలుగా పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న కత్తి పద్మారావు

ఉద్యోగులు ప్రలోభాలకు గురికాకుండా పనిచేయాలి

- ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి

కాకినాడ, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగులు ప్రలోభాలకు గురికాకుండా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి సూచించారు. కాకినాడలో రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ ఒత్తిళ్లతో రెవెన్యూ ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సిన పనిలేదని, అటువంటి కేసుల విషయంలో నిజనిర్ధరణ చేసిన తరువాతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ ఉద్యోగుల ఒత్తిడి తగ్గించటానికి అన్ని జిల్లాల్లో కలెక్టర్లు శని, ఆదివారాలు క్రీడలు నిర్వహించాలని, ఆదివారం యోగా చేయాలని సూచించారు. క్రీడా పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది.

నాలుగు క్రీడా నగరాల అభివృద్ధి.. మంత్రి రవీంద్ర: ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలకు శాప్ ద్వారా నిధులు మంజూరు చేసే విషయమై సీఎంతో చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో 10 అకాడమీలు ఏర్పాటు చేస్తామన్నారు. కాకినాడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు.



రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల ముగింపు ఉత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణమూర్తి, పక్కన మంత్రి రవీంద్ర తదితరులు

సుస్థిరాభివృద్ధి సదస్సుకు సీఎంకు ఆహ్వానం

ఈనాడు డిజిటల్, అమరావతి: దిల్లీలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ జరగనున్న ప్రపంచ సుస్థిరాభివృద్ధి సదస్సు (డబ్ల్యూఎస్‌డీఎస్)లో పాల్గొని ప్రసంగించాల్సిందిగా కేంద్ర ఇంధన వనరుల సంస్థ (టీఈఆర్ఐ) నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆహ్వానం అందింది. పునరుత్పాదక ఇంధనం, ఇంధన పొదుపు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వల్ల ముఖ్యమంత్రికి ఈ ఆహ్వానం లభించినట్లు రాష్ట్ర ఇంధన శాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. వాతావరణ మార్పులను తట్టుకునేందుకు హరిత ఇంధనాన్ని ప్రోత్సహించడం ఉద్దేశంగా జరుగుతున్న ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు, నోబెల్ పురస్కార గ్రహీతలు, అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు, విద్యావేత్తలు పాల్గొననున్నారు.

జగన్మాత సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ రంజన్ గొగొయ్‌లకు ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ రంజన్ గొగొయ్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలకగా, వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారికి ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు దుర్గాప్రసాద్, స్థానాచార్య శివప్రసాద శర్మ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో అచ్యుతరామయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యను జ్ఞానార్జగా వినియోగించండి: యార్లగడ్డ

ఈనాడు, దిల్లీ: ఉపాధి, వ్యాపారాలకే కాకుండా జ్ఞానార్జన సాధనంగానూ విద్యను వినియోగించాలని కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. అమెరికాలోని బోస్టన్‌లో ఏటా నిర్వహించే భారతీయ ఉత్సవంలో భారతీయ సాహిత్యంపై జరిగిన గోష్ఠిలో పాల్గొన్న యార్లగడ్డ హార్వర్డ్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంటర్‌నెట్ వినియోగం పెరగడంతో పుస్తక పఠనం తగ్గిపోతోందని ఆవైపు మళ్లించేలా రచయితలు బాధ్యత తీసుకోవాలన్నారు. మారుతున్న కుటుంబ, ఆర్థిక, సామాజిక సమస్యలకు పరిష్కారం చూపే దిశగా రచనలు చేయాలని యార్లగడ్డ కోరారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్, కెన్నెడీ స్కూల్, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆర్కిటెక్చర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

పుష్పపల్లకిలో శ్రీగిరీశుడు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: భక్తకోటితో శ్రీశైల క్షేత్రం కిటకిటలాడుతోంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి భక్తులు తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల ఆరో రోజు ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు పుష్పపల్లకి సేవ వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ముందుగా ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో విశేషపూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకువచ్చారు.



పుష్పపల్లకిలో విహరిస్తున్న శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లు

ఆయేషామీరా కేసు విచారణకు సిట్ అధికారులు

తల్లిదండ్రుల నుంచి వివరాల సేకరణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విజయవాడలోని వసతిగృహంలో దాదాపు 11 సంవత్సరాల క్రితం హత్యకు గురైన ఆయేషా మీరా కేసు పునర్ విచారణ చేపట్టిన సిట్ బృందం ఆదివారం గుంటూరు జిల్లా తెనాలి వచ్చింది. ముఖ్య విచారణాధికారి డీఐజీ శ్రీకాంత్, డీఎస్పీలు హైమావతి, శ్రీలక్ష్మి ఇతర సిబ్బంది స్థానిక పాండురంగపేటలోని ఆయేషా మీరా తల్లిదండ్రులైన షంషాద్‌బేగం, ఇక్బాల్ భాషాల నివాసగృహానికి వచ్చారు. వసతి గృహంలో ఆయేషామీరాను చేర్చడానికి వెళ్లినప్పుడు గమనించిన అంశాలు మొదలుకొని హత్యకు గురైందని సమాచారం రావటం, ఆ తర్వాత జరిగిన విషయాలపై ఆరా తీశారు. ఘటనపై ఉన్న సందేహాలు, నిందితులు ఎవరని భావిస్తున్నారు, దానికి కారణాలు ఏమిటి? తదితర అంశాలను నమోదు చేసుకున్నారు. విచారణ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. లిఖితపూర్వకంగా సమాచారం సేకరించారు. విచారణ దాదాపు ఆరు గంటలకు పైగా సాగింది. మీడియాతో సహా ఎవరినీ లోపలికి రానివ్వలేదు.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయం

- సీపీఎం రాష్ట్ర మహాసభల్లో తీర్మానం
- రాష్ట్రం వెనుకబాటుతనానికి తెదేపా, భాజపాదే బాధ్యతని వెల్లడి

ఈనాడు ఏలూరు: వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయమని, ఇందుకు అందరూ కృషి చేయాలని సీపీఎం 25వ రాష్ట్ర మహాసభల్లో రెండోరోజైన ఆదివారం తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంవీఎస్ శర్మ ప్రవేశపెట్టగా, మరో కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి బలపరిచారు. పలు సూచనలు, చర్చల తర్వాత సభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సీపీఎం రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఆదివారం వివిధ అంశాలపై సభ్యులు చర్చించారు. 'ఆరు దశాబ్దాలపాటు ఐక్యంగా ఉన్న తెలుగుజాతి 2014లో రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ ఏర్పాటు, ఉక్కు పరిశ్రమ నిర్మాణం, రాజధాని నిర్మాణం, బడ్జెట్ లోటు భర్తీకి నిధులు వంటి హామీలు అమలు చేయించుకోవడంలో తెదేపా ఘోరంగా విఫలమైంది'' అని మహాసభ విమర్శించింది. రాష్ట్రం వెనుకబాటుతనానికి తెదేపా, భాజపాలు రెండూ బాధ్యత వహించాల్సి ఉందని వక్తలు పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలపై నిరంకుశంగా వ్యవహరిస్తూ 144 సెక్షన్, పోలీసు చట్టం 30ని నిరంతరం ప్రయోగిస్తున్నారని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షం వైకాపా ప్రభుత్వాన్ని నిలదీయకపోవడాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు వినాశకరమైనవని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఉపయోగించుకుని మతోన్మాద శక్తులు బలపడేందుకు ఆ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ఊరట కల్పించే ప్రత్యామ్నాయం అవసరమని వక్తలు ఏకగ్రీవంగా అభిప్రాయ పడ్డారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలను, ఆ భావాలు కలిగిన వ్యక్తులు, సామాజిక, అభ్యుదయ సంస్థలను ఒకే వేదికపైకి సమీకరించాల్సిన అవసరం ఉందని ప్రకటించారు. వీరంతా కలిసి వామపక్ష ప్రజాతంత్ర వ్యక్తుల ఐక్యత కోసం కృషిచేసి అన్ని ప్రాంతాలు, వర్గాలు, అన్ని తరగతుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు.



సమావేశంలో చర్చించుకుంటున్న ప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఫారం నెం. 7
(చట్టం నెం.30/2013 లోని సెక్షన్ 19(1) మరియు రూలు 25(1) ప్రకారము)
రూఢి ప్రకటన
ఆర్.సి.జి1/271/2017 Date: 6-2-2018 Gazette No. 16/KST/2018, Date: 6-2-2018

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ నష్టపరిహారం పునఃస్థాపనలో న్యాయపరమైన, పునరావాసం, పారదర్శకత చట్టంలో సెక్షన్ పొందే హక్కు 19 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

ఈ దిగువ సుదహరించిన షెడ్యూలు దాఖలా కృష్ణాజిల్లా, గన్నవరం, వెదురుపావులూరు గ్రామ భూములను ప్రజాప్రయోజనాల నిమిత్తము అనగా లింక్ రోడ్డుతో విజయవాడ ఇన్నర్ రింగ్‌రోడ్డుతో కలుపుట కొరకు భూమి కావలయునని శ్రీయుత కలెక్టర్ కృష్ణాజిల్లా వారు భావించినందున 2013 సంవత్సరం 30వ చట్టంలో 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత కలెక్టర్ జిల్లా వారు సంతృప్తి చెంది ఈ దిగువ కృష్ణా షెడ్యూల్ దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింద రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

శ్రీయుత కలెక్టర్, కృష్ణాజిల్లా, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) ననుసరించి ఈ దిగువ సుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనమున్నకై అనగా విజయవాడ రింగ్ రోడ్డును లింక్ రోడ్డుతో కలుపు నిమిత్తము అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

జిల్లా : కృష్ణా మండలం : గన్నవరం గ్రామము : వెదురుపావులూరు

క్రమ సంఖ్య	రీ.సర్వే నెం	సబ్ డివిజన్	పూర్తి విస్తీర్ణం	పట్టా/అసైన్డ్	పుంజ/నంజ	భూసేకరణ విస్తీర్ణం	అనుభావదారుని పేరు / పట్టాదారుని పేరు
1.	491	4 (పి)	0.37	పట్టా	మాగాణి	0.02	షేక్ ఇస్రావుల్లా
		5 (పి)	0.07	పట్టా	మాగాణి	0.04	చాగంటి మంగమ్మ
		6 (పి)	0.27	పట్టా	మాగాణి	0.07	చాగంటి మంగమ్మ
2.	492	1	0.2	పట్టా	మాగాణి	0.09	షేక్ కమల్ అహ్మద్
		2	0.67	పట్టా	మెట్ట	0.25	కడియాల వెంకట కృష్ణారావు
		3	6.5	పట్టా	మాగాణి	0.01	వెలగా మాధవరావు
		9	0.51	పట్టా	మెట్ట	0.17	పాలడుగు కృష్ణ
		14	1.19	పట్టా	మెట్ట	0.21	జోకుపర్తి సరస్వతి, గరిమెళ్ళ సుబ్బారావు
3.	493	4	0.34	పట్టా	మెట్ట	0.10	దుగ్గిరాల శ్రీ కృష్ణమ్మ
		11	1.01	పట్టా	మెట్ట	0.20	పాలడుగు చంద్రశేఖర్‌రావు
4.	494	10	0.21	పట్టా	మెట్ట	0.03	అబ్దుల్ దవలత్
		11	0.19	పట్టా	మెట్ట	0.03	అబ్దుల్ దవలత్
		12	0.53	పట్టా	మెట్ట	0.07	కడియాల తిరుపతమ్మ, షేక్ సుభాని
		13	0.26	పట్టా	మెట్ట	0.03	గుట్ట బేబి సరోజినీ
		14	0.5	పట్టా	మెట్ట	0.05	కొరివి సురేష్ కుమార్
5	498	11	0.17	పట్టా	మెట్ట	0.08	కొప్పుల జయరాజు
		12	0.47	పట్టా	మెట్ట	0.31	కడియాల వెంకటేశ్వరరావు కడియాల సుభాష్ చంద్రబోస్
		16	0.33	పట్టా	మెట్ట	0.04	కడియాల వెంకటేశ్వరరావు
6	499	8	1.15	పట్టా	మెట్ట	0.12	కడియాల వెంకటేశ్వరరావు కడియాల ప్రవీణ్‌కుమార్
		10	0.55	పట్టా	మెట్ట	0.08	ఆర్గా శివపార్వతి
7.	500	16	0.31	పట్టా	మెట్ట	0.09	కొమ్మినేని కృష్ణారావు
		17	0.33	పట్టా	మెట్ట	0.07	కొమ్మినేని కృష్ణారావు గరిమెళ్ళ పూర్ణచంద్రరావు
		18	0.37	పట్టా	మెట్ట	0.10	గరిమెళ్ళ పూర్ణచంద్రరావు
		19	0.29	పట్టా	మెట్ట	0.05	వేమూరి అప్పారావు
		20	0.9	పట్టా	మెట్ట	0.08	కొమ్మినేని కృష్ణారావు వాకా కొండయ్య
8	502	1	0.24	పట్టా	మాగాణి	0.01	కొమ్మినేని శివ నాగేశ్వరరావు కొంగర బసవయ్య
		2	0.12	పట్టా	మాగాణి	0.01	కడియాల పార్వతి కొమ్మినేని శివ నాగేశ్వరరావు
		4	0.26	పట్టా	మాగాణి	0.02	అట్ల రామస్వామి
		5	0.13	పట్టా	మాగాణి	0.04	కడియాల పార్వతి
		8	0.99	పట్టా	మాగాణి	0.27	కాకాని మహేశ్వరరావు
9	503	1	0.81	పట్టా	మాగాణి	0.06	బొప్పన రవిప్రసాద్
		4	0.13	పట్టా	మాగాణి	0.03	బొప్పన రవిప్రసాద్
		5	0.12	పట్టా	మాగాణి	0.03	బొప్పన రవిప్రసాద్
		6	0.18	పట్టా	మాగాణి	0.09	బొప్పన రవిప్రసాద్
		7	1.41	పట్టా	మాగాణి	0.07	కొండపాతూరి వెంకట జగన్నాధం కొండపాతూరి వెంకటేశ్వరరావు
10	504	2	4.12	పట్టా	మాగాణి	0.36	కడియాల వెంకట కృష్ణారావు
11	507	1	0.77	పట్టా	మాగాణి		కడియాల వెంకటేశ్వరమ్మ
		2	1.15	పట్టా	మాగాణి	0.09	గరిమెళ్ళ కృష్ణారావు గరిమెళ్ళ రామకృష్ణ, భారతిదేవి
			TOTAL			3.56	

భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, నూజివీడు కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.
బొగ్గు గనులు, యినుపరాయి, పలకరాయి లేదా యితర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూ భాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుటగాని చేయవలెను.
సం/- బి. లక్ష్మీకాంతం కలెక్టర్, కృష్ణా

న్యాయవాదులు సామాజిక ఇంజినీర్లు

- జస్టిస్ రంజన్‌గొగోయ్ వ్యాఖ్య
- ఘనంగా బెజవాడ బార్ అసోసియేషన్ 111వ వార్షికోత్సవం

ఈనాడు డిజిటల్ - విజయవాడ



సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎన్వీ రమణలను సన్మానిస్తున్న బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు

న్యాయవాదులు సామాజిక ఇంజినీర్లని, సమసమాజ స్థాపనలో వారి పాత్ర కీలకమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్ పేర్కొన్నారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన బెజవాడ బార్ అసోసియేషన్ 111వ వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్య పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనుభవం, నైపుణ్యం కలిగిన న్యాయవాదులను న్యాయమూర్తులుగా నియమించడానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, హైకోర్టు న్యాయమూర్తులు, ఏపీ న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థకు బార్, బెంచ్ రెండు కళ్లు: "న్యాయవాదులు (బార్), (న్యాయమూర్తులు) బెంచ్.. న్యాయవ్యవస్థకు రెండు కళ్లు వంటి వారు. ప్రజలకు న్యాయం చేసే అదృష్టం మొదట న్యాయవాదులకే వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని బాధ్యతలు నిర్వర్తించాలి. కక్షిదారుకి న్యాయం జరగడం ఆలస్యమైతే ఇబ్బందులు తప్పవు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ఉన్న తరుణంలో బెంచ్, బార్ కలిసికట్టుగా ఒక సమర్థ న్యాయవ్యవస్థను నెలకొల్పేందుకు కృషి చేయాలి. సామాజిక వివాదాలు తలెత్తినప్పుడు బెజవాడ బార్ అసోసియేషన్ మంచి పాత్ర పోషించింది" అని జస్టిస్ రంజన్‌గొగోయ్ ప్రశంసించారు.

గర్వంగా ఉంది.. జస్టిస్ ఎన్వీ రమణ: బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఒకప్పుడు సభ్యుడినైనందుకు గర్వంగా ఉందని జస్టిస్ ఎన్వీ రమణ చెప్పారు. డబ్బు లేని కారణంగా ఎవరికీ అన్యాయం జరగకూడదని, పేదలకు న్యాయం చేసేందుకు న్యాయవాదులు అండగా నిలవాలని సూచించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ చాలా ఇబ్బందులకు గురైందని, రాష్ట్రానికి అండగా నిలవడంలో చొరవచూపాలన్నారు. వీలైనంత త్వరగా ఏపీలో హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. "నేను ఎక్కడ సమావేశంలో పాల్గొన్నా కొంచెమైనా తెలుగులో మాట్లాడటం అలవాటు. కోర్టుల్లోనూ న్యాయపాలన మాతృభాషలో జరగాలనేది నా కోరిక. కోర్టుల్లో జరిగే వాదనలు కక్షిదారులకు తెలియాలంటే మాతృభాషలోనే మాట్లాడాలనేది నా అభిప్రాయం. కనీసం జిల్లా, తాలూకా కోర్టుల్లోనైనా తెలుగులో వాదనలు జరిగితే బాగుంటుంది" అని జస్టిస్ రమణ వివరించారు. జాతీయ వినియోగదారుల కమిషన్ బెంచ్‌ను విజయవాడలో స్థాపించమని సుప్రీంకోర్టు కమిటీకి సూచించినట్లు తెలిపారు. రాజధానిలో నెలకొల్పాల్సిన న్యాయ సంస్థలు, ట్రైబ్యునళ్ల వంటి వాటిని త్వరగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి రవీంద్రకు సూచించారు.

న్యాయవాదులకు సంక్షేమ పథకం.. కొల్లు రవీంద్ర: న్యాయవాదుల కోసం సంక్షేమ పథకాన్ని తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. చనిపోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న న్యాయవాదుల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. మానవ హక్కులను కాపాడేందుకు ఏర్పాటైన కమిటీల్లో ఎక్కువ కాలం సేవలందించిన వాటిలో దక్షిణ భారతదేశంలోనే బెజవాడ బార్ అసోసియేషన్ మొదటిదని కొనియాడారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రహ్మణ్యం, జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ శేషసాయి, జస్టిస్ సునీల్‌చౌదరి, జస్టిస్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని, విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చెన్నై తెదేపా విభాగం ఆధ్వర్యంలో వల్లువర్‌కొట్టం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కార్యకర్తలు —ఈనాడు, చెన్నై

ప్రధాని పదవిని దిగజార్చిన మోదీ

కాంగ్రెస్ ఎంపీ కేవీపీ సంచలన వ్యాఖ్యలు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలపై మాట్లాడుతున్నానన్న కనీస స్పృహ లేకుండా ప్రధాని నరేంద్రమోదీ లోక్‌సభలో కాంగ్రెస్‌పై అసత్య విమర్శలు చేశారని ఎంపీ కేవీపీ రామచంద్రరావు విమర్శించారు. అబద్ధాలను పదేపదే చెప్పి నిజం చేయాలన్న మోదీ యత్నానికి జోహార్లు అర్పించవచ్చని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రధాని పదవిని దిగజార్చి మోదీ మాట్లాడారని ఆరోపించారు. 'నెహ్రూ ప్రధాని అయినప్పుడు దేశం గర్వించిందని, ఇందిరను తూలనాడడానికి నీకున్న అర్హతలేంటి? మిస్టర్ మోదీ' అని కేవీపీ ప్రశ్నించారు. మహాత్మాగాంధీని తెలివిగల గుజరాతీ బనియా అని సంబోధించే దుస్సాహసం ఆరెస్సెస్, భాజపాలకే ఉందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అప్పటి కాంగ్రెస్ అగ్రనేతలపై జాలి, కరుణ చూపిస్తున్న నరేంద్రమోదీ.. భాజపా అగ్రనేతలైన అడ్వాణీ, మురళీమోహన్‌జోషిలను తొక్కిపెడుతున్న విషయం అందరికీ తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఆదివారమిక్కడ కేవీపీ మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి అంజయ్య బీసీ అని, ప్రధాని మాత్రం ఎస్సీ అని సంబోధించారని పేర్కొన్నారు. అంజయ్య, పీవీ వంటి నేతలు ఉన్నత పదవులు అలంకరించడానికి కాంగ్రెస్ పార్టీ చలవే కారణమని పేర్కొన్నారు. ఏపీ భాజపా అధ్యక్షుడు హరిబాబు ఇచ్చిన 27పేజీల నివేదికలో విభజన హామీలు ప్రస్తావించారని, అందులో పది శాతం అమలైౖ ఉన్నా సంతోషమేనని కేవీపీ చెప్పారు. విభజన విషయంలో కాంగ్రెస్‌కన్నా భాజపానే పెద్ద పాత్ర పోషించిందని వివరించారు. బిల్లు పాస్ చేయించొద్దని, ఆంధ్ర ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని చెప్పినా భాజపా పట్టించుకోలేదని తెలిపారు.

ఆ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం: రఘువీరారెడ్డి

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంలో పార్లమెంటులో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం, ఏపీ విభజనపై చేసిన వ్యాఖ్యలపై ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానికి బహిరంగ లేఖ రాసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. "నవభారత నిర్మాణానికి పునాదులు వేసిన దార్శనికుడు జవహర్‌లాల్ నెహ్రూ త్యాగాలను అవమానించే విధంగా మీరు చేసిన వ్యాఖ్యలు యావత్ భారత స్వాతంత్ర్య పోరాటాన్ని, నాటి మహనీయుల త్యాగాలను అవమానించినట్లుగా దేశం భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు తలుపులు వేసి ఆంధ్రప్రదేశ్ విభజన చేసిందని విమర్శించారు. ఏదైనా బిల్లుపై పార్లమెంటులో ఓటింగ్ జరిగినప్పుడు తలుపులు మూస్తారా? లేక తెరుస్తారా? సమాధానం చెప్పాలి. తిరుపతి ఎన్నికల సభలో దిల్లీని మించిన రాజధానిని నిర్మించి ఇస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం చట్టంలో చెప్పిన దానికంటే ఎక్కువే ఇస్తామని గెలిపించమని కోరారా? లేదా? ఆంధ్రప్రదేశ్ చట్టబద్ధమైన ప్రయోజనాలను నెరవేర్చకుండా రాష్ట్ర ఆత్మగౌరవం గురించి మాట్లాడటం మీ వంచన కాదా?" అని రఘువీరా ప్రశ్నించారు.

భాజపా ఎంపీలు రాజీనామా చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, నాటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు పూటకోమాట చెప్పి, అమలుకు నోచుకోని ప్రకటనలతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10ఏళ్ల పాటు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని, దానికి నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్రం నుంచి గెలిచిన ఇద్దరు భాజపా ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు భాజపా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కె.హరిబాబుకు బహిరంగ లేఖ రాసినట్టు రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

సామాన్యుల భాషలో సాహిత్యం రావాలి

- తెలుగు భాషా బ్రహ్మోత్సవాల్లో సాహితీవేత్తల సూచన

ఘంటసాల, నాగాయలంక, న్యూస్‌టుడే: సామాన్యుడికి అర్థమయ్యే భాషలో సాహిత్యం వచ్చినప్పుడే నేటి యువతీ యువకులు తెలుగు సాహిత్యం వైపు ఆకర్షితులవుతారని రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ జి.భవానీప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయ మహోత్సవాలు, తెలుగు భాషా బ్రహ్మోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.భవానీప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాష పునరుజ్జీవం కోసం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందర్నీ ఒకటిగా చేసిన ఘనత మండలి బుద్ధప్రసాద్‌కు దక్కుతుందన్నారు. నేడు అనేక దేశాల్లో తెలుగు సంఘాలు ఏర్పడడంలో ప్రధాన పాత్ర పోషించింది మాజీ మంత్రి దివంగత మండలి వెంకటకృష్ణారావు అని కొనియాడారు. సాహిత్యాన్ని పామరుడు సైతం ఆస్వాదించగలిగేలా రాయడం ద్వారా తెలుగు సాహిత్యం పది కాలాలపాటు నిలిచి ఉండే అవకాశం ఏర్పడుతుందన్నారు. మహాకవి శ్రీశ్రీ పామరుడికి సైతం అర్థమయ్యేలా కవిత్వాన్ని రాసినందునే.. ఆయన నేటికీ జనం గుండెల్లో ఉన్నారని చెప్పారు. శ్రీశ్రీ తర్వాత నేటి తరంలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ చేస్తున్న కృషిని జస్టిస్ భవానీప్రసాద్ అభినందించారు.



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న జస్టిస్ జి.భవానీప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ తదితరులు

పాఠశాల స్థాయిలో నిర్లక్ష్యమే దురవస్థకు కారణం



సదస్సులో మాట్లాడుతున్న ఈనాడు జర్నలిజం స్కూల్ ప్రిన్సిపల్ ఎం.నాగేశ్వరరావు

పాఠశాల స్థాయిలో తెలుగును నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రస్తుతం తెలుగు భాష దురవస్థను ఎదుర్కొంటోందని ఈనాడు జర్నలిజం స్కూల్ ప్రిన్సిపల్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించి మాతృభాషలో బోధన సాగేలా చొరవ చూపాలన్నారు. తెలుగు భాషా బ్రహ్మోత్సవాల్లో కొనసాగుతున్న సాహిత్య సదస్సుల్లో భాగంగా 'ప్రసార మాధ్యమాలు - భాషాభివృద్ధి' అనే అంశంపై ప్రణాళికాసంఘం సభ్యుడు పెద్ది రామారావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలుగులో ప్రావీణ్యం పొందేలా ప్రభుత్వం వ్యవస్థాగతంగా ఒక నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. భాషాభివృద్ధిలో ప్రసార మాధ్యమాల పాత్రపై మాట్లాడుతూ సామాన్యుడికి అర్థంకాని పరిస్థితుల్లోని గ్రాంథిక భాష నుంచి పత్రికా రంగంలో వ్యవహారిక భాషను తీసుకువచ్చేందుకు ప్రాంతీయ భాషా పత్రికలు చూపిన చొరవను సోదాహరణంగా తెలిపారు. కేవలం తెలుగు పదాలను మాత్రమే వాడేందుకు ఉన్న అవకాశాలపై తెలుగు పత్రికలు చేస్తున్న కృషిని ఆయన ప్రస్తావిస్తూ, ఈ విషయంలో 'ఈనాడు' సాధించిన పురోగతిని వివరించారు. ప్రాంతాలవారీగా, మాండలికాల పరంగా పదాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించి పదాలకు ఏకరూపత తీసుకురావడానికి పత్రికలు విశేష కృషి చేస్తూనే ఉన్నాయన్నారు. ప్రాంతాలవారీగా మాతృభాష మూలాల్లోకి వెళ్లినప్పుడే పదాల వాస్తవరూపం తెలుస్తుందని.. అందుకు ప్రభుత్వపరంగా ఒక వ్యవస్థ ఏర్పాటై పరిశోధనలు చేయడంతోపాటు పదనిధిని ఏర్పాటు చేయాలని నాగేశ్వరరావు సూచించారు. శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాషా సంస్కృతుల పునరుజ్జీవం కోసం సాహితీవేత్తలు, భాషా ప్రేమికులు కలిసి రావాలన్నారు. మంచి సాహిత్యం ప్రజలకు అందుబాటులోకి రావాలని, అందుకు సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు గ్రంథాలను అతిథులు ఆవిష్కరించారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, ఆయన తండ్రి సత్యనారాయణ మూర్తి, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో విష్ణువర్ధన్ తదితరులు ప్రసంగించారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీ కొనకళ్ల నారాయణ, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

5 వరకు వేచి చూస్తాం

- ఆలోపు విభజన హామీలపై సానుకూల స్పందన రాకుంటే గట్టి నిర్ణయమే..
- ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వ్యాఖ్యలు

రాజానగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలనే తాము కోరుతున్నామని వచ్చే నెల 5లోపు కేంద్రం ప్రత్యేక ప్యాకేజీపై నిర్ణయం ప్రతిస్తుందని ఆశిస్తున్నామని, దీనిపై నాలుగైదు రోజుల్లో సానుకూల ప్రకటన రాకుంటే ముఖ్యమంత్రి తీవ్ర నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి కేఈ.కృష్ణమూర్తి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో విలేకరులతో మాట్లాడారు. ఇన్నాళ్లూ మిత్ర ధర్మం పాటించి సంయమనంతో ఆశగా ఎదురు చూశామని, ఆఖరి బడ్జెట్‌లో కూడా కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపుతుండడంతో ఆశలు ఆవిరయ్యాయన్నారు. 42శాతం నిధులు కేంద్రం ప్రతి రాష్ట్రానికి సాధారణంగా మంజూరు చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అలాగే ఇచ్చిందన్నారు. వాటిని కూడా ప్రత్యేక ప్యాకేజీలో కలిపేసి చూపుతోందన్నారు. రాయలసీమ జిల్లాలకు, మూడు ఉత్తరాంధ్ర జిల్లాలకు ఒక్కో దానికి రూ.50 కోట్ల వంతున రూ.350 కోట్లు కేంద్రం మూడు సంవత్సరాలుగా మంజూరు చేసిందన్నారు. రెండేళ్లుగా అవి కూడా మంజూరు చేయడం లేదన్నారు. రెవెన్యూలోటు రూ.16వేలకోట్లు అని కాగ్ లెక్కలు తేల్చాయన్నారు. కేంద్రం మాత్రం ఇప్పటివరకు రూ.3,800 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. కేంద్రం తమను మిత్ర పక్షంగా చూసినంతకాలం ఓర్పుతో వేచి చూస్తామని, తమను బయటకు గెంటేస్తే నమస్కారం పెడతాం తప్ప చేయగలిగింది ఏదీ లేదన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మురళీమోహన్, ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పాల్గొన్నారు.

స్పందించకుంటే యుద్ధమే

- పోరాటాలకు సిద్ధం కావాలి
- కేంద్రంతో వైకాపా చేతులు కలపాలని చూస్తోంది..
- కార్యకర్తల సమావేశంలో గుంటూరు ఎంపీ జయదేవ్





గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన అభినందన సభ అనంతరం బృందావన్ గార్డెన్స్‌లోని నివాసానికి చేరుకున్న ఎంపీ గల్లా జయదేవ్‌ను ఆప్యాయంగా ముద్దాడుతున్న మాతృమూర్తి గల్లా అరుణకుమారి ■ అభినందన సభలో తెలుగు యువత నాయకులు బహూకరించిన కత్తి దూస్తున్న ఎంపీ జయదేవ్

ఈనాడు, గుంటూరు: 'విభజన చట్టంలో పేర్కొన్నట్టు రాష్ట్రానికి సాయం చేయాలని భాగస్వామ్య పక్షంగా కేంద్రాన్ని కోరుతున్నాం. ఇలా అడగటం ఆంధ్రుల అమాయకత్వం అనుకోవద్దు. ఐదు రోజులుగా పార్లమెంటులో చేసిన ఆందోళనలు ఆరంభం మాత్రమే. వాటికి స్పందిస్తే సరి.. లేదంటే యుద్ధానికి సన్నద్ధం కావాలని' తెదేపా కార్యకర్తలు, ప్రజలకు గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో తెలుగువారి గోడును తనదైన శైలిలో వినిపించాక ఆదివారం తన నియోజకవర్గమైన గుంటూరుకు వచ్చిన జయదేవ్‌కు తెదేపా కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆయన్ని ఉండవల్లిలోని సీఎం నివాసం నుంచి గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయానికి ర్యాలీగా తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో జయదేవ్ మాట్లాడుతూ.. దిల్లీలోనే కాదు.. ఎక్కడైనా రాష్ట్రానికి, గుంటూరు ప్రజలకు జరిగే అన్యాయంపై తాను తన గొంతుక వినిపించటానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. దీనికి మీ సహాయసహకారాలు కావాలని కోరారు. బలమైన ప్రధానిగా చెప్పుకొంటున్న మోదీ వ్యక్తిగత బాధ్యతగా తీసుకుని రాష్ట్రాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 'ఐదు విద్యాసంస్థలకు రూ.10-15 కోట్ల చొప్పున కేటాయించారు. ఈ కేటాయింపులను చూస్తే అవి పూర్తవటానికి కనీసం పది నుంచి 30 ఏళ్లు పడుతుం'దని గుర్తు చేశారు. 'పార్లమెంటులో ప్రధాని ప్రసంగించేటప్పుడు భాగస్వామ్యపక్షంగా ఉంటూ ఆందోళన చేయకూడదని, ఆయన ప్రసంగం ద్వారా రాష్ట్రానికి ఏమైనా న్యాయం జరుగుతుందేమోనన్న ఆశతో మా సీట్లలో కూర్చున్నాం. వైకాపా మిత్రపక్షం కాదు. ఆ పార్టీ ఎంపీలు కనీసం ఆందోళన చేయలేదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విషయంలో వారు గోడ మీది పిల్లివాటంలా ఎందుకు వ్యవహరిస్తున్నారు? మీ వ్యవహారం చూస్తుంటే భాజపాతో చేతులు కలిపేలా ఉన్నారని భావించాల్సి వస్తుందని' ఆయన ఆ పార్టీ తీరును దుయ్యబట్టారు. రాష్ట్ర మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. భాజపా నాయకులు ఎన్నికల రాజకీయాలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ రామకృష్ణ, నాయకుడు మన్నవ సుబ్బారావు పాల్గొన్నారు.

మిగులు విద్యుత్ ఘనత ఎన్డీఏదే

- ఏపీ అభివృద్ధికి మోదీ సర్కారు చర్యలు
- కేంద్ర విద్యుత్ శాఖ సహాయమంత్రి ఆర్కే సింగ్



మచిలీపట్నం - న్యూస్‌టుడే: దేశంలో మిగులు విద్యుత్ సాధించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానిదేనని కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి ఆర్కే సింగ్ అన్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి దేశంలో విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలు 18,400 ఉండగా.. మూడేళ్ల వ్యవధిలో 16,500 గ్రామాలకు విద్యుత్ వసతి కల్పించామని చెప్పారు. మహిళా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉజ్వల పథకం ద్వారా 8 కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఆదివారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన భాజపా బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆర్కే సింగ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, విభజన చట్టంలోని అంశాలను చాలా వరకూ నెరవేర్చారని, మిగిలిన హామీలను కూడా త్వరలోనే అమలుపర్చేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. కేంద్రం నుంచి గతంలో ఏ రాష్ట్రం పొందనంత సాయం ఏపీకి సమకూరుతోందని పేర్కొన్నారు.

ఆ ప్రకటనకు కట్టుబడి ఉన్నా: హరిబాబు

సమావేశంలో పాల్గొన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం అందించిన సాయం గురించి తాను దిల్లీలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నానని, గణాంకాలతో సహా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కేవలం రాజకీయ లబ్ధికోసం వైకాపా, కాంగ్రెస్, వామపక్షాలు బంద్ చేయడం విచారకరమని విమర్శించారు. మచిలీపట్నం వచ్చిన కేంద్ర మంత్రికి నల్లజెండాలతో నిరసన తెలపాలని ప్రయత్నం చేసిన వైకాపా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య, వైకాపా కార్యకర్తలతో పాటు కొందరు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నిధుల లెక్కలిస్తే.. నిజం తేలుస్తాం: పవన్ కల్యాణ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం ఎన్ని నిధులిచ్చింది, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఖర్చు పెట్టిందీ ఈ నెల 15లోగా లెక్క చెప్పాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. నిధులు, ఖర్చులతో నివేదిక ఇస్తే ఐక్య నిజ నిర్ధారణ కమిటీకి అప్పగించి అసలు దోషి ఎవరనేది తేలుస్తామని చెప్పారు. నివేదిక ఇవ్వడానికి నిరాకరిస్తే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఇది తిరుగుబాటు కాదని, ప్రజలకు న్యాయం జరగడం కోసం చేసే ప్రయత్నమని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో ఆదివారం ఉదయం జనసేన పరిపాలన కార్యాలయంలో గంటన్నరపాటు పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. అనంతరం వారిద్దరూ విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. పవన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మేలు జరుగుతుందనే 2014 ఎన్నికల్లో జనసేన పార్టీ మద్దతునిచ్చి భాజపా, తెదేపాల విజయానికి కృషి చేసిందన్నారు. ప్రత్యేక హోదా విషయంలో అందరిలానే తనలోనూ అసంతృప్తి ఉందన్నారు. తనను రాజకీయాల్లోకి రమ్మని ఎవరూ ఆహ్వానించలేదని, ప్రజలకు న్యాయం చేయాలని వచ్చానని చెప్పారు. ఇప్పుడు న్యాయం చేయాల్సిన అవసరం వచ్చింది కాబట్టే రాజకీయ నాయకులు, మేధావులు, ఆర్థికవేత్తలతో కలిసి సంయుక్త నిజనిర్ధారణ కమిటీ (జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) ఏర్పాటు చేసినట్లు వివరించారు. కమిటీలో ఎవరెవరు ఉంటారో రెండు రోజుల్లో చెబుతానన్నారు. నిధులిచ్చామని కేంద్రం చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంలో రెండు ప్రభుత్వాలూ 15లోగా వివరాలు వెల్లడించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పోలవరంపై శ్వేతపత్రం అడిగితే వెబ్‌సైట్‌లో చూసుకోవాలంటూ సమాధానమిచ్చిందన్నారు. కానీ అలాంటి వెబ్‌సైట్ తన దృష్టికి రాలేదన్నారు. నాలుగేళ్ల తర్వాత తెదేపా ఇప్పుడు ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతోంది.. ఇన్నాళ్లూ ఎందుకు కాలయాపన చేసిందని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రి 19సార్లు ప్రధాని అపాయింట్‌మెంట్ కోరితే దొరక్కపోతే తనలాంటి వారికి ఎలా లభిస్తుందంటూ ప్రస్తావించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో మాజీ ఎంపీ అరుణ్‌కుమార్

పవన్ నిజమైన రాజకీయాలు మొదలుపెడుతున్నారు.. ఉండవల్లి: ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పవన్ నిజమైన రాజకీయాలు ఇప్పుడే మొదలుపెడుతున్నారని అన్నారు. ఇన్నాళ్లూ ప్రశ్నిస్తానన్న ఆయన ఇప్పుడు సమాధానం కోసం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రజల తరఫున పవన్ బాధ్యత వహిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు అబద్ధాలు ఆడవు.. అలాగని నిజం చెప్పవని వ్యాఖ్యానించారు. అదేంటో అర్థం కావాలంటే లెక్కలు ఇస్తే కమిటీ తేల్చి చెబుతుందన్నారు. పవన్ కల్యాణ్ తనతో రాజకీయాలు మాట్లాడలేదని అందువల్లనే తాను ఈ నిజనిర్ధారణ కమిటీలో ఉండటానికి ఇష్టపడినట్లు ఉండవల్లి తెలిపారు.

షరియా చట్టాలను పరిరక్షించుకుందాం


- బాబ్రీ మసీదు పునర్నిర్మాణానికి న్యాయపోరాటం
- తలాక్‌పై బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ప్రచారం
- ఏఐఎంపీఎల్‌బీ ప్లీనరీలో 'హైదరాబాద్ డిక్లరేషన్'



'హైదరాబాద్ డిక్లరేషన్'ను వెల్లడిస్తున్న ఆహ్వాన కమిటీ ఛైర్మన్ ఎంపీ అసదుద్దీన్, ఏఐఎంపీఎల్‌బీ ప్రముఖులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ ముస్లింలు అభద్రతాభావంలో ఉన్నారని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) 26వ ప్లీనరీ అభిప్రాయపడింది. ఇస్లామిక్ షరియా చట్టాల్లోని కొన్ని అంశాలను మార్చే ప్రయత్నం జరుగుతోందని పేర్కొంది. బాబ్రీ మసీదు పునర్నిర్మాణానికి న్యాయ పోరాటం చేస్తామని స్పష్టంచేసింది. రాజ్యసభలో ముమ్మారు తలాక్‌పై బిల్లును నిలిపివేసేలా ప్రతిపక్ష పార్టీలను సమన్వయం చేయాలని బోర్డు నిర్ణయించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రచారం చేపట్టాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో ఈ నెల 9 నుంచి కొనసాగుతున్న ఏఐఎంపీఎల్‌బీ ప్లీనరీ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీ, ప్లీనరీ ఆహ్వాన కమిటీ ఛైర్మన్ అసదుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన 'హైదరాబాద్ డిక్లరేషన్'ను వెల్లడించారు. షరియా చట్టాల పరిరక్షణ కోసం నిరంతరం కృషి కొనసాగేలా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్లీనరీలో చర్చించిన అంశాలతోపాటు భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలను పాత్రికేయుల సమావేశంలో ఏఐఎంపీఎల్‌బీ ప్రధాన కార్యదర్శి మౌలానా ఖాలేద్ సైఫుల్లా రహ్మానీ వెల్లడించారు. బాబ్రీ మసీదు శాశ్వతంగా మసీదుగానే ఉండనుందని.. ఆ స్థలాన్ని ఇచ్చేసి మరోచోట స్థలాన్ని తీసుకునేదిలేదని ప్లీనరీ స్పష్టంచేసింది. ఏఐఎంపీఎల్‌బీ ప్రారంభించిన సంస్కరణల ఉద్యమానికి ప్లీనరీ మద్దతు పలికింది. సెంట్రల్‌బాడీ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీల ఏర్పాటును అంగీకరించింది. ముస్లిం మహిళలు విడాకులు తీసుకున్నా, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని, అందుకోసం అన్ని చర్యలు తీసుకుంటామని ప్రతినిధులు చెప్పారు. బాబ్రీ మసీదును అయోధ్య నుంచి తరలించాలంటూ వ్యాఖ్యలు చేసిన బోర్డు కార్యనిర్వాహక సభ్యుడు సల్మాన్ నద్వీపై బహిష్కరణ వేటు వేసినట్లు తెలిపారు.

33482 కిందకు వస్తే 32415కు



సమీక్ష: అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతల ప్రభావంతో గతవారం మన మార్కెట్ భారీ నష్టాలను మూటకట్టుకుంది. దిగ్గజ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైనప్పటికీ.. మధ్య, చిన్న తరహా సంస్థల షేర్లకు దేశీయ సంస్థాగత మదుపర్ల (డీఐఐలు) నుంచి కొనుగోళ్ల మద్దతు లభించింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడం, బాండ్ల ప్రతిఫలాలు నాలుగేళ్ల గరిష్ఠానికి చేరడం ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపడంతో మన మార్కెట్ కూడా వారాన్ని భారీ నష్టాలతో ఆరంభించింది. సేవా రంగ పీఎంఐ గణాంకాలు, కార్పొరేట్ కంపెనీల ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ అవేమీ మదుపర్లు పట్టించుకోలేదు. ఆర్‌బీఐ కీలక రేట్లను యథాతథంగా ఉంచడం, వృద్ధి రేటు అంచనాలను తగ్గించడం, ద్రవ్యోల్బణం పెరగొచ్చని చెప్పడం లాంటివి మార్కెట్ నష్టాలను మరింత పెంచాయి. వారంలో తొలి రెండు రోజులు మధ్య, చిన్న తరహా షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యింది. అనంతరం కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇవి పుంజుకున్నాయి. మరోవైపు ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఐటీ రంగంలో ప్రధాన షేర్లకు అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. రూపాయి బలపడటం, చమురు ధరలు క్షీణించడం లాంటివి కొంతలో కొంత ఊరటనిచ్చినప్పటికీ మార్కెట్‌కు మాత్రం నష్టాలు కొనసాగాయి. దీంతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 1061 పాయింట్లు పతనమై 34005 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 306 పాయింట్ల నష్టంతో 10454 వద్ద స్థిరపడింది. డీఐఐలు/ ఫండ్లు నికరంగా రూ. 6,287 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. ఎఫ్ఐఐలు నికర విక్రయాలు రూ. 8,261 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదుకావడం.. మార్కెట్లో అనిశ్చితి వాతావరణాన్ని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } సెన్సెక్స్ ఒకవేళ 33482 దిగువకు వస్తే మరింత దిద్దుబాటుకు లోనై 200 రోజుల చలన సగటైన 32415 స్థాయికి పడిపోవచ్చు. సూచీ పుంజుకున్నప్పటికీ 34875-35166 శ్రేణిలో నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది.


ప్రభావిత అంశాలు } మంగళవారం శివరాత్రి సందర్భంగా సెలవు కావడంతో ఈవారం నాలుగు రోజుల పాటే మార్కెట్ పనిచేస్తుంది. ఈవారం ప్రధానంగా విదేశీ మార్కెట్ల కదలికలు మన మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెరగడంపై నెలకొన్న ఆందోళన ప్రభావం ప్రపంచ మార్కెట్లపై కొనసాగొచ్చు. నేడు వెలువడే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ), రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల ప్రభావం మార్కెట్‌పై ఉంటుంది. 14న వెల్లడయ్యే టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ (డబ్ల్యూపీఐ) గణాంకాలూ కీలకమే. ఈవారం బ్రిటానియా, క్రిసిల్, జీఎస్ఎఫ్‌సీ, ఇండియన్ బ్యాంక్, ఎన్ఎమ్‌డీసీ లాంటి ప్రధాన కంపెనీలు ఫలితాలను ప్రకటించనున్నాయి. ఈ ఫలితాల ఆధారంగా ఆయా రంగాలు, కంపెనీల షేర్లు కదలాడే అవకాశం ఉంది. ముడి చమురు ధరల పైనా మదుపర్లు దృష్టి సారిస్తారు. జపాన్ నాలుగో త్రైమాసిక జీడీపీ, అమెరికా ద్రవ్యోల్బణం (14న) గణాంకాలను కూడా గమనిస్తారు. ఎఫ్ఐఐలు, డీఐఐల క్రయవిక్రయాలు, రూపాయి కదలికల ప్రభావం కూడా మార్కెట్‌పై ఉంటుంది.

తక్షణ మద్దతు స్థాయిలు: 33482, 32886, 32415; **తక్షణ నిరోధం స్థాయిలు:** 34521, 34875, 35166

సెన్సెక్స్ పుంజుకున్నప్పటికీ 34875- 35166 శ్రేణిలో నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ





కోడిగుడ్లు

11న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	361	వరంగల్	363
చిల్లరగా (ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	360
బెంగళూరు	372	చెన్నై	385
12వ తేదీకి		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	353	నమక్కల్	370

సామాన్యులకు అందుబాటులో

బీమా పాలసీలుండాలి

- పంటల బీమాకు ప్రాధాన్యం పెంచాలి
- అంతర్జాతీయ బీమా సదస్సులో ఉపరాష్ట్రపతి

ఈనాడు – హైదరాబాద్

దేశంలో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. బీమా నియంత్రణ మండలి, బీమా సంస్థలు పంటల బీమాపై దృష్టి సారించి, వ్యవసాయ రంగ వృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన ఆరోగ్య పథకం ద్వారా దాదాపు 50 కోట్ల మందికి ప్రయోజనం చేకూరబోతోందని, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాసియా దేశాల నాలుగో అంతర్జాతీయ బీమా సదస్సు ముగింపు కార్యక్రమంలో వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. నానక్‌రాంగూడ ఆర్థిక జిల్లాలో రూ. 165. 73కోట్లతో నిర్మించిన భారతీయ బీమా అభివృద్ధి, నియంత్రణ మండలి (ఐఆర్‌డీఏఐ) ప్రధాన కార్యాలయాన్ని ఉపరాష్ట్రపతి జాతికి అంకితం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 'పంట నష్టం, అనారోగ్యం, ఆర్థిక అత్యవసరం.. ఇలా ఏదైనా సరే.. బీమా అనేది ముఖ్యమైన అవసరంగా మారింది. పాలసీదారులు పెరుగుతుంటే.. బీమా ప్రీమియం తగ్గుతుంది. పాలసీదారులకు రక్షణ కల్పించడం, పారదర్శకత పెంచడం లాంటి విషయాల్లో నియంత్రణ సంస్థల అవసరం ఎంతైనా ఉంది. సామాన్యులకు అవసరమైన, అందుబాటు ధరలో పాలసీలు తీసుకొచ్చేందుకు బీమా సంస్థలు ప్రయత్నించాలి' అని సూచించారు. 'దిగుమతుల మీద ఆధారపడకుండా ఆహార భద్రత సాధించేందుకు వ్యవసాయానికి అధిక ప్రోత్సాహం ఇవ్వాలి. పంట నష్టం వాటిల్లినప్పుడు ఆర్థిక రక్షణ కల్పించడం బీమా కంపెనీలకు ప్రధాన లక్ష్యం కావాలి' అని వివరించారు. సమాచార భద్రత ముఖ్యమైనందున సైబర్ బీమా పాలసీలనూ విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ 2.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరడం, సులువుగా వ్యాపార నిర్వహణలో మెరుగైన ర్యాంకు, తక్కువ ద్రవ్యోల్బణం, విదేశీ పెట్టుబడులు పెరగడం లాంటివి మన దేశంలో ఆర్థిక వృద్ధిని సూచిస్తున్నాయని ఉపరాష్ట్రపతి వివరించారు. బీమా సంస్థలు దాదాపు రూ. 30,76,537 కోట్లను వివిధ పథకాల్లో పెట్టుబడులు పెట్టాయనీ, ఇందులో రూ. 2,40,000 కోట్ల మేరకు మౌలిక సదుపాయాల్లోనే ఉన్నాయన్నారు. భారతీయ బీమా రంగం 2020నాటికి 280 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనాలున్నాయని, ఎఫ్‌డీఐలు, ప్రభుత్వ పథకాలు ఇందుకు దోహదం చేస్తాయని భావించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఐఆర్‌డీఏ ఛైర్మన్ టీఎస్ విజయన్, మాజీ ఛైర్మన్ జె. హరినారాయణ్, ఐఆర్‌డీఏ సభ్యుడు నీలేశ్ సాథే వివిధ దేశాల నుంచి వచ్చిన బీమా రంగం ప్రతినిధులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన దక్షిణాసియా నాలుగో అంతర్జాతీయ బీమా సదస్సు ముగింపు వేడుకలో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు. చిత్రంలో ఐఆర్‌డీఏ సభ్యుడు నీలేశ్ సాథే, ఐఆర్‌డీఏ ఛైర్మన్ టీఎస్ విజయన్

ఈ ఏడాది నియామకాలు బాగుంటాయ్

- ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాల్లో అధిక అవకాశాలు
- 10-15 శాతం వృద్ధి: ఇండియా స్కిల్స్ నివేదిక

దిల్లీ: గత ఏడాదితో పోలిస్తే 2018లో కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ నియామకాలు మెరుగ్గా ఉంటాయని, 10-15% పెరగొచ్చని ఇండియా స్కిల్స్ నివేదిక పేర్కొంది. మానవ వనరుల సాంకేతిక సొల్యూషన్ల, నైపుణ్య అంచనా సంస్థలైన పీపుల్ స్ట్రాంగ్, వీబాక్స్, పియర్‌సన్, సీఐఐ, ఏఐసీటీఈ, ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం, ఏఐయూ (అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్) సంయుక్తంగా నిర్వహించిన సర్వే ద్వారా సేకరించిన సమాచారంతో, ఈ నివేదిక రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. దేశవ్యాప్తంగా నియామకాలు చేపట్టడానికి 5,10,000 మంది విద్యార్థుల చెంతకు వెళ్లిన 120కి పైగా సంస్థల నిర్వాహకుల నుంచి సేకరించిన సమాచారాన్ని ఇందుకు వినియోగించినట్లు పేర్కొంది.

ఉపాధి అవకాశాలు 45.6 శాతానికి చేరాయని, గడిచిన అయిదేళ్లలో ఇది రికార్డు స్థాయి అని నివేదిక తెలిపింది. అధిక ఉపాధి అవకాశాలు ఉన్న తొలి పది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, దిల్లీ, గుజరాత్ రాష్ట్రాలు చోటు దక్కించుకున్నాయని వెల్లడించింది. ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో బెంగళూరు నగరం తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోందని, తరవాత స్థానాల్లో చెన్నై, ఇండోర్, లఖ్‌నవూ, ముంబయి, నాగ్‌పూర్, తిరుచ్చిలు ఉన్నాయని తెలిపింది. 18-25 ఏళ్ల మధ్య 46 శాతం, 26-29 ఏళ్ల మధ్య 26 శాతం మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని వెల్లడించింది. మొత్తమ్మీద 2017 నాటి 40.44 శాతంతో పోలిస్తే, ఈ ఏడాది ఉపాధి అవకాశాలు 45.60 శాతానికి పెరిగాయని తెలిపింది.

రూ.20,000 కోట్ల మొండి బకాయిల రద్దు

2016-17లో ఎస్‌బీఐ నిర్ణయం

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో (2016-17) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ. 20,339 కోట్ల విలువైన మొండి బకాయిలను సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ (పీఎస్‌బీలు) కలిపి రద్దు చేసిన రుణాల మొత్తం రూ. 81,683 కోట్లు కాగా.. ఇందులో ఎస్‌బీఐ వాటాయే అధికం. ఈ గణాంకాలు ఎస్‌బీఐలో అనుబంధ బ్యాంకుల విలీనం కాకముందు కాలానివి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2012-13లో పీఎస్‌బీలన్నీ సాంకేతికంగా రద్దు చేసిన మొండి బకాయిల విలువ రూ. 27,231 కోట్లు. అయిదేళ్లలో ఈ విలువ మూడు రెట్లు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (సెప్టెంబరు వరకు) పీఎస్‌బీలు రూ. 53,625 కోట్ల విలువైన రుణాలను సాంకేతికంగా రద్దు చేశాయి.



పీఎస్‌బీలు రద్దు చేసిన రుణాలు (రూ.కోట్లలో)

2012-13	27,231
2013-14	34,409
2014-15	49,018
2015-16	57,585
2016-17	81,683

2016-17లో ఇలా.. (రూ.కోట్లలో)

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	20,339
పంజాబ్ నేషనల్ బ్యాంక్	9,205
బ్యాంక్ ఆఫ్ ఇండియా	7,346
కెనరా బ్యాంక్	5,545
బ్యాంక్ ఆఫ్ బరోడా	4,348

నేటి బోర్డు సమావేశాలు

★ బ్రిటానియా ★ గెయిల్ ★ బీఓఐ ★ ఇండియన్ బ్యాంక్ ★ జేకే టైర్ ★ మధుకాన్ ★ ఎంఎంటీసీ ★ ఎన్‌హెచ్‌పీసీ ★ పీఎఫ్‌సీ

ముంబయి సంపద రూ.62 లక్షల కోట్లు!

ప్రపంచవ్యాప్తంగా ధనిక నగరాల్లో 12వ స్థానం



దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంపన్న నగరాల్లో, దేశ ఆర్థిక రాజధాని ముంబయి చోటు సాధించింది. నగరంలోని మొత్తం సంపద దాదాపు రూ. 61.75 లక్షల కోట్లు ఉంటుందని న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 15 ధనిక నగరాల్లో ముంబయికి 12వ స్థానం దక్కింది. న్యూయార్క్ (రూ. 195 లక్షల కోట్లు) తొలి స్థానంలో నిలిచింది. టొరొంటో (రూ. 61.36 లక్షల కోట్లు), ఫ్రాంక్‌ఫర్ట్ (రూ. 59.28 లక్షల కోట్లు), పారిస్ (రూ. 55.90 లక్షల కోట్లు) నగరాలను తలదన్ని ముంబయి ముందు వరుసలో నిలిచింది. ప్రైవేటు వ్యక్తుల సంపదను మాత్రమే లెక్కలోకి తీసుకుని చేసిన సర్వే ఇది. కేవలం ఆ నగరంలో నివసించే వ్యక్తుల ఆస్తులు, నగదు, ఈక్విటీల విలువను లెక్కగట్టి, అందులోంచి అప్పులు తీసేసి విలువ గణించారు. బిలియనీర్లు ఎక్కువగా ఉన్న నగరాల్లోనూ తొలి పది స్థానాల్లో ముంబయి నిలిచింది. ఇక్కడ 28 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక తెలిపింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ముంబయి ఒకటని, రాబోయే పదేళ్లలో ఇక్కడ మరింతగా సంపద పెరుగుతుందని న్యూ వరల్డ్ వెల్త్ నివేదిక తెలిపింది.

పసిడికి ఒత్తిడి!

కమొడిటీస్ ఈ వారం




బంగారం, వెండి: పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు గతవారం రూ. 30,420 వద్ద ప్రారంభమైంది. అనంతరం కొనుగోళ్ల మద్దతుతో రూ. 30,713కి చేరింది. స్టాక్ మార్కెట్ల పతనం ప్రభావంతో పసిడి కాంట్రాక్టులోనూ దిద్దుబాటు చోటుచేసుకుంది. దీంతో రూ. 29,805 స్థాయికి కాంట్రాక్టు పడిపోయింది. వారం చివర్లో స్వల్పంగా పుంజుకున్నప్పటికీ 1.33% నష్టంతో రూ. 30,015 వద్ద స్థిరపడింది. ఈవారం అమెరికా వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణ గణాంకాలతో పాటు డాలరు సూచీపై ట్రేడర్లు ప్రధానంగా దృష్టి సారించాలి. సాంకేతికంగా చూస్తే స్వల్పకాలంలో పసిడి కాంట్రాక్టు మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. అందువల్ల షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించడం మంచిది. కిందటి వారం రూ. 38,480 వద్ద సానుకూలంగా ప్రారంభమైన వెండి మార్చి కాంట్రాక్టు ఆ తర్వాత రూ. 39,114 వరకు వెళ్లింది. అనంతరం అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో కీలక మద్దతు స్థాయైన రూ. 38,847కి దిగివచ్చింది. చివరకు 2.34% నష్టంతో రూ. 38,580 వద్ద ముగిసింది. ఈవారం రూ. 38,616 పైన కదలాడకుంటే.. ప్రతికూల ధోరణి కొనసాగొచ్చు. అయితే రూ. 37,058 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది.



ప్రాథమిక లోహాలు: రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ. 432 దిగువకు వస్తే రూ. 423.60కి పడిపోవచ్చు. అందువల్ల రూ. 442 ఎగువకు వెళ్లే వరకు లాంగ్ పొజిషన్ల జోలికి వెళ్లకపోవడమే మంచిది. సీసం ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ. 167 ఎగువకు వెళ్లకుంటే మరింత దిద్దుబాటుకు గురయి, రూ. 158.60 వరకు దిగిరావచ్చు. జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టుకు ఈవారం కూడా నష్టాలు కొనసాగే అవకాశం ఉన్నందున, షార్ట్ సెల్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు. అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టును అధిక స్థాయిల వద్ద షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహం అవుతుంది. నికెల్ ఫిబ్రవరి కాంట్రాక్టు రూ. 878.90 కింద చలిస్తే. షార్ట్ సెల్ చేయొచ్చు.



ఇంధన రంగం: ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు మరింత దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. షార్ట్ సెల్ పొజిషన్లు ఉంటే రూ. 3,662 స్థాయికి వచ్చాక లాభాలు స్వీకరించడం మంచిది. రూ. 3,997 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి. సహజ వాయువు ఫిబ్రవరి కాంట్రాక్టుకు రూ. 157.75 వరకు అమ్మకాల ఒత్తిడి కొనసాగొచ్చు.



వ్యవసాయ ఉత్పత్తులు: సెనగలు మార్చి కాంట్రాక్టును ఈవారం కొనుగోలు చేయడం మంచి వ్యూహమే అవుతుంది. ధనియాలు ఏప్రిల్ ఫ్యూచర్ కాంట్రాక్టుకు ఈవారం అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది.

–ఆర్ఎల్‌పీ కమొడిటీ & డెరివేటివ్స్

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (నవంబరు కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	452.70	433.30	(4.24)
సీసం (ఫిబ్రవరి)	171.20	163.60	(4.44)
జింక్ (ఫిబ్రవరి)	226.40	218.15	(3.64)
అల్యూమినియం(ఫిబ్రవరి)	141.25	137.05	(2.97)
నికెల్ (ఫిబ్రవరి)	861.20	834.90	(3.05)
ముడి చమురు (ఫిబ్రవరి)	4,166	3,797	(8.66)
సహజ వాయువు(ఫిబ్రవరి)	183.90	167.40	(8.97)
సెనగలు (మార్చి)	3,788	3,822	0.9
ధనియాలు (ఏప్రిల్)	5,860	5,695	(2.15)

అమెరికా సంకేతాలు కీలకం

- స్థూల ఆర్థిక గణాంకాల ప్రభావమూ
- వాహన, టెలికాం,లోహ షేర్లకు నష్టాలే
- ఐటీ, ఔషధ, బ్యాంకింగ్ షేర్లకు లాభాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం


దిల్లీ: అంతర్జాతీయ సంకేతాలతో పాటు పారిశ్రామికోత్పత్తి - ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ వారం స్టాక్‌మార్కెట్‌పై ప్రభావం చూపనున్నాయి. అమెరికా మార్కెట్ రికవరీ కావడం కలిసొస్తుందని, అయితే ఒడుదొడుకులకూ అవకాశం ఉందని డీలర్లు పేర్కొంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం సెలవు కావడంతో, ఈ వారంలో నాలుగు రోజులే ట్రేడింగ్ జరగనుంది. మూడో త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు మాత్రం, ఆర్థిక పునరుత్తేజాన్ని ప్రతిబింబిస్తున్నాయని, దీర్ఘకాలం వృద్ధి బాటలో సాగగలమనే సంకేతాలున్నాయని, మదుపుదార్లకు ఇది ఊరట కలిగించే అంశమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. గెయిల్, ఎన్‌హెచ్‌పీసీ వంటి దిగ్గజ సంస్థలు ఈవారంలో ఫలితాలు ప్రకటించనున్నాయి. శుక్ర, శనివారాల్లో ఫలితాలు వెల్లడించిన ఎస్‌బీఐ, కోల్‌ఇండియా షేర్లు ఈవారం వెలుగులోకి వస్తాయి. ఆయా రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..



ఇంధన: ప్రభుత్వరంగ రిఫైనరీ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) షేర్లు స్థిరీకరణకు గురికావవచ్చు. హెచ్‌పీసీఎల్ త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించగా, ఓఎన్‌జీసీ, బీపీసీఎల్ అందుకోలేకపోయాయి. మార్కెట్ చలనానికి తోడు ముడిచమురు ధరలు కూడా ప్రభావం చూపుతాయి.



వాహన: ఈ రంగ షేర్లు నష్టపోవచ్చు. మూడో త్రైమాసిక ఫలితాలు అంచనాలను అందుకోనందున టాటా మోటార్స్, మారుతీ సుజుకీ షేర్లు వాహన సూచీని కిందకు లాగొచ్చు. మార్జిన్, ఇతర అంశాల్లో ఐషర్ మోటార్స్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో కూడా అంచనాలకు కొద్ది దూరంలోనే మిగిలాయి. మహీంద్రా అండ్ మహీంద్రా మాత్రం అంచనాలను అధిగమించింది. అయితే జనవరిలో వాహనాలకు గిరాకీ రావడం కంపెనీలకు కలిసివస్తుంది.



ఎఫ్ఎంసీజీ: పరిమిత శ్రేణిలో ఈ రంగ షేర్లు కదలాడవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో అధిక వ్యయాలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో, ఈ షేర్లు చురుగ్గా ట్రేడ్ అవుతున్నాయి. అంతర్జాతీయ సంకేతాల ప్రభావం వీటిపైనా ఉండొచ్చు. ఆయుర్వేద ఉత్పత్తుల తయారీ పెంచుతున్న డాబర్ ఇండియా, కోల్గేట్ పామోలివ్ లాభపడొచ్చు.



టెలికాం: గత మూడు నెలల తరహాలోనే ఈ రంగ షేర్లు నష్టపోవచ్చు. మార్కెట్ ఒడుదొడుకుల ప్రభావం ఈ రంగంపైనా ఉండొచ్చు. తక్కువ విలువల వద్దా కొనుగోళ్లు ఉండకపోవచ్చని భావిస్తున్నారు. స్వల్పకాలంలో భారతీ ఎయిర్‌టెల్ రూ. 400 స్థాయికి పడిపోవచ్చని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. రిలయన్స్ జియో గణనీయంగా ఆర్జిస్తున్నందున, మాతృసంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభపడొచ్చు.



ఐటీ: తక్కువస్థాయిల వద్ద లభిస్తున్నందున, ఈ రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించవచ్చు. లాటరీ పద్ధతిలో వీసాల జారీపై అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకోంది కనుక టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో షేర్లు వెలుగులోకి రావచ్చు. ప్రస్తుతం ఒక్కో దేశానికి 7 శాతం వంతున గ్రీన్‌కార్డులు, శాశ్వత నివాస హక్కును అమెరికా కల్పిస్తోంది.



ఔషధ: దేశీయ సంస్థాగత మదుపుదార్ల అండతో ఈ రంగ షేర్లు రాణించవచ్చు. షేర్ల విలువలు తక్కువగా ఉండటం, రక్షణాత్మక రంగం కావడం ఇందుకు నేపథ్యం. తమ పోర్టుపోలియోలో నష్టభయం తగ్గించేందుకు మ్యూచువల్‌ఫండ్ సంస్థలు ఔషధ షేర్లపై చూస్తున్నారని డీలర్లు పేర్కొంటున్నారు. నేటినుంచి గుజరాత్‌లోని హలోల్ యూనిట్‌ను యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీ చేయనుండటం, బుధవారం ఫలితాలు ప్రకటించనుండటంతో సన్‌ఫార్మా షేర్లు వెలుగులోకి వస్తాయి. ఐరోపాలో రెండంకెల వృద్ధి కొనసాగిస్తామని అరబిందో ఫార్మా ప్రకటించడాన్నీ మదుపర్లు పరిగణనలోకి తీసుకుంటారు.




భారీ యంత్రపరికరాలు: ప్రధాన సూచీలకు అనుగుణంగా ఈ రంగ షేర్లు కదలాడొచ్చు. ఆర్డర్లకు అనుగుణంగా, ఆయా కంపెనీల షేర్లు రాణించవచ్చు. డిసెంబరు త్రైమాసిక ఫలితాలకు తోడు, అంతర్జాతీయ సంకేతాలకు అనుగుణంగా చలించొచ్చు.



బ్యాంకింగ్: ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు రాణించొచ్చు. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి (ఎంఎస్ఎంఈ) సంస్థలకు ఇచ్చిన రుణాలను, బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) పద్దుల్లో స్థిర ఆస్తిగానే పరిగణిస్తామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చేసిన ప్రకటన వీటికి ఉపకరిస్తుంది. ఇందువల్ల బకాయిల చెల్లింపు గడువు పూర్తయినా, 180 రోజుల వరకు నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ)గా పరిగణించరు. ఇందువల్ల బ్యాంకు పద్దుల్లో మొండిబకాయిలు తగ్గుతాయి. ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లు పరిమితంగా లాభపడొచ్చు. ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు ప్రక్రియలో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్‌బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, దేనా బ్యాంకులు ఈవారంలో ఫలితాలు వెల్లడించనున్నాయి.



సిమెంట్: ఈ రంగ షేర్లు బలహీన పడతాయని సాంకేతిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. మూడో త్రైమాసిక ఫలితాలతో ఏసీసీ గతవారం లాభపడినా, ఈ వారం నష్టపోతుందని అంటున్నారు. అయితే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని ప్రభుత్వం ప్రకటించినందున, సిమెంటుకు గిరాకీ పెరగవచ్చనే భావనతో మధ్య-దీర్ఘకాలానికి ఈ రంగంపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు.



లోహ: ప్రాథమిక లోహాల ధరలు తగ్గినందున, లోహ, గనుల కంపెనీల షేర్లు నష్టపోయే అవకాశం ఉంది. ఒడుదొడుకుల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించచ్చు. అయితే గిరాకీకి తోడు స్టీల్ ధరలు పెంచాలని భావిస్తున్నందున, ఆయా కంపెనీల షేర్లు రాణించవచ్చు. రుణ ఊబిలో చిక్కుకున్న సంస్థల కొనుగోలుకు పోటీ పెరుగుతున్నందున, ఈ రంగంలో పోటీ తీవ్రమవుతోంది.

మార్కెట్ విలువ

(రూ. కోట్లలో)

ఫిబ్రవరి 2 | ఫిబ్రవరి 9 | లాభం | నష్టం

మొత్తం లాభం: 0 | మొత్తం నష్టం: -111987

టీసీఎస్	-33854	568984	602838
రిలయన్స్	-4909	568773	573682
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-24936	480206	505142
ఐటీసీ	-4877	330801	335678
హెచ్‌యూఎల్	-8074	289044	297118
హెచ్‌డీఎఫ్‌సీ	-20733	283336	304070
మారుతి	-1627	270254	271881
ఎస్‌బీఐ	-432	255854	256286
ఇన్ఫోసిస్	-6514	242827	249342
ఓఎన్‌జీసీ	-6032	240944	246976

చేతల్లో గోరంత.. మాటల్లో కొండంత

- విభజన హామీలపై భాజపా వాదనను తిప్పికొట్టిన తెదేపా

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన అంశాలతో పాటు, ఆ బిల్లుపైన పార్లమెంటులో చర్చ సందర్భంగా అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీల్లో 85 శాతం నెరవేర్చామని భాజపా చెబుతుండగా, అవన్నీ డొల్ల లెక్కలేనని తెదేపా వాదిస్తోంది. విభజన హామీలను నెరవేర్చేందుకు పదేళ్లు గడువున్నప్పటికీ 15 శాతం మినహా మిగతావన్నింటినీ మూడున్నరేళ్లలోనే అమలు చేసేశామన్న భాజపా మాటలు వాస్తవం కాదని ఖండిస్తోంది. ఇరు పక్షాల వాదనలు క్లుప్తంగా ఇలా!

అంశం: రెవెన్యూ లోటు భర్తీ

భాజపా: రాష్ట్రానికి రూ.3,979.5 కోట్లు రెవెన్యూ లోటు భర్తీ కింద ఇచ్చాం. ఇంకా ఎంత చెల్లించాలనేదానికి సంబంధించిన తుది లెక్కపై ప్రస్తుతం కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. 14వ ఆర్థిక సంఘం కాలవ్యవధి (2015-20) మధ్య అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి మొత్తం రూ.22,133 కోట్లు వస్తాయి.

తెదేపా: 2014-15లో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ.16,078.76 కోట్లని అకౌంటెంట్ జనరల్ ధ్రువీకరించారు. కేంద్రం మాత్రం ఈ లోటు రూ.4,117.89 కోట్లేనని వాదిస్తోంది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఆ కాలవ్యవధిలో మిగతా రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన వాటా ప్రకారమే నిధులు ఇస్తున్నారు తప్ప ప్రత్యేకంగా ఏమీ మేలు చేకూర్చలేదు.

రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి కేబీకే, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ

భాజపా: ఒక్కో ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్లు చొప్పున గత మూడేళ్లలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద వెనుకబడిన ఏడు జిల్లాలకు రూ.1,050 కోట్ల నిధులిచ్చాం.

తెదేపా: ఆ ఏడు జిల్లాలకు రూ.24,350 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.1,050 కోట్లే ఇచ్చారు. బుందేల్‌ఖండ్ ప్యాకేజీలో అక్కడ రూ.7,266 కోట్లు ఇచ్చారు. 2016 డిసెంబరులో కరవు నివారణ ప్రత్యేక ప్యాకేజీ కింద బుందేల్‌ఖండ్‌కు రూ.7277 కోట్లు ఇచ్చారు.

ప్రత్యేక ప్యాకేజీ

భాజపా: ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రకటించిన మొత్తాన్ని విదేశీ ఆర్థిక సంస్థల సాయంతో చేపట్టే ప్రాజెక్టుల రూపంలో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇవ్వడానికి ఉన్న అవకాశాలపై కేంద్రం కసరత్తు చేస్తోంది. అతి త్వరలో దీన్ని ప్రకటిస్తారు.

తెదేపా: ప్రత్యేక హోదాతో చేకూరే అన్ని రకాల ప్రయోజనాలను ఏపీకి కలిగించేందుకు వీలుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నట్లు వెల్లడించినప్పటికీ ఇంతవరకూ నిధులు విడుదల చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం రూ.18,857 కోట్ల విలువైన ప్రతిపాదనలు పంపినా వాటికి ఆమోదం లభించలేదు. నాబార్డు, హడ్కో, వాణిజ్య బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు అవకాశం కల్పించాలని, ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా చూడాలని కోరినా ఫలితం లేదు.

విశ్వవిద్యాలయాల ఏర్పాటు, నిధుల కేటాయింపు


భాజపా: అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, విజయనగరంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశాం. తాజా బడ్జెట్‌లో ఈ రెండు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు చెరో రూ.10 కోట్లు కేటాయించాం.

తెదేపా: సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణానికి రూ.1,100 కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి రూ.400 కోట్లు వ్యయమవుతుంది. ఈ రెండింటి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలాల విలువ, వాటి చుట్టూ ప్రహరీల నిర్మాణానికైన వ్యయం కలిపితే రూ.1,026 కోట్లు. ఈ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు వీలుగా సెంట్రల్ యూనివర్సిటీ చట్టం-2009కు, ఇందిరాగాంధీ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం చట్టం-2007కు సవరణలు చేయడానికి గాను ప్రత్యేక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకూ జరగలేదు.

గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్

భాజపా: కాకినాడ గ్రీన్‌ఫీల్డ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లో హెచ్‌పీసీఎల్, గెయిల్ కలిసి రూ.30 వేల కోట్లు పెట్టుబడులు పెడతాయి. 2017 భాగస్వామ్య సదస్సులో దీనికి సంబంధించిన ఎంవోయూపై ఇప్పటికే సంతకాలు చేశాయి.

తెదేపా: ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదు. ఆర్థిక సర్దుబాటు(ఫైనాన్స్ వయబుల్) కింద కేంద్రం రూ.5 కోట్లు ఇవ్వాలి. ఫలితం లేదు.



దుగరాజపట్నం పోర్టు

భాజపా: పీపీపీ విధానంలో ఇక్కడ పోర్టు ఏర్పాటు చేయడానికి మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. అయితే సాంకేతిక కారణాల రీత్యా ఇక్కడ పోర్టు ఏర్పాటు సాధ్యం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం చూపించే ప్రత్యామ్నాయ కేంద్రంలో పోర్టు ఏర్పాటు చేయడానికి అవసరమైన మద్దతిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.

తెదేపా: ఎలాంటి పురోగతి లేదు. సాంకేతిక కారణాలను సాకుగా చూపుతున్నారు

వివిధ సంస్థల ఏర్పాటు, నిధుల కేటాయింపు

భాజపా: ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీడీఎం, ఐఐఎస్ఈఆర్, ఐఐఎం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐఐపీఈ, ఎయిమ్స్, ఎన్ఐడీఎం తదితర విద్యాసంస్థలకు సంబంధించి తాత్కాలిక ప్రాంగణాల్లో ఇప్పటికే తరగతులు కొనసాగుతున్నాయి. జాతీయ విద్యాసంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎయిమ్స్ నిర్మాణానికి గత రెండేళ్లలో రూ.730.51 కోట్లు విడుదల చేశాం.

తెదేపా: ఆయా ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.9,654.95 కోట్ల వ్యయమవుతుంది. అయితే ఇప్పటివరకూ కేంద్రం విడుదల చేసింది రూ.680.08 కోట్లే విడుదల చేసింది. ఆయా ప్రాజెక్టుల వ్యయంలో ఇప్పటివరకూ కేంద్రం 7 శాతం నిధులే విడుదల చేసింది. ఈ లెక్కన చూసుకుంటే వాటి నిర్మాణం పూర్తయ్యేందుకు ఎన్నేళ్లు పడుతుంది? రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్మాణానికి కేటాయించిన స్థలం విలువ, దాని చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చేసిన వ్యయమే రూ.11,182.38 కోట్లు.

రాజధాని అమరావతికి ఆర్థికసాయం

భాజపా: రాజధాని నిర్మాణానికి ఇప్పటికే రూ.2,500 కోట్లు ఇచ్చాం. త్వరలో మరో రూ.1,000 కోట్లు ఇస్తాం.

తెదేపా: రాజధాని నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.1,500 కోట్లే ఇచ్చారు. ఆ నిధులతో 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో సచివాలయం, అసెంబ్లీ భవనాలు నిర్మించాం. 80 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధికారులు, సిబ్బంది నివాస భవనాలు, రహదారులు నిర్మాణంలో ఉన్నాయి. కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నాం. రాజభవన్, సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాల నిర్మాణానికి రాబోయే అయిదేళ్లలో రూ.42,395 కోట్లు అవసరమవుతాయి. వీటికి సంబంధించిన సవివర ప్రాజెక్టు నివేదికలు



కూడా కేంద్రానికి సమర్పించాం. విజయవాడ, గుంటూరు నగరపాలక సంస్థల పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.1,000 కోట్లు ఇచ్చారు. ఆ నిధులతో చేపట్టిన పనుల వినియోగ పత్రాలను కూడా కేంద్రానికి సమర్పించాం.

కడప ఉక్కు కర్మాగారం

భాజపా: కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై సెయిల్ ఇప్పటికే సాధ్యాసాధ్యాల నివేదిక ఇచ్చింది. అందులోని అంశాల పరిశీలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, ఆర్ఐఎన్ఎల్, ఎన్‌డీఎంసీ, మెకాన్, ఎంఎస్‌టీసీలకు చెందిన సభ్యులతో కార్యదళం ఏర్పాటైంది. సాధ్యమైనంత త్వరలో ఈ ప్లాంట్ ఏర్పాటవుతుంది

తెదేపా: ఎలాంటి పురోగతి లేదు. రాష్ట్ర ప్రభుత్వం పలు మార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదు. లాభసాటి కాదంటున్నారు. నివేదికను పక్కనలో పెట్టారు.

విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులు

భాజపా: ప్రస్తుతం దీని సవివర ప్రాజెక్టు నివేదిక కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పరిశీలనలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొన్ని వివరణలను కేంద్రం కోరింది. విజయవాడ మెట్రోకు సూత్రప్రాయ అంగీకారం తెలిపింది.

తెదేపా: ఎలాంటి పురోగతి లేదు. 2018-19 బడ్జెట్‌లో నిధులే కేటాయించలేదు.

చట్టంలో పేర్కొనప్పటికీ చేసిన అంశాలు

భాజపా: రక్షణ రంగ సంస్థలు, నౌకాయన సంస్థల ఏర్పాటు, విద్యుత్తు రంగం, జాతీయ జలరవాణా మార్గాలు-4, బొగ్గు, గనులు శాఖ తరపున భారీగా నిధులు కేటాయించాం.

తెదేపా: చాలా సంస్థల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్ల విలువైన భూములను కేటాయించింది. ఇప్పటికీ వాటిలో చాలా ప్రారంభం కాలేదు. చిన్న చిన్న అంశాలను కూడా ఏదో పెద్ద మేలు చేసినట్లు చెబుతున్నారు.

ప్యాకేజీ, ఫారిన్ ట్రేడ్ సంస్థల ఏర్పాటు

భాజపా: ఈ సంస్థలను ఒక్కోటి 25 ఎకరాల విస్తీర్ణంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నాం.

తెదేపా: 25 ఎకరాల్లో అభివృద్ధి చేయాల్సిన సంస్థలకు 2018-19 కేంద్ర బడ్జెట్‌లో రూ.5 కోట్ల చొప్పున మంజూరు చేశారు. ఇలా అయితే ఆ సంస్థలు ఎప్పటికి పూర్తవుతాయి?

పోలవరం ప్రాజెక్టు

భాజపా: పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటివరకూ రూ.4,622.68 కోట్లు చెల్లించాం. 2014 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ప్రాజెక్టు నిర్మాణానికయ్యే వ్యయమంతా పూర్తిగా కేంద్రమే భరిస్తుంది.

తెదేపా: 2014-15 అంచనాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.54 వేల కోట్ల వ్యయమవుతుందని ఆగస్టు 2016న కేంద్రానికి నివేదిక పంపించాం. దీనిలో పరిహారం, పునరావాసానికి రూ.33 వేల కోట్లువుతుంది. దానిపైన స్పష్టత ఇవ్వలేదు. గత నాలుగేళ్లలో పోలవరంపై రూ.7,780.07 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రం వెచ్చించిన మొత్తంలో ఇంకా రూ.3,451 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. ఫలితంగా వడ్డీ రూపంలో రూ.300 కోట్లమేర ఏపీపైన భారం



పడింది. ఎగువ కాఫర్ డ్యామ్, స్పిల్‌వే, స్పిల్ ఛానల్ విషయంలో కేంద్రం నాన్చుడు ధోరణితో ప్రాజెక్టు పనుల్లో రెండు నెలలు ఆలస్యమయ్యింది.

జాతీయ రహదారులు, రోడ్డు అనుసంధానత

భాజపా: వివిధ పథకాల కింద జాతీయ రహదారులు, రోడ్డు అనుసంధానత కోసం రూ.లక్ష కోట్లు నిధులు ఖర్చు చేస్తాం. 180 కి.మీ అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు రూ.20 వేల కోట్లును కేంద్రమే భరిస్తుంది.

తెదేపా: అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లు ఇచ్చారు తప్పితే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా ఏమీ ఇవ్వలేదు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి భూ సేకరణ జరుగుతోంది. ప్రాజెక్టు అంచనా రూ.25 వేల కోట్లు. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. భూసేకరణకయ్యే వ్యయాన్ని రాష్ట్రమే భరిస్తోంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు ఇంకా డీపీఆర్ దశలోనే ఉంది.

రైల్వే ప్రాజెక్టులకు

భాజపా: 2009-14లో రైల్వేకు కేటాయించింది రూ.5,100 కోట్లు. 2014-19లో రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు రూ.14,151 కోట్లు కేటాయించాం. రూ.47,989 కోట్ల విలువైన 5,010 కి.మీ. 32 ప్రాజెక్టులు ఇప్పటికే పని జరుగుతోంది.

తెదేపా: ప్రాజెక్టు అంచనాలు, అవసరమైన నిధుల గురించి చెప్పారే తప్ప ఇప్పటివరకూ ఎన్ని మంజూరు చేశారు? ఇంకా ఎంత విడుదల చేయాలనేది చెప్పలేదు.

విమానాశ్రయాల అభివృద్ధి

భాజపా: భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. విజయవాడను అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే కొత్త టెర్మినల్ భవనం పూర్తయ్యింది. రన్‌వే విస్తరణ సాగుతోంది. అంతర్జాతీయ ప్రమాణాల స్థాయికి అభివృద్ధి చేసిన తిరుపతి విమానాశ్రయాన్ని ఇప్పటికే ప్రధాని ప్రారంభించారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో రాత్రి ల్యాండింగ్, రన్‌వే విస్తరణ పనులు సాగుతున్నాయి. కడప విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనం ప్రారంభమైంది. ఉడాన్ పథకం కింద ఇక్కడి నుంచి సర్వీసులు నడుస్తున్నాయి.



తెదేపా: కడప, రాజమహేంద్రవరం విమానాశ్రయాల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వైద్యసేవల కేంద్రంగా భారత్

చికిత్సల నిమిత్తం 2016లో 2లక్షల మంది విదేశీయుల రాక

దిల్లీ: వైద్య సేవలకు గమ్యస్థానంగా భారత్ ప్రాచుర్యం రోజురోజుకీ పెరుగుతోంది. 2016లో రెండు లక్షల మంది విదేశీయులు మన దేశంలో చికిత్సలు చేయించుకున్నారు. వీరిలో అత్యధికంగా బంగ్లాదేశ్‌కు చెందినవారే (99,799 మంది) ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో అఫ్గానిస్థాన్ (33,955), ఇరాక్ (13,465), ఒమన్ (12,227), ఉజ్బెకిస్థాన్ (4,420), నైజీరియా (4,359) తదితర దేశాల వారు ఉన్నారు. 1,678 మంది పాకిస్థాన్ పౌరులు, 296 మంది అమెరికన్లూ భారత్‌లో వైద్య సేవలు పొందారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. 2016లో మొత్తం 54 దేశాలకు చెందిన 2,01,099 మంది భారత్ నుంచి వైద్య వీసాలు పొందారు. ప్రస్తుతం దేశంలో వైద్య పర్యటకం విలువ రూ.19వేల కోట్లుగా ఉందని.. 2020 కల్లా ఇది రూ.45వేల కోట్లు దాటొచ్చని అంచనా వేసింది.

హైకోర్టు జడ్జీల ఎంపిక కోసం 123 పేర్లు

ప్రభుత్వం, కొలీజియం వద్ద పెండింగ్‌లో ఉన్న సిఫార్సులు

దిల్లీ: దేశంలోని 13 హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకానికి ఉద్దేశించిన 123 సిఫార్సులు ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వివిధ హైకోర్టుల్లో 403 పోస్టులు ఖాళీగా ఉన్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. మిగతా 280 ఖాళీలను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల పేర్లను హైకోర్టులు ఇంకా సూచించాల్సి ఉందని కూడా గణాంకాలు చెబుతున్నాయి. హైకోర్టుల నుంచి వచ్చిన పేర్లలో 43 పేర్లు సుప్రీంకోర్టు కొలీజియం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ప్రభుత్వం వద్ద 80 పేర్లు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 1 నాటికి అత్యధికంగా అలహాబాద్ హైకోర్టులో 56, కలకత్తా హైకోర్టులో 39, కర్ణాటక ఉన్నత న్యాయస్థానంలో 38, హరియాణా హైకోర్టులో 35, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులో 30 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

న్యాయ విద్యార్థిని కొట్టి చంపిన దుండగులు

అలహాబాద్: ఉత్తర్ ప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. 26 ఏళ్ల న్యాయ విద్యార్థిని కొందరు దుండగులు దారుణంగా కొట్టిచంపారు. అలహాబాద్‌లోని ఓ రెస్టారెంట్ వెలుపల చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం కలకలం సృష్టిస్తోంది. న్యాయ విద్యనభ్యసిస్తున్న దిలీప్ సరోజ్ శనివారం రాత్రి ఇద్దరు స్నేహితులతో కలిసి స్థానిక కాళికా రెస్టారెంట్‌కు వెళ్లాడు. భోజనం అనంతరం వారు రెస్టారెంట్ మెట్ల మీద కూర్చోగా.. ముగ్గురు వ్యక్తులు వారితో దురుసుగా ప్రవర్తించి లోపలికి వెళ్లారు. ఎందుకలా చేశారంటూ నిలదీసేందుకు దిలీప్, అతడి స్నేహితులు రెస్టారెంట్ లోపలికి ప్రవేశించగా.. దుండగులు వారిపై దాడికి యత్నించారు. దీంతో దిలీప్ స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారు. దిలీప్‌ను దొరకబుచ్చుకున్న దుండగులు.. రెస్టారెంట్ వెలుపల మద్యం మత్తులో హాకీ స్టిక్, పైపు ముక్క, ఇటుకలతో విచక్షణారహితంగా, వంతులవారీగా దాడి చేశారు. అడ్డుకునేందుకు రెస్టారెంట్ యజమాని విఫలయత్నం చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ దిలీప్ కోమాలోకి వెళ్లాడు. రెస్టారెంట్ యజమాని అతణ్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం కన్నుమూశాడు. దుండగుల్లో ఒకరిని రైల్వే ఉద్యోగి విజయ్‌శంకర్ సింగ్‌గా పోలీసులు గుర్తించారు.

ఆమ్లదాడి బాధితులకు అన్యాయంపై 'పిల్'

నష్టపరిహారాన్ని రూ.12 లక్షలకు పెంచాలని విన్నపం

దిల్లీ: ఆమ్లదాడికి గురైన బాధితులను ఆదుకోవడానికి, మార్కెట్లో ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఎవరికి బడితే వారికి ఇష్టమొచ్చినట్లు ఆమ్లాలు అమ్ముతున్న పరిస్థితిపై సుప్రీంకోర్టు స్పందించింది. కేంద్రంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. బాధితుల కోసం ఉన్న చట్టాలు సక్రమంగా అమలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 2010 నుంచి 2016 మధ్య 1189 మంది ఆమ్లదాడికి గురయ్యారని, బాధితులకు నష్ట పరిహారం అందడంలో విపరీతంగా జాప్యం జరుగుతోందని అడ్వొకేట్ అను జాకపూర్ ప్రజాప్రయోజనాల వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. పాక్షికంగా లేదా పూర్తిగా అంగవైకల్యానికి గురైనవారికి ప్రస్తుతం ఇస్తున్న పరిహారాన్ని రూ.3 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచాలని కోరారు.



అబుదాబిలో జరిగిన భారత సంతతి పౌరుల సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

వినాశనానికి కాదు... వికాసానికే అభివృద్ధి

- భారత్ వృద్ధి ప్రస్థానంలో టెక్నాలజీకి పెద్దపీట
- దుబాయ్ సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ

దుబాయ్: సాంకేతికత అనేది వికాసానికి ఒక సాధనంగా ఉపయోగపడాలే గానీ వినాశనానికి దారి తీయకూడదని భారత ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఆదివారం దుబాయ్‌లో జరిగిన 'ప్రపంచ ప్రభుత్వాల ఆరో శిఖరాగ్ర సదస్సు'లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఒకపక్క క్షిపణులు, బాంబులపై పెద్దఎత్తున డబ్బు, సమయం, వనరుల్ని ఉపయోగిస్తూ మరోపక్క ఇప్పటికీ పేదరికం, పౌష్టికాహార లోపం వంటి సమస్యల్ని ఎదుర్కొంటూనే ఉన్నామని ఆయన గుర్తుచేశారు. 'పాలనలో సాంకేతికతను రంగరించి వృద్ధిలో అందరికీ సమానావకాశాలు కల్పించవచ్చు, సుసంపన్నత సాధించవచ్చు. భారతదేశ అభివృద్ధిలో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోంది. కృత్రిమ మేధస్సు, నానో సాంకేతికత, సైబర్ భద్రత, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో నాయకత్వ స్థానాన్ని సంపాదించడానికి మేం ప్రయత్నిస్తున్నాం' అని మోదీ వివరించారు. సాంకేతికతను ఉపయోగించుకుని, ప్రపంచానికే ఓ చక్కని ఉదాహరణగా గల్ఫ్ ఎమిరేట్స్‌ను తీర్చిదిద్దిన తీరు ఓ అద్భుతమని కితాబిచ్చారు. పేదరికం, నిరుద్యోగం, విద్య, గృహ నిర్మాణం, మానవ విపత్తులు వంటి అనేక సవాళ్లను... అభివృద్ధి ద్వారా అధిగమించవచ్చన్నారు. 'అందరితో కలిసి అందరి వికాసం', 'కనిష్ఠ ప్రభుత్వం-గరిష్ఠ పాలన' అనే నినాదాలతో భారతీయుల సాధికారతకు పాటుపడుతున్నామని చెప్పారు.

140 దేశాల నుంచి దాదాపు 4000 మంది ప్రతినిధులు హాజరైన శిఖరాగ్ర సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొనడమంటే అది తనకే కాకుండా 125 కోట్ల భారతీయులందరికీ దక్కిన గౌరవమని మోదీ పేర్కొన్నారు. క్యాబ్‌లో ప్రయాణానికి కి.మీ.కి రూ.10 చెల్లించాల్సి వస్తుంటే కి.మీ.కి రూ.7తోనే అంగారక గ్రహానికి యాత్రను చేపట్టగలిగామని ఆయన చెప్పినప్పుడు సభ మొత్తం కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది. 'నవకల్పనలకు ప్రధాన దేశంగా భారత్ అవతరించబోతోంది. సాంకేతికతను సులభంగా వినియోగించుకునేలా చేయటం ద్వారా సామాన్యులకు సాధికారత కల్పించాం. ఆలోచనలంత వేగంగా సాంకేతికత పరుగులు తీస్తోంది. ఇ-గవరెన్స్‌లో ఇ అంటే అయిదు అర్థాలున్నాయి. అవి.. ఎఫెక్టివ్ (ప్రభావశీల), ఎఫిషియెంట్ (సమర్థవంత), ఈజీ (సులభతర), ఎంపవర్ (సాధికారత), ఈక్విటీ (సమధర్మం)' అని ఆయన వివరించారు.

ప్రకృతితో తలపడితే మూల్యం తప్పదు

అయిదు 'ఇ'లతో పాటు ఆరు 'ఆర్'ల గురించీ మోదీ ఆసక్తికరంగా వివరించారు. 'ప్రకృతిపై పైచేయి సాధించడానికే కాకుండా దానితో పోరాడడానికి కూడా సాంకేతికతను మానవాళి ఒక ఆయుధంగా మలచుకుంటూ పొరపాటు చేస్తున్నట్లు కొన్నిసార్లు అనిపిస్తుంటుంది. దానికి చాలా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. మానవాళి మనుగడ కోసం మనం ప్రకృతితో పోరాటకూడదు... దానితో కలిసి జీవించాలి. ఆరు 'ఆర్'లను మనం పాటించాలి. అవి... రెడ్యూస్ (తగ్గించు), రీయూజ్ (పునర్వినియోగించు), రీసైకిల్ (మరో రూపంలో వాడుకొను), రికవర్ (రాబట్టడం), రీడిజైన్ (నమూనాలను మార్చడం), రీ మేనుఫ్యాక్చర్ (మళ్లీ తయారు చేయడం). మనం సంతోషంగా మనుగడ సాగించడానికి ఇవి అవసరం' అని ఆయన చెప్పినప్పుడూ సభ మరోసారి చప్పట్లతో మార్మోగింది. 'రాబోయే దశాబ్దాల్లో ప్రపంచం ముందుకు రాబోతున్న సమస్యలకు పరిష్కారాలు సూచించడంలో మనం కలిసి పనిచేయడం అనివార్యం. దానిలో సాంకేతికతది ప్రధానపాత్ర' అని చెప్పారు.

ఫ్రాన్స్ ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు

సదస్సుకు హాజరైన ఫ్రాన్స్ ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వ్యూహాత్మక సంబంధాలను పెంచుకునే మార్గాలపై చర్చించారు. కిర్గిజిస్థాన్ ప్రధాని సపార్ ఇసాకోవ్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. అంతకుముందు యూఏఈ ఉపాధ్యక్షుడు-ప్రధాని మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తొంతో భారత ప్రధాని సమావేశమై వాణిజ్యం, రక్షణ, ప్రజల మధ్య సంబంధాల్లో ద్వైపాక్షిక సహకారం గురించి చర్చించారు. గల్ఫ్ సహకార మండలి వ్యాపారవేత్తలతోనూ సమావేశమయ్యారు.

కాంగ్రెస్ కుంభకోణాలతో మసకబారిన ప్రతిష్ఠ

ప్రవాస భారతీయులనుద్దేశించి మోదీ మాట్లాడుతూ మునుపటి కాంగ్రెస్ సర్కారు హయాంలో చోటు చేసుకున్న కుంభకోణాల వల్ల దేశ ప్రతిష్ఠ మసకబారిందని చెప్పారు. తాము పగ్గాలు చేపట్టాక కుంభకోణాలకు ఆస్కారం లేని పాలనను అందిస్తున్నామన్నారు.

సుంజ్వాన్ ఉగ్రదాడిలో 6కు పెరిగిన మృతుల సంఖ్య

- మరో ముగ్గురు సైనికుల మృతదేహాలు లభ్యం
- ఓ సైనికుడి తండ్రి దుర్మరణం
- మూడో ఉగ్రవాది మృతదేహాన్నీ గుర్తించిన అధికారులు

సుంజ్వాన్: జమ్ముకశ్మీర్‌లోని సుంజ్వాన్ సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందినవారి సంఖ్య 6కు పెరిగింది. వాస్తవానికి ఈ దాడిలో ఇద్దరు సైనికులే మృతిచెందినట్లు తొలుత భావించినా.. సైనిక కుటుంబాల నివాస ప్రాంగణంలో మరో ముగ్గురు సైనికులు, ఓ పౌరుడు శవమై కనిపించినట్లు రక్షణశాఖ అధికార ప్రతినిధి ఆదివారం వెల్లడించారు. మృతిచెందిన ముగ్గురు సైనికుల్లో ఒకరు జూనియర్ కమిషన్డ్ అధికారి(జేసీవో) కాగా.. మరో ఇద్దరు జవాన్లు అని తెలిపారు. మరణించిన పౌరుడిని ఓ సైనికుడి తండ్రిగా గుర్తించారు. వారంతా శనివారమే ఉగ్రవాదుల చేతిలో మరణించారని పేర్కొన్నారు. మరోవైపు, సైనిక శిబిరంలోనే మరో ఉగ్రవాది మృతదేహమూ కనిపించిందని అధికారులు తెలిపారు. శనివారం ఇద్దరు ఉగ్రవాదుల మృతదేహాలు లభ్యమైన సంగతి గుర్తుచేశారు. దీంతో తాజా దాడికి సంబంధించి మొత్తం ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు స్పష్టం చేశారు. హతుల నుంచి ఏకే-56 రైఫిళ్లు, గ్రెనేడ్ లాంచర్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుంజ్వాన్ సైనిక శిబిరంపై జైషే మహ్మద్ ఉగ్రవాదులు శనివారం తెల్లవారుజామున దాడికి తెగబడిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో పదిమంది గాయపడ్డారు. మరోవైపు, సైనిక కుటుంబాల నివాస ప్రాంగణంలో ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సైనికుల కుటుంబ సభ్యులు చాలా మంది ఇప్పటికీ అక్కడి ఇళ్లలోనే ఉన్నారని.. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. జమ్ములో హై అలర్ట్ ప్రకటించామని.. భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు. తాజా ఉగ్రదాడిలో మృతిచెందినవారంతా జమ్ముకశ్మీర్ వాసులే. సుంజ్వాన్ ఘటనలో నలుగురు ఉగ్రవాదులు హతమైనట్లు జమ్ముకశ్మీర్ డీజీపీ ఎస్.పి.వైద్ చెప్పడం గమనార్హం.



సుంజ్వాన్ సైనిక శిబిరంలో కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన సహోద్యోగి మృతదేహాన్ని తరలిస్తున్న భద్రతా సిబ్బంది

పండంటి పాపకు జన్మనిచ్చిన క్షతగాత్రురాలు

ఉగ్ర దాడిలో గాయపడ్డ ఓ మహిళ పండంటి పాపాయికి జన్మనిచ్చారు. సుంజ్వాన్ సైనిక శిబిరంపై జరిగిన దాడిలో రైఫిల్‌మ్యాన్ నజీర్ అహ్మద్, ఆయన భార్య(గర్భిణీ) గాయపడ్డ సంగతి గమనార్హం. జమ్ములోని సైనిక ఆస్పత్రిలో నజీర్ భార్య ఆదివారం ప్రసవించారు. తల్లీబిడ్డలు ప్రస్తుతం క్షేమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఉగ్రదాడిలో గాయపడ్డ 14 ఏళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. జైషే మహ్మద్ ఉగ్రవాదులు దాడి జరిపిన సుంజ్వాన్ సైనిక శిబిరాన్ని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందం ఆదివారం సందర్శించింది. సైన్యం సేకరించిన ఆధారాలను పరిశీలించింది. మనదేశంలో ఉగ్ర సంబంధిత కేసులన్నింటినీ ఎన్ఐఏ దర్యాప్తు చేస్తుంది.

సీఎస్‌డబ్ల్యూబీలో సభ్యులయ్యే ఎంపీలపై అనర్హత వేటు: పార్లమెంటరీ కమిటీ

దిల్లీ: కేంద్ర సామాజిక సంక్షేమ బోర్డు(సీఎస్‌డబ్ల్యూబీ) సభ్యులుగా నియమితులయ్యే ఎంపీలు పార్లమెంటులో తమ సభ్యత్వాన్ని కోల్పోయే అవకాశముందని పార్లమెంటరీ కమిటీ ఒకటి వెల్లడించింది. న్యాయ మంత్రిత్వశాఖ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు అనర్హత వేటు అంశాన్ని కమిటీ తమ నివేదికలో పేర్కొంది. సీఎస్‌డబ్ల్యూబీలో ఛైర్మన్, ఇద్దరు లోక్‌సభ ఎంపీలు, ఒకరు రాజ్యసభ ఎంపీ సహా మొత్తం 56 మంది సభ్యులుంటారు. వీరిని కేంద్రప్రభుత్వం నియమిస్తుంది.

హరికృష్ణ.. పెళ్లిపిలుపు




హైదరాబాద్, ఈనాడు: భారత చెస్ స్టార్, గ్రాండ్‌మాస్టర్ హరికృష్ణ పెళ్లికి ఏర్పాట్లు జోరందుకున్నాయి. తాను ప్రేమించిన సెర్బియా చెస్ క్రీడాకారిణి నదెజ్దాను మార్చి 3న హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో వివాహమాడనున్నట్లు ఇప్పటికే వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ పెళ్లి ఆహ్వాన వీడియోను హరి మీడియాకు విడుదల చేశాడు. హరికి కాబోయే భార్య ఫొటో కూడా ఇందులో ఉంది.

జడేజా సెంచరీ

ఈనాడు, హైదరాబాద్: టీమ్‌ఇండియా ఆటగాడు రవీంద్ర జడేజా (113 నాటౌట్; 116 బంతుల్లో 7×4, 4×6) బ్యాటుతో చెలరేగాడు. ఝార్ఖండ్‌తో విజయ్ హజారే ట్రోఫీ వన్డే మ్యాచ్‌లో అతడు రాణించడంతో సౌరాష్ట్ర 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత ఝార్ఖండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 329 పరుగులు సాధించింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (93; 96 బంతుల్లో 5×4, 7×6) చెలరేగి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అనంతరం సౌరాష్ట్ర మరో 4 బంతులు మిగిలివుండగానే 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జడేజా అజేయ సెంచరీతో సత్తాచాటగా.. ఉతప్ప (32; 17 బంతుల్లో 4×4, 2×6), పుజారా (44; 54 బంతుల్లో 6×4) రాణించారు.

ఆంధ్ర జైత్రయాత్ర: అఖిల భారత విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసిన ఆంధ్ర.. 16 పాయింట్లతో గ్రూపు-సిలో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ బెర్తుకు చేరువైంది. ఆదివారం ఆంధ్ర 29 పరుగుల ఆధిక్యంతో తమిళనాడుపై విజయం సాధించింది. మొదట ఆంధ్ర 5 వికెట్లకు 276 పరుగులు చేసింది. భరత్ (82), సుమంత్ (62 నాటౌట్) రాణించి జట్టుకు మెరుగైన స్కోరు అందించారు. అనంతరం తమిళనాడు 48.5 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది.



శివకేశవన్‌కు 34వ స్థానం

ప్యాంగ్‌చాంగ్: శీతాకాల ఒలింపిక్స్ పురుషుల లూజ్ సింగిల్స్‌లో భారత ఆటగాడు శివకేశవన్ 34వ స్థానం సాధించాడు. దీంతో రెండు దశాబ్దాల అతడికి కెరీర్‌కు తెరపడింది. ఆరోసారి శీతాకాల ఒలింపిక్స్‌లో పోటీపడ్డ 36 ఏళ్ల కేశవన్.. ఇవే తన చివరి ఒలింపిక్స్ అని ఇంతకుముందే ప్రకటించాడు. ఆదివారం మూడో హీట్‌లో ఒలింపిక్ స్లైడింగ్ సెంటర్లో అతడు 48.900 సెకన్ల టైమింగ్‌ను నమోదు చేసి, 30వ స్థానం సాధించాడు.. మొత్తం మూడు రౌండ్లు కలిపితే 34వ స్థానంలో నిలిచాడు. టాప్-20లో లేకపోవడంతో పతక విజేతలను నిర్ణయించే నాలుగో రౌండ్‌కు అతడు అర్హత సాధించలేకపోయాడు. ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ గ్లీచర్ స్వర్ణం గెలుచుకున్నాడు. క్రిస్ మజర్ (అమెరికా) రజతం నెగ్గగా.. జోహానెస్ లుడ్విగ్ (జర్మనీ) కాంస్యం గెలుచుకున్నాడు. మనాలిలో పుట్టి పెరిగిన శివ కేశవన్ పదహారేళ్ల వయసులో తొలిసారి శీతాకాల ఒలింపిక్స్‌లో పోటీపడ్డాడు. మొత్తంమీద ఆరుసార్లు ఈ మెగా క్రీడల్లో బరిలో దిగాడు. 2006లో 25వ స్థానంలో నిలవడమే శీతాకాల ఒలింపిక్స్‌లో అతడికి అత్యుత్తమ ప్రదర్శన.

ఛాంపియన్



అదివాళ్లకు కలిసొచ్చింది

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా ఎంతో సంకల్పంతో ఆడిందని, నాలుగో వన్డేలో విజయానికి ఆ జట్టు పూర్తి అర్హమైందని భారత కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. "దక్షిణాఫ్రికా చాలా పట్టుదలగా ఆడింది. విజయానికి ఆ జట్టు పూర్తి అర్హమైంది. అది చాలా నాణ్యమైన జట్టు. వాళ్లు నాణ్యమైన క్రికెట్ ఆడతారని అనుకున్నాం. అలాగే ఆడారు. మరో విజయం సాధించాలంటే మేం మా అత్యుత్తమ ఆట ఆడాలని తెలుసు. అందుకోసం మేం బాగా కష్టపడతాం" అని నాలుగో వన్డే అనంతరం కోహ్లి వ్యాఖ్యానించాడు. ఈ మ్యాచ్‌లో పరిస్థితులు కూడా తమకు ప్రతికూలంగా మారాయని అన్నాడు. "అంతరాయం తర్వాత శిఖర్ ధావన్, అజింక్య రహానె బ్యాటింగ్ చేస్తుంటే పిచ్ భిన్నంగా స్పందించింది. బ్యాటింగ్‌కు అంతకుముందులా సహకరించలేదు' అని కోహ్లి చెప్పాడు. ఇన్నింగ్స్‌ను కుదించడం ఆతిథ్య జట్టుకు కలిసొచ్చిందని అన్నాడు. "ఇన్నింగ్స్‌ను కుదించడం బహుశా వాళ్లకు లాభించిందేమో? పరిస్థితులతో సంబంధం లేకుండా వారు ధాటిగా ఆడాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. పూర్తి మ్యాచ్ జరిగి ఉంటే ఎలా ఉండేదో మరి" అని కోహ్లి చెప్పాడు.

ఒక మ్యాచ్‌లో 40వ ఓవర్లో సెంచరీ కొట్టిన వాడు.. 50వ ఓవర్ అయ్యేసరికి డబుల్ సెంచరీ పూర్తి చేసేశాడు. చాలా మంది మేటి బ్యాట్స్‌మెన్ వన్డేల్లో ఇంకా ఒక్క డబుల్ సెంచరీ కూడా కొట్టలేదు. అలాంటితను మూడో ద్విశతకం బాదాడు.

మరో మ్యాచ్‌లో 35 బంతుల్లో సెంచరీ కొట్టేసి.. టీ20ల్లోనూ డబుల్ సెంచరీ కొట్టిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించేలా కనిపించాడు.

రెండు నెలల కిందట రోహిత్ శర్మ విశ్వరూపమిది. అప్పుడతడి బ్యాటింగ్ నైపుణ్యం.. టైమింగ్.. శక్తి సామర్థ్యాల గురించి అందరూ గొప్పగా మాట్లాడుకున్నారు. అప్పుడు రోహిత్‌ను చూస్తే ప్రపంచంలో ఇలాంటి బ్యాట్స్‌మన్ ఇంకొకడు లేడన్నట్లుగా కనిపించింది.

కానీ ఇప్పుడు దయనీయంగా ఉంది రోహిత్ పరిస్థితి. 10, 11, 10, 47, 20, 15, 0, 5.. దక్షిణాఫ్రికా పర్యటనలో ఆడిన ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో అతడి స్కోర్లివి.

అతడికి ఏమైంది?



ఫాస్ట్ పిచ్‌లపై రోహిత్ తడబడతాడన్న సంగతి తెలిసిందే. ఐతే సొంతగడ్డపై మేటి బ్యాట్స్‌మన్‌లా కనిపించే రోహిత్.. దక్షిణాఫ్రికాలో మరీ ఈ స్థాయిలో విఫలమవుతాడని ఎవరూ ఊహించి ఉండరు. రోహిత్ లాగే ఫాస్ట్ పిచ్‌లపై ఆడలేడని పేరున్న ధావన్ కూడా దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో విఫలమయ్యాడు. రోహిత్‌కు రెండో టెస్టులోనూ అవకాశమిచ్చారు కానీ.. ధావన్‌ను అయితే మొదటి మ్యాచ్ తోనే తప్పించేశారు. కానీ అతను వన్డేల్లోకి వచ్చేసరికి చెలరేగిపోతున్నాడు. నాలుగు మ్యాచ్‌ల్లో ఓ సెంచరీ, రెండు అర్ధసెంచరీలు సహా 271 పరుగులు చేశాడతను. కానీ రోహిత్ మాత్రం ఘోరంగా విఫలమవుతున్నాడు. ఒక్కటంటే ఒక్క చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ కూడా ఆడట్లేదు. మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత డీన్ జోన్స్ అన్నట్లుగా రోహిత్ డిఫెన్స్ ఆడటంలో బలహీనుడు. ఓపిగ్గా ఆడలేడు. టెస్టుల్లో 145 కిలోమీటర్లకు పైగా వేగంతో వచ్చిన బంతుల్ని కాచుకోలేక విఫలమయ్యాడు అనుకుందాం. ఐతేతే వన్డేల్లో అతను రాణిస్తాడని.. ధావన్ లాగే ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడేస్తాడని అనుకున్నారు. కానీ అలా ఏమీ జరగట్లేదు. నాలుగు వన్డేల్లోనూ పేలవమైన షాట్లతో త్వరగా పెవిలియన్ చేరిపోయాడు. టెస్టుల్లో మూడుసార్లు అతడిని ఔట్ చేసిన రబాడనే.. వన్డేల్లోనూ మూడుసార్లు ఔట్ చేశాడు. అదనపు బౌన్స్.. బంతి బంతికీ మారుతున్న వేగమే రోహిత్‌ను బోల్తా కొట్టిస్తోందన్నది విశ్లేషకుల మాట. ఇక్కడి పిచ్‌లపై వేగాన్ని, బౌన్స్‌ను అంచనా వేయడంలో రోహిత్ విఫలమవుతున్నాడని.. ఫ్లాట్ పిచ్‌ల మీద ఆడినట్లే షాట్లు ఆడి ఔటవుతున్నాడని వారంటున్నారు.

వన్డే సిరీస్‌లో అతను రెండుసార్లు షార్ట్ పిచ్ బంతికి వెనుదిరిగాడు. ఈ రెండుసార్లూ అదనపు బౌన్సే అతడిని దెబ్బ తీసింది. ముందే షాట్ ఆడేందుకు సిద్ధమైపోయాడతను. భారత పిచ్‌లపై అయితే ఈ షాట్లకు బంతి స్టాండ్స్‌లో ఉండేదేమో. కానీ అదనపు బౌన్స్ వల్ల రోహిత్ అనుకున్నట్లు బ్యాట్‌కు బంతి తాకలేదు. మిగతా రెండు మ్యాచ్‌ల్లో బంతిని ఆడాలా వదిలేయాలా అన్న సందిగ్ధంలోనే ఆడి.. వికెట్ సమర్పించుకున్నాడు. క్రీజులో కొంచెం నెమ్మదిగా కదిలే రోహిత్‌కు దక్షిణాఫ్రికా పిచ్‌లు, ఆ జట్టు పేసర్ల బంతులు పరీక్ష పెడుతున్నాయి. ఈ వేగాన్ని అతను అందుకోలేకపోతున్నాడు. రోహిత్ సహచర ఓపెనర్ ధావన్.. చురుగ్గా కదులుతూ, వేగంగా బ్యాట్ ఊపుతో షాట్లు ఆడగలుగుతున్నాడు. అతడికీ డిఫెన్స్ ఆడటంలో సమస్యలున్నప్పటికీ.. వన్డేల్లో తనదైన దూకుడు ప్రదర్శిస్తూ పరుగులు చేయగలుగుతున్నాడు. షాట్ ఆడాలని ముందే సిద్ధమైనపుడు ధావన్ చక్కగా పొజిషన్ తీసుకుంటున్నాడు. లెగ్ గ్లాన్స్ ఆడేటపుడు పాదాల్ని చురుగ్గా కదిలిస్తున్నాడు. రోహిత్ దీనికి భిన్నంగా ఆడి వికెట్లు సమర్పించుకుంటున్నాడు.

ఈ తప్పులన్నీ రోహిత్‌కు తెలియనివి కావు. వీటిపై జట్టు సహాయ సిబ్బంది అతడి బ్యాటింగ్ వీడియోల్ని అధ్యయనం చేసి ఉంటారు. ఐతే ముందు నుంచి ఉన్న బలహీనతలు ఇప్పటికిప్పుడు వెళ్లిపోవు. అనుభవం, సాధనతో వాటిని అధిగమించాలి. రోహిత్ ఇప్పటికే దక్షిణాఫ్రికాలో 8 ఇన్నింగ్స్‌లు ఆడాడు. అక్కడి పరిస్థితులపై, ప్రత్యర్థి బౌలర్లపై అవగాహన వచ్చి ఉంటుంది. ఐతే ఒకే బౌలర్ బౌలింగ్‌లో ఆరుసార్లు ఔటవడాన్ని బట్టి అతను మానసికంగా బలహీనపడిపోయాడని అర్థమవుతోంది. బ్యాటింగ్‌లో కొన్ని సర్దుబాట్లు చేసుకుని, ఆత్మవిశ్వాసంతో ఆడటం మొదలుపెడితే రోహిత్ విజయవంతం కావచ్చేమో. వన్డేల్లో రోహిత్ రెగ్యులర్ ఆటగాడు కాబట్టి ఇప్పటికిప్పుడు అతడిపై వేటు పడకపోవచ్చు! ఇంకా రెండు వన్డేలు, మూడు టీ20లు మిగిలున్నాయి. మరి ఈ మ్యాచ్‌ల్లో అయినా రోహిత్ మార్పు చూపిస్తాడేమో.. తనదైన మెరుపులు చూపిస్తాడేమో చూద్దాం.

– ఈనాడు క్రీడావిభాగం

11.45

దక్షిణాఫ్రికాలో ఆడిన 12 వన్డేల్లో రోహిత్ సగటు. మొత్తం 126 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 23.

15.37

దక్షిణాఫ్రికాలో ఆడిన 4 టెస్టుల్లో రోహిత్ సగటు. మొత్తం 123 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 47.



"రోహిత్ దక్షిణాఫ్రికాలో ఎప్పుడూ తడబడతాడు. అందుక్కారణం అతడి ఫుట్‌వర్కే. అతను తన ముందు కాలిని ఆఫ్‌సైడ్ ఉంచి కదలకుండా ఉండిపోతాడు. ఐతే దక్షిణాఫ్రికాలో బంతి ఎక్కువ బౌన్స్, సీమ్ కావడం వల్ల అతడికి ఇబ్బందే. అందుకే ఇక్కడ అతడి సగటు 10కి అటు ఇటుగా ఉంది. తన టెక్నిక్ వల్లే రోహిత్ ఇబ్బంది పడుతున్నాడు. ఈ టెక్నిక్‌తో భారత్‌లో, ఇంకా ఆస్ట్రేలియాలో కూడా రోహిత్‌కు సమస్య ఉండదు. ఆ దేశాల్లో బంతి బౌన్స్ మాత్రమే అవుతుంది. కానీ ఇక్కడ పరిస్థితులు సీమ్‌కు అనుకూలిస్తాయి. బంతి బౌన్సూ అవుతుంది. అందుకే రోహిత్ విఫలమవుతున్నాడు"

– కెప్లెర్ వెసెల్స్, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్

దక్షిణాఫ్రికాకు జరిమానా

జొహానెస్‌బర్గ్: నాలుగో వన్డేలో స్లో ఓవర్ రేట్‌తో బౌలింగ్ చేసినందుకు దక్షిణాఫ్రికా జరిమానాకు గురైంది. ఐసీసీ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో పది శాతాన్ని, కెప్టెన్ మార్క్‌రమ్ ఫీజులో 20 శాతాన్ని జరిమానాగా విధించాడు. మైదానం అంపైర్లు అలీమ్ దార్, బొంగాని జెలె.. మూడో అంపైర్ ఇయాన్ గౌల్డ్, నాలుగో అంపైర్ షాన్ జార్జ్ దక్షిణాఫ్రికాపై అభియోగాలు మోపారు. మార్క్‌రమ్ తప్పును అంగీకరించాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదో వన్డే మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో జరగనుంది.




మిల్లర్ (39)

ఆ మెరుపులు.. ఆ వర్షం!

భారత్‌ను దెబ్బతీసిన ఆ రెండు విరామాలు

జొహానెస్‌బర్గ్: మొత్తానికి దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు 'గులాబీ' సెంటిమెంటు పని చేసింది. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కోసం గులాబీ రంగు దుస్తులు ధరించి మ్యాచ్ ఆడినపుడల్లా విజయం సాధించే ఆనవాయితీని సఫారీ జట్టు కొనసాగించింది. అనూహ్య మలుపులు తిరిగిన నాలుగో వన్డేలో ఆతిథ్య జట్టు 5 వికెట్ల తేడాతో గెలిచింది. నిజానికి ఈ మ్యాచ్‌లో మొదట భారత్ బ్యాటింగ్ సాగిన తీరు చూస్తే 'గులాబీ' సెంటిమెంటుకు కచ్చితంగా బ్రేక్ పడుతుందనే అంతా అనుకున్నారు. 31 ఓవర్లలో 178/1తో తిరుగులేని స్థితిలో ఉన్న భారత్.. 320 పైచిలుకు స్కోరు చేస్తుందనే అంచనా వేశారంతా. అప్పటికి ధావన్, కోహ్లి శతకాల దిశగా పరుగులు పెడుతున్నారు. తర్వాతి ఓవర్లో కోహ్లి (75; 83 బంతుల్లో 7×4, 1×6) ఔటైనా సరే.. ధావన్ (109; 105 బంతుల్లో 10×4, 2×6) జోరు కొనసాగిస్తూ సెంచరీ చేయడం.. ఇంకా రహానె, ధోని, శ్రేయస్ అయ్యర్, పాండ్య, భువనేశ్వర్ ఆడాల్సి ఉండటంతో దక్షిణాఫ్రికాకు కష్టసాధ్యమైన లక్ష్యాన్నే నిలిపేలా కనిపించింది భారత్. కానీ మెరుపుల వల్ల మ్యాచ్ ఆగడం భారత్‌ను దెబ్బ తీసింది. విరామానికి ముందు 34.2 ఓవర్లలో 2 వికెట్లకు 200 పరుగులు సాధించిన భారత్.. విరామం తర్వాత 15.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 89 పరుగులే చేయగలిగింది. చివరికి 289/7తో సరిపెట్టుకుంది. భారత్ మంచి ఊపుమీదుండగా ఈ అనుకోని విరామం వచ్చి లయను దెబ్బ తీసింది. ఇక దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ సందర్భంగా వచ్చిన మరో విరామం కూడా భారత్‌కు ప్రతికూలమే అయింది. ఈసారి వర్షం భారత్‌ను దెబ్బ కొట్టింది. 50 ఓవర్లలో 290 పరుగులుగా ఉన్న దక్షిణాఫ్రికా లక్ష్యం కాస్తా గంటన్నర ఆట ఆగిపోవడం వల్ల 28 ఓవర్లలో 202గా మారింది. మ్యాచ్ ఆగడానికి ముందు దక్షిణాఫ్రికా స్కోరు 7.2 ఓవర్లలో 43/1. అంటే 9 వికెట్లు చేతిలో ఉన్న దక్షిణాఫ్రికా తర్వాతి 20.4 ఓవర్లలో 159 పరుగులు చేయాల్సి వచ్చింది. దాదాపుగా టీ20గా మారింది మ్యాచ్. దీంతో ఒక్కసారిగా సఫారీల దృక్పథమే మారిపోయింది. 50 ఓవర్లలో 290 పరుగుల లక్ష్యమంటే కొంచెం నిలబడి.. ఆచితూచి ఆడాలి. అప్పుడు భారత స్పిన్నర్లను ఎదుర్కోవడం చాలా కష్టమయ్యేది. ఐతే స్కోరు-ఓవర్లు తగ్గడంతో ఎదురుదాడి మొదలుపెట్టారు. బ్యాటింగ్ తీరే మారిపోయింది. కెరీర్లో రెండో వన్డే ఆడుతున్న క్లాసెన్ (43 నాటౌట్; 27 బంతుల్లో 5×4, 1×6), అచ్చంగా టీ20 షాట్లతో చెలరేగిపోయాడు. ఫామ్‌లో లేని ఫెలుక్వాయో (5 బంతుల్లో 23; 1×4, 3×6) కూడా విరుచుకుపడ్డాడు. దీంతో ఇంకో 15 బంతులుండగానే 5 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది దక్షిణాఫ్రికా. రెండో ఇన్నింగ్స్ సందర్భంగా భారత్ వైపు నుంచి కూడా తప్పులు జరిగాయి. బ్యాట్స్‌మెన్ ఎదురుదాడి చేయడంతో స్పిన్నర్లు లయ కోల్పోయారు. ముఖ్యంగా చాహల్ పూర్తిగా లైన్ తప్పాడు. ఎలా పడితే అలా బంతులేశాడు. ఒక మంచి బంతితో మిల్లర్ (39; 28 బంతుల్లో 4×4, 2×6)ను ఔట్ చేసినా.. అది నోబాల్ కావడం ప్రతికూలమైంది. అదే మ్యాచ్‌ను మలుపు తిప్పింది. మిల్లర్ అండతో క్లాసెన్ చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ కూడా ఆశించిన స్థాయిలో లేదు. అయ్యర్ మిల్లర్ క్యాచ్ వదిలేశాడు. కోహ్లి సైతం ఒత్తిడికి గురై ఫీల్డింగ్‌లో తప్పిదాలు చేశాడు. కుల్‌దీప్ కూడా తడబడ్డాడు. మొత్తంగా ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాకు అన్నీ అలా కలిసొచ్చేశాయి. ఎలాగైతేనేం దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్ విజయం కోసం భారత్‌కు నిరీక్షణ తప్పలేదు. అయితే నాలుగో వన్డేలో భారత్ గెలిచేస్తే మిగతా మ్యాచ్‌లు నామమాత్రం అయ్యేవి. సిరీస్‌పై ఆసక్తి తగ్గేది. ఎట్టకేలకు సిరీస్‌లో దక్షిణాఫ్రికా పోటీలోకి వచ్చింది. ఆ జట్టు గెలుపుతో తర్వాతి మ్యాచ్‌పై ఆసక్తి కలిగింది. ఇది ఒకరకంగా సానుకూల అంశమే!




తన 'మార్క్' చూపించాడు

ప్యాంగ్‌చాంగ్: ఆటలో భాగంగా గాల్లో రివ్వున ఎగరాలి.. మెలికలు తిరగాలి.. అమాంతం నేలపైకి సరిగ్గా దిగాలి.. ఎంతో ప్రమాదకరమైంది స్నోబోర్డింగ్. ఈ క్రీడలో అపార ప్రతిభను చూపిన మార్క్ మెక్‌మోరిస్ ఎన్నో ఘనతలు సాధించాడు. కానీ ఆ ఆటే అతడికి ప్రాణాన్ని తీసినంత పనిచేసింది. నిరుడు మార్చిలో జరిగిన ప్రమాదంలో అతడికి 17 ఎముకలు విరిగాయి.. ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతిన్నాయి.. అసలు బతుకుతాడో లేదో అనిపించింది. చాలాకాలం అపస్మారక స్థితిలో ఉంచి అతడికి చికిత్స అందించారు. చావుతో పోరాడి గెలిచిన అతడు తనకు ప్రాణాంతక గాయాలను మిగిల్చిన ఆటను మాత్రం వదల్లేదు. ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి సాధన చేసిన కెనడా స్నోబోర్డర్ మెక్‌మోరిస్ తక్కువ కాలంలోనే మళ్లీ ఛాంపియన్‌గా నిలిచాడు. ఇప్పుడు శీతాకాల ఒలింపిక్స్‌లో కాంస్యంతో మెరిశాడు. ఆదివారం స్నోబోర్డ్ స్లోప్‌స్టైల్ విభాగంలో మార్క్ కాంస్యం నెగ్గాడు. కాంస్యం అయినా అది అతనికి స్వర్ణం కంటే ఎక్కువే. బతకడమే కష్టం అనుకున్న స్థాయి నుంచి ఒలింపిక్స్‌లో పతకం గెలిచే స్థితికి చేరుకోవడంలో అతని పట్టుదలకు నిదర్శనం. 2014లో సోచి శీతకాల ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన మార్క్... ఇతర పోటీల్లో ఎన్నో బంగారు పతకాలు సాధించాడు. 2017 మార్చిలో కెనడాలో జరిగిన ఓ పోటీలో వేగంగా వెళ్లి చెట్టుకు ఢీ కొట్టడంతో అతను తీవ్ర గాయాల పాలై మృత్యువుకు దగ్గరగా వెళ్లాడు. తిరిగి కోలుకున్న అతను గత నవంబర్‌లో జరిగిన ప్రపంచకప్‌లో విజేతగా నిలిచాడు. "గతాన్ని తలచుకోవాలని లేదు. మళ్లీ స్నో బోర్డును పట్టుకున్నందుకు ఆనందంగా ఉంది. తిరిగి పోటీల్లో పాల్గొనాలన్న కసే నన్ను ఈ స్థానంలో నిలిపింది. ఈ విజయం సంతోషాన్ని ఇస్తోంది. మళ్లీ స్నోబోర్డింగ్ చేస్తున్నాననే సంతోషం పట్టలేకపోతున్నా" అని కాంస్యం గెలిచిన అనంతరం మార్క్ అన్నాడు.



రికార్డుల వీరుడు: స్నోబోర్డింగ్ స్లోప్‌స్టైల్ విభాగంలో స్వర్ణం గెలిచిన రెడ్ గెరార్డ్ (యుఎస్) అరుదైన రికార్డులను సొంతం చేసుకున్నాడు. ఈ శతాబ్దంలో పుట్టి శీతకాల ఒలింపిక్స్‌లో పతకం సాధించిన మొదటి వ్యక్తిగా రెడ్ రికార్డు సృష్టించాడు. 2000 జూన్ 29న జన్మించిన రెడ్ వయసు 17 ఏళ్లే. స్నోబోర్డింగ్ విభాగంలో స్వర్ణం గెలిచిన పిన్న వయస్కుడు కూడా అతడే.



అదిరే స్కేటింగ్ జోడీ

గాంగ్నెంగ్: ఓ అమ్మాయి.. ఓ అబ్బాయి. ఫిగర్ స్కేటింగ్‌లో పెయిర్ విభాగం అందమే వేరు. చూపరులను ఇట్టే కట్టిపడేస్తారు. కానీ రింకులో మెలికలు తిరుగుతూ అలరించడం అంత తేలికేమీ కాదు. ఏమాత్రం సమన్వయం కొరవడినా లయ దెబ్బతింటుంది. ప్రమాదం కూడా. ఐతే భార్యాభర్తలైన అమెరికా ఫిగర్ స్కేటింగ్ క్రీడాకారులు క్రిస్, అలెక్సా నీరిమ్ చక్కటి సమన్వయంతో ఆటలో ఆకట్టుకుంటున్నారు. వ్యక్తిగత జీవితంలో అప్పుడప్పుడూ తమ మధ్య వాగ్యుద్ధాలు రావడం సహజమని అంగీకరిస్తూనే, చక్కని సమన్వయం దూసుకుపోతూ అందరినీ మెప్పిస్తోందీ జంట. రెండుసార్లు యుఎస్ విజేత అయిన ఈ జోడీ ఇప్పుడు శీతాకాల ఒలింపిక్స్‌లో పోటీపడుతోంది. పనిని ఇంటికి, ఇంటిని పనిలోకి తీసుకురావొద్దని.. కానీ అది తప్పించుకోలేనిదని వాళ్లంటారు. ఐతే చిన్న విషయం గురించి జరిగిన గొడవను వెంటనే మర్చిపోవాలని, పురుషుడిపై సంపూర్ణ విశ్వాసం ఉంచాలని అంటుంది అలెక్సా. ఆమెను గాల్లోకి విసిరేది, పట్టుకునేది, తిప్పేది అతడే మరి. "భార్తభర్తలయినా, భాగస్వాములైనా అప్పుడప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవు. మనం మనుషులం కదా! కానీ మేమైతే తగవులను తేలిగ్గానే మర్చిపోతాం. అలా మరిచిపోవడం మాకు గొప్ప ఆస్తి" అని క్రిస్ చెబుతాడు. ప్యాంగ్‌చాంగ్‌లో రింక్ రొమాన్స్ వీళ్లిద్దరికే పరిమితం కాలేదు. రష్యాకు చెందిన ప్రేమపక్షులు వ్లాదిమర్ మొరొజోవ్, ఎవ్‌గెనియా తరసోవా కూడా తమ స్కేటింగ్‌తో ఆకట్టుకుంటున్నారు. "ఆరంభం నుంచే మా మధ్య మంచి అవగాహన ఉంది. వ్లాదిమర్ ఏం చెప్పినా వినాలని నేను నిర్ణయించుకున్నా. అతడు నాకంటే పెద్ద. కానీ ఏనాడూ నాపై స్వరం పెంచలేదు" అని తమ విజయ రహస్యాన్ని వివరించింది తరసోవా.

ఉద్యమిస్తేనే ఉద్యోగాలు వస్తాయి: ఆర్.కృష్ణయ్య

ఎం.వి.పి.కాలనీ(విశాఖ), న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య తీవ్రతరమవుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమైన నోటిఫికేషన్లను విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ల కోసం రాష్ట్ర, దేశవ్యాప్తంగా నిరుద్యోగులు ఎదురుచూస్తూ ఆయా ప్రవేశ పరీక్షల కోసం చదువుతున్నారన్నారు. చదువుతో పాటు ఉద్యమిస్తేనే ఉద్యోగాలొస్తాయనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. ఆదివారం ఎంవీపీకాలనీ ఆర్.సి.రెడ్డి స్టడీ సర్కిల్‌లో జరిగిన నిరుద్యోగ గర్జన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎ.పి.పి.ఎస్.సి.గ్రూపు-1, 2, 3, 4, సర్వీస్ ఉద్యోగాల నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు గల నిరుద్యోగులతో అమరావతిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయకుంటే 5 లక్షల మందితో దిల్లీని ముట్టడిస్తామన్నారు.

తమిళనాడులో మావోయిస్టు జంట అరెస్టు

- ‘2003 అలిపిరి కేసు’తో ఒకరికి సంబంధం?
- ఆశ్రయమిచ్చిన బంధువునూ అరెస్టు చేసిన పోలీసులు

తిరువళ్ళూరు - న్యూస్‌టుడే



దశరథన్

తమిళనాడులోని తిరువళ్ళూరు జిల్లాలో శనివారం మావోయిస్టు జంట దశరథన్-శెంబగవల్లిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో ఆటోలో పారిపోతున్న వారిని చాకచక్యంగా వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోను, ప్రభుత్వ వ్యతిరేక కరపత్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్ళూరు శివారులోని పూండి అటవీప్రాంతంలో శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. అనంతరం వారిని ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శిబి చక్రవర్తి విలేకర్లతో మాట్లాడుతూ... తిరువళ్ళూరుకు చెందిన దశరథన్ తన సహచరుడు శేఖర్‌తో కలిసి 2002లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోడపత్రికలు అంటించిన కారణంగా క్యూ బ్రాంచి పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. బెయిలుపై విడుదలైన అతడు అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్నాడని పేర్కొన్నారు. 2003లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తిరుమల పర్యటనలో చోటుచేసుకున్న కారు బాంబు పేలుడు కేసులో ఇతడికి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. దశరథన్ భార్య శెంబగవల్లి అలియాస్ కనిమొళి తండ్రి మావోయిస్టు అని, ఆయన ఇప్పటికే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈమె కర్ణాటకలో ఆధునిక తుపాకులను పేల్చడంలో శిక్షణ పొందారని పేర్కొన్నారు. కొడైకెనల్‌లోనూ ఆమెపై కేసులు ఉన్నట్లు తెలిసిందన్నారు. 16 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఈ దంపతులకు దశరథన్ అన్న వెట్రి వీరపాండియన్ ఇంట్లో ఆశ్రయమిచ్చారని వెల్లడించారు. ఈ కారణంగా ఆయన్ను కూడా అరెస్టు చేశామని వివరించారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసుకున్న దశరథన్ ఇటీవల సంతానం కావాలనే కోరికతో కేరళలో చికిత్స పొందారని, అక్కడి నుంచి పూండికి తిరిగొస్తూ పోలీసులకు భార్య సహా చిక్కాడని తెలిపారు. వీరిపై అనేక ఇతర కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో టెట్ హాల్‌టిక్కెట్లు

ముసునూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) హాల్‌టిక్కెట్లు ఆదివారం నుంచి డౌన్‌లోడ్ అవుతుండటంతో ఇప్పటివరకు అభ్యర్థుల్లో ఉన్న సందేహాలు తొలగిపోయాయి. పేపరు-3 హాల్‌టిక్కెట్లు శనివారం రాత్రి 8 నుంచి అందుబాటులో ఉంటాయని ఏపీ టెట్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నా.. సైట్ తెరుచుకోలేదు. ఆదివారం ఉదయం అన్ని పేపర్ల హాల్‌టిక్కెట్లు అందుబాటులో ఉంచారు. కొన్ని ప్రాంతాల్లో సర్వర్ సమస్యల వల్ల సైట్ తెరచుకోలేదని అభ్యర్థులు వాపోయారు. తెలంగాణలో డీఎస్సీ నేపథ్యంలో ఏపీ టెట్ మరోమారువాయిదా పడుతుందేమోనని అభ్యర్థుల్లో సందేహాలు వ్యక్తమయ్యాయి. హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ అవుతుండటంతో ఆ అనుమానాలకు తెరపడినట్లయింది. విద్యాశాఖ ప్రకటించినట్టుగానే ఈనెల 21 నుంచి టెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించనున్నారు.





కాషాయఛాయలు ఉంటే పొత్తు లేనట్టే

రజనీతో కలిసి పనిచేయడంపై కమల్ స్పష్టీకరణ

చెన్నై, న్యూస్‌టుడే: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లో కాషాయ ఛాయలు ఉంటే ఆయన పార్టీతో పొత్తు ఉండదని నటుడు కమల్‌హాసన్ స్పష్టం చేశారు. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం కమల్‌హాసన్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వైవిధ్యమైన రాజకీయ మార్గాన్ని ఎంచుకుని అలాంటి రాజకీయ నేతగా పేరు సంపాదించాలన్నదే తన ఆకాంక్షగా తెలిపారు. రజనీకాంత్‌తో పొత్తు పెట్టుకుంటారా? అని కొందరు అడిగిన ప్రశ్నపై స్పందిస్తూ... తన రాజకీయ రంగు నలుపు అని, రజనీ రాజకీయ రంగు కాషాయంగా ఉండదని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. ఒకవేళ కాషాయమైె దానిని ఆయన మార్చుకోకుంటే మాత్రం పొత్తు పెట్టుకోనని స్పష్టం చేశారు.

ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

ఈనాడు అమరావతి: ప్రధానోపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశాన్ని ఆదివారం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయ రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వీస్ రూల్స్ అమలు చేయడంలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.





AUTHORISED DEALERS: Vijayawada: R.M. Hero, Ph: 2490701, 9100914968. Dasarath Hero, Ph: 7799766324. Machavaram, Ph: 97032 18818. R.M.Motors (P) Ltd, Ph: 7799766343. Gudivada: Sri Lakshmi Hero, Ph: 7799766403.Guntur: Associated Hero, Ph: 7799766413. Gautham Hero, Ph: 7799766369. Narasaraopeta: Yerramsetty Hero, Ph: 7799766375. Ongole: Associated Hero, Ph: 7799766402. Chirala: Srinivasa Hero, Ph: 7799766423.Nellore: A.M Reddy Hero, Ph: 7799766418. Sarayu Hero, 8985975079, 0861-2325117. Gudur: Viswa Sai Hero, Ph: 7799766382. Kavali: Sree Devi Motors, Ph: 7799766359. Tanuku: V. Somasundara Rao Hero, Ph: 7799766363. Bhimavaram: Reddy and Reddy Hero, Ph: 7799766388. Eluru: Sai Swarna Hero, Ph: 7799766376. Jangareddygudem: Sai Satyan Hero, Ph: 227741/ 8297 123407. Visakhapatnam: Sree Siva Sankar Hero, Ph: 7799766367. Sri Harsha Hero, Ph: 7799766357. Vizianagaram: Varalakshmi Hero, Ph: 7799766353. Anakapalli: Lakshmi Srinivasa Hero, Ph: 7799766364. Gajuwaka: Siva Sankar Hero, Ph: 7799766344. Srikakulam: Varam Hero, Ph: 7799766414. Rajahmundry: Reddy Babu Hero, Ph: 7799766352. C.P Reddy Hero, Ph: 7799766389. Kakinada: Jayaram Hero, Ph: 7799766328. Jagadeeswari Hero, Ph: 7799766424. Amalapuram: Sri Jayaram Hero, Ph: 7799766406.Anantapur: C. Thippaiah Hero, Ph: 7799766395. Narasimha Hero, Ph: 7799766381. Hindupur: Sai Teja Motors, Ph: 7799766421. Kurnool: Shariff Hero, Ph: 7799766394. Sasya Hero, Ph: 7799766354.Nandyal: Sowjanya Hero, Ph: 7799766386. Adoni: Tarun Motors, Ph: 7799766349.Tirupati: Sri Gopal Hero, Ph: 7799766348. Sri Gopal Hero (Branch), Ph: 2261105. Chitoor: Sri Gopal Hero, Ph: 7799766399.Cuddapah: Sri Gopal Hero, Ph: 7799766411. Proddutur: Sri Gopal Hero, Ph: 7799766323.

JWT.5058.2018TEL

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00